thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 171 | కరీంనగర్ శుక్రవారం, 29 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఉగ్రవాదులు మళ్లీ తోకాడిస్తే విధ్వంసమే

చెన్నై : ఆపరేషన్ సిందూర్ ఇంకా పూర్తి కాలేదని, ఉగ్రవాదులు మళ్లీ తోకాడిస్తే సర్వనాశనమేనని కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా హెచ్చరించారు. తమిళనాడులోని మదురైలో జరిగిన బీజేపీ రాష్ట్ర నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో త్రివిధ దళాలు ఉగ్ర స్థావరాలను నాశనం చేశాయన్నారు.

పాక్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్‌లను మన సైనికులు కూల్చివేశారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌కు తమిళనాడు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్ర రాజకీయాలపైనా అమిత్‌షా కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాట వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందని అన్నారు.




కామారెడ్డి : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు పడుతున్నాయి. కుండపోతగా కురుస్తున్న వానలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, నిజామాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో కురుస్తున్న వర్షాలకు వరదల్లో పలువురు చిక్కుకుపోయారు. ఈ నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించారు. సీఎం బృందం బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరి కామారెడ్డి జిల్లాకు చేరుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంట మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ సీఎస్, డీజీపీ జితేంద్ర, తదితరులు ఉన్నారు. ముందుగా ఎల్లంపల్లిలో సీఎం రేవంత్ ఏరియల్ సర్వే నిర్వహించారు. కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాలపై సమీక్షించారు సీఎం రేవంత్‌రెడ్డి. అనంతరం మెదక్, పెద్దపల్లి జిల్లాలో సీఎం బృందం ఏరియల్ సర్వే చేసింది. అనంతరం వరదలపై అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.

**ఘోష్ నివేదికపై అసెంబ్లీలో చర్చకు పెడుతాం..** ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు గోదావరి జలాలు గుండెకాయ అని ఉద్ఘాటించారు. కాళేశ్వరం ఘోష్ నివేదికపై అసెంబ్లీలో చర్చిస్తామని, మామ అల్లుడు ఎన్ని కుట్రలు చేసిన పాపాలు పోవని విమర్శించారు. అల్లుడు స్వాతిముత్యం.. మామ ఆణిముత్యమని ఎద్దేవా చేశారు. నీళ్లు నింపితే గ్రామాలే కొట్టుకపోతాయని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులో లోపాలు ఉన్నాయని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో సాంకేతిక వైఫల్యం ఉందని తెలిపారు. డిజైన్లు, నిర్మాణం, నిర్వహణ లోపం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## గులాబీ బాస్ కేసీఆర్ ఆందోళన...

### తనయుడు కేటీఆర్‌కు కీలక ఆదేశాలు




తెలంగాణలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. భారీ వర్షాల వల్ల ఏర్పడిన వరదలతో రాష్ట్ర ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులపై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల పార్టీ నేతలతో ఫోన్‌లో మాట్లాడారు. తమ వంతుగా పార్టీ శ్రేణులు సహాయక చర్యలు చేపట్టేలా చూడాలని.. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జనజీవనం అస్తవ్యస్తం కావడం పట్ల కేసీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, వరంగల్ నుండి ఖమ్మం దాకా పలు జిల్లాల్లో వరదలతో నివాసాలు నీట మునిగి, రోడ్లు తెగిపోయి రవాణా వ్యవస్థ అతలాకుతలమై, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వరద ప్రభావిత జిల్లాలకు చెందిన పార్టీ ముఖ్యనేతలకు ఫోన్లు చేసి అప్రమత్తం చేశారు.వరద బాధిత ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ వంతుగా సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇక భారీ వర్షాలతో రాష్ట్రం అతలాకుతలమైపోతుంటే సర్కార్ మాత్రం మొద్దు నిద్రపోతుంది బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. భారీ వర్షాలతో తెలంగాణ నీట మునుగుతుంటే.. సీఎం రేవంత్ మాత్రం బిహార్ ఎన్నికల యాత్రలో బిజీ అయిపోయారని ట్వీట్ చేశారు. 'భారీ వర్షాలతో తెలంగాణ నీట మునుగుతున్నది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రజలు సాయం కోసం అర్థిస్తున్నారు. సీఎం మాత్రం తీరిగ్గా బిహార్‌లో ఎన్నికల యాత్ర చేస్తున్నాడు. ఎప్పుడొస్తాయో తెలియని బిహార్ ఎన్నికల కోసం తెలంగాణకు సంబంధమే లేని బిహార్ ఎన్నికల కోసం తెలంగాణ సీఎం, మంత్రివర్గం కాంగ్రెస్ అధిష్ఠానం ముందు మోకరిల్లింది. అధిష్ఠానం ఆశీస్సులతో.. పదవులు కాపాడుకుని ఖజానా కొల్లగొట్టే ధ్యాస తప్పితే ఆరు గ్యారంటీలు 420 హామీల అమలు గురించి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి సోయి లేదు. వరదలతో ప్రజలు.. యూరియా దొరక్క రైతులు.. ఉద్యోగ నోటిఫికేషన్లు లేక నిరుద్యోగులు.. ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఉద్యోగులు ఆందోళనలో ఉన్నారు. చాలా చోట్ల వరదనీటిలో మునిగి ప్రజలు హెలికాప్టర్ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. తెలంగాణ ప్రజల సొమ్ముతో ప్రైవేట్ జెట్లలో ఊరేగుతున్న కాంగ్రెస్ సీఎం, మంత్రులకు ఓలా, ఊబర్, ర్యాపిడో క్యాబ్‌ల కన్నా అధ్వాన్నంగా 100 కిలోమీటర్ల లోపు ప్రభుత్వ కార్యక్రమాలకు హెలికాప్టర్‌ను వినియోగిస్తున్న ఈ నేతలకు ఇప్పుడైనా హెలికాప్టర్ పంపి ప్రజల ప్రాణాలు రక్షించే తీరిక ఉందో, లేదో ? కాంగ్రెస్ నేతలారా.. ఓట్లు కాదు ప్రజల పాట్లు చూడండి.

ఎన్నికలు కాదు.. ఎరువుల కోసం రైతుల వెతలు చూడండి. వరదల్లో చిక్కుకుపోయిన ప్రజలను రక్షించేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలి.' అని డిమాండ్ చేశారు.




# తెలంగాణలో కుంభవృష్టి..

## భారీ వర్షాలపై ప్రభుత్వం అలర్ట్...

### భోజనం, తాగునీటికి ప్రత్యేక ఏర్పాట్లు

హైదరాబాద్ : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో తెలంగాణ అతలాకుతలమవుతోంది. ముఖ్యంగా మెదక్, కామారెడ్డి జిల్లాలు చిగురుటాకులా వణుకుతున్నాయి. పరిస్థితి భయాందోళనకరంగా మారడంతో వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల్లు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. మంత్రులు వర్షాలపై సమీక్ష చేసి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రాణ ఆస్తి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రులు శ్రీనివాస్ రెడ్డి, నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితులను సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో మంత్రులు పాల్గొని అధికార యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చారు. రాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో మెదక్, కామారెడ్డి, నిర్మల్, సిరిసిల్ల జిల్లాలకు అదనంగా ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను పంపాలని చెప్పారు. సహాయ పునరావాస చర్యలను చేపట్టేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. మెదక్ జిల్లాలో పోచారం ప్రాజెక్టు డ్యామ్ పైనుంచి నీరు ప్రవహిస్తుందని, ఈ విషయంలో నదికి సమాంతరంగా ఉన్న కాలువకు గండి కొట్టి నీటిని విడుదల చేయాలని అధికారులకు మంత్రులు సూచించారు. ఆయా పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్లు, ఇతర సీనియర్ ఇంజనీర్లు సంబంధిత ప్రాజెక్టులు నీటి వనరుల చెంత ఉండి పరిస్థితులను సమీక్షించాలని మంత్రులు తెలిపారు. ప్రజలకు ఏ విధమైన అసౌకర్యం కలవకుండా చర్యలు చేపట్టాలని.. ముంపుకు గురైన బస్తీలు గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి ఆహారం, తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని మంత్రులు అధికారులకు చెప్పారు. భారీ వర్షాలు కురుస్తున్న జిల్లాలలో సహాయక పునరావాస చర్యలను పర్యవేక్షించడానికి, ఇతర సురక్షిత పనులను చేపట్టడానికి సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ప్రకటించారు. సచివాలయంలో 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా.. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రజల్లో విశ్వాసం కల్పించాలని కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు.

తెలంగాణ వ్యాప్తంగా ఎన్నడూ లేనంత వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా కామారెడ్డి జిల్లాలోని అర్గొండ లో 41.83 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదై రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకు కామారెడ్డిలో అంత వర్షపాతం నమోదు కాలేదని చెబుతున్నారు. వర్షాకాలం మొదలయ్యాక ఒక్క రోజులో హైయెస్ట్ రెయిన్ ఫాల్ నమోదు కావడం ఇదే తొలిసారి. ఆ తర్వాత నిర్మల్ జిల్లాలోని అక్కాపూర్ లో 32 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కామారెడ్డి లోని IDOC (కామారెడ్డి) లో 28.65 సెంటీమీటర్ల వర్షం కురిసింది. వీటి తర్వాత తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడెక్కడ ఎంత వర్షపాతం నమోదైందో వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి బికనూరు లో 27.9 సెంటీమీటర్లు, నిర్మల్ లోని వద్యాల్ లో 27.58, కామారెడ్డి లోని తాడ్వాయి లో 27, మెదక్ జిల్లాలోని సర్ధానా లో 26.33, కామారెడ్డి లోని పాత రాజంపేట్ లో 24.1 , మెదక్ లోని నాగపూర్ లో 23.65, నిర్మల్ లోని విశ్వనాథ్ పేట్ లో 23.38, నిర్మల్ లోని ముజిగి లో 22 , కామారెడ్డి లోని లింగంపేట్ లో 21.1 భారీ వర్షపాతం నమోదైంది. మరో 18 ప్రాంతాల్లో అత్యధిక భారీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం ప్రకటించింది.

# ట్రంప్ సుంకాలకు...

# భారత్ తొలి కౌంటర్ రెడీ..

## ఆ 40 దేశాలతో యాక్షన్ ప్లాన్!



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 సుంకాలపై భారత్ తొలి కౌంటర్‌కు సిద్ధమయ్యింది. ఇందులో భాగంగా యునైటెడ్ కింగ్‌డమ్, జపాన్, దక్షిణ కొరియాతో సహా 40 కీలక దేశాలకు వస్త్ర ఎగుమతులను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రకటించినట్టు బుధవారం ఒక అధికారి తెలిపారు. ఈ జాబితాలో జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, నెదర్లాండ్స్, పోలెండ్, కెనడా, మెక్సికో, రష్యా, బెల్జియం, టర్కీ, యూఏఈ, ఆస్ట్రేలియా వంటి దేశాలు ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. 'ఈ 40 దేశాలలో భారతీయ మిషన్లు సహా భారత పరిశ్రమలు నాణ్యమైన, స్థిరమైన, వినూత్న వస్త్ర ఉత్పత్తులకు నమ్మకమైన సరఫరాదారుగా తమను తాను నిలబెట్టుకుంటూ, లక్ష్య విధానాన్ని అనుసరించడానికి దీనిని ప్రతిపాదించారు' అని అధికారి పీటీఐ వార్తా సంస్థకు తెలిపారు. ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్‌లు, భారతీయ మిషన్‌లు ప్రధాన పాత్ర పోషిస్తూ భారతను స్థిరమైన, వినూత్న వస్త్ర ఉత్పత్తుల నమ్మకమైన సరఫరాదారుగా ఉంచడం ఈ ప్రణాళిక లక్ష్యం అని అధికారులు చెప్పారు. ఆగస్టు 27 నుంచి అమలులోకి వచ్చిన 50 శాతం ట్రంప్ సుంకాలు భారతీయ వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలు, రొయ్యలు, లెదర్, పాదరక్షలు, రసాయనాలు, యంత్రాలు వంటి ప్రధాన రంగాలను ప్రభావితం చేయనున్నాయి. ప్రస్తుతం 220కిపైగా దేశాలకు భారత్ ఎగుమతులు చేస్తోంది.. కానీ, అధికారికంగా యూకే, జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా సహా 40 దేశాల మార్కెట్లను ఎంపిక చేసింది. ఈ దేశాలు ఏటా మొత్తం 590 బిలియన్ డాలర్లకుపైగా విలువైన వస్త్రాలు, దుస్తులను దిగుమతి చేసుకుంటాయి. దీని వల్ల భారత్ తన మార్కెట్ వాటాను పెంచుకోవడానికి విస్తృత అవకాశాలు లభిస్తాయని, ప్రస్తుతం ఇది 5-6 శాతంగా మాత్రమే ఉందని ఆ అధికారి తెలిపారు. "దీనిని గుర్తించిన ప్రభుత్వం.. ఈ 40 దేశాలలో ప్రతిదానిలో సాంప్రదాయ, అభివృద్ధి చెందుతున్న మార్కెట్లపై దృష్టి సారించి, ప్రత్యేక కార్యాచరణకు ప్లాన్ చేస్తోంది" అని ఆయన అన్నారు. ఇందులో ఈపీసీ కీలక పాత్ర పోషించనుందని ఆ అధికారి పేర్కొన్నారు. ఈపీసీ మార్కెట్ మ్యాపింగ్ నిర్వహించి, అధిక డిమాండ్ ఉన్న ఉత్పత్తులను గుర్తిస్తుంది. అనంతరం సూరత్, పానిపట్, తిరుపూర్, భదోహి వంటి ప్రత్యేక క్లస్టర్‌లను టాప్ 40 దేశాలలోని అవకాశాలతో అనుసంధానం చేస్తుంది. ఇక, సుంకాలు రష్యా ఆర్థిక మూలాలను దెబ్బతీయడానికేనని అమెరికా సమర్థించుకుంటోంది. అలాగే, ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిళ్లు అంతర్జాతీయ వాణిజ్య ఫెయిర్లు, ప్రదర్శనలు, బయ్యర్-సెల్లర్ మీట్స్ వంటి వేదికలలో భారత పరిశ్రమ ఉనికి బలోపేతం చేయడంతో పాటు ఏకీకృత బ్రాండ్ ఇండియా గుర్తింపుతో రంగాల వారీగా ప్రత్యేక ప్రచారాలను నిర్వహిస్తాయి. అదనంగా ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్స్ వినియోగం, గ్లోబల్ సస్టైనబిలిటీ ప్రమాణాలు పాటించడం, అవసరమైన సర్టిఫికేషన్లు పొందడం వంటి అంశాలలో ఎగుమతిదారులకు మార్గనిర్దేశం చేస్తాయి. ఇదిలా ఉండగా, టారిఫ్‌ల యుద్ధం ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# వరదల ఎఫెక్ట్.. ఇళ్లు ఖాళీ చేసి..

## కామారెడ్డి జిల్లాలో కుండపోత.. ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు..!

జుక్కల్: భారీ వర్షాల కారణంగా కామారెడ్డి జిల్లాలోని పలు గ్రామాలను వరద ముంచెత్తుతోంది. ఈక్రమంలో డోంగ్లి మండలంలోని సిర్పూర్, హాసన్ టాక్లి, పెద్దటాక్లి గ్రామాల్లోని ప్రజలు ఇళ్లు ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. పొరుగు గ్రామాల్లోని తమ బంధువుల ఇళ్లలో తలదాచుకుంటున్నారు.

చిన్నారులు, వృద్ధులు మద్నూర్ మండలంలోని మిర్జాపూర్ (సలాబత్ పూర్) ఆంజనేయస్వామి ఆలయంలో తలదాచుకున్నారు. పెద్ద టాక్లీలోని కొన్ని కుటుంబాలు డోంగ్లి మండల కేంద్రానికి వెళ్లాయి. సిర్పూర్‌లో 246, పెద్దటాక్లిలో 190, హాసన్ టాక్లిలో 120 కుటుంబాల వారు తమ ఇళ్లకు తాళాలు వేశారు. పిట్లం మండలం కుర్తి గ్రామం పూర్తిగా జల దిగ్బంధంలో చిక్కుకుంది.

నియోజకవర్గంలోని నిజాంసాగర్, కౌలాస్ నాలా జలాశయాల గేట్లు ఎత్తి వరద నీటిని దిగువ మంజీరాలోకి విడుదల చేస్తున్నారు. దీంతో ముంపు గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు బాధితులకు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఇళ్లు వదిలి ఆలయాల్లో తలదాచుకున్న వాళ్లతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు

## కూలిన ప్రాజెక్టుకు.. నిలబడిన ప్రాజెక్టుకు తేడా ఉంది: సీఎం రేవంత్‌రెడ్డి



పెద్దపల్లి: గోదావరి జలాలను తెలంగాణలో ఎక్కడికి తరలించాలన్నా ఎల్లంపల్లి ప్రాజెక్టు ప్రాణవాయువు లాంటిదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌తో కలిసి ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించిన అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. స్ట్రాటజిక్ లోకేషన్‌తో కట్టిన ప్రాజెక్టు శ్రీపాద ఎల్లంపల్లి అని.. కూలిపోయిన ప్రాజెక్టు, నిలబడిన ప్రాజెక్టుకు మధ్య తేడా ఉందన్నారు. నిపుణులు కట్టిన ప్రాజెక్టు కాబట్టే ఎల్లంపల్లి దశాబ్దాలుగా నిలబడిందని పేర్కొన్నారు. మేడిగడ్డ పనికిరాకుండా పోయింది. మేడిగడ్డ రిపేరు చేయకుండా.. అన్నారం, సుందిళ్లలో నీరు నిల్వ చేయొచ్చు కదా? అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సీఎం సమాధానమిచ్చారు. అతి తెలివితేటలతో మామ, అల్లుడు .. ఒకరు స్వాతి ముత్యం, మరొకరు ఆణిముత్యం అనుకుంటారు. మేడారం, అన్నారం, సుందిళ్ల.. మూడు బ్యారేజీలు ఒకే రకమైన సాంకేతిక నైపుణ్యంతో నిర్మించారు. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి అన్నారంలో పోయాలి, అక్కడి నుంచి సుందిళ్ల, శ్రీపాద ఎల్లంపల్లిలో పోయాలి. 3 బ్యారేజీల డిజైన్‌లో, నిర్మాణంలో, నిర్వహణలో లోపం ఉంది. ఏదైనా ప్రమాదం జరిగేతే గ్రామాలకు గ్రామాలు తుడిచిపెట్టుకుపోతాయి. మేం.. 80వేల పుస్తకాలు చదవలేదు. 80 వేల పుస్తకాలు చదివిన మేధావిని సలహా అడుగుతున్నాం ఏం చేద్దామని. మేడిగడ్డ విషయంలో సాంకేతిక కమిటీ సూచనల ప్రకారం వెళ్తాం.

కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చించి ముందు కెళ్తాం" అని సీఎం స్పష్టం చేశారు. వరద పరిస్థితిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్న సీఎం.. పలు సూచనలు చేశారు.

## ప్రజలు అవస్థలు పడుతుంటే.. మూసీ సుందరీకరణపై సమీక్షలా?: కేటీఆర్



సిరిసిల్ల: వర్షాలతో ప్రజలు అవస్థలు పడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డికి పట్టింపులేనట్లుగా ఉందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. సిరిసిల్లలో వరద ప్రభావిత ప్రాంతాల్లో కేటీఆర్ పర్యటించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "వరదలు ముంచెత్తుతుంటే.. మూసీ సుందరీకరణ, ఒలింపిక్స్ క్రీడల గురించి సీఎం సమీక్ష చేస్తున్నారు.

ప్రభుత్వం పని చేయకపోయినా అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున పరిహారం ప్రకటించాలి. రైతులకు ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం చెల్లించాలి"అని డిమాండ్ చేశారు.

## పేలుళ్ల అనుమతులకు స్పష్టమైన విధివిధానాలు ఉండాలి: హైకోర్టు సీజే



హైదరాబాద్: జూబ్లీహిల్స్‌లోని న్యాయవిహార్ సమీపంలో పేలుళ్లకు ఎవరు అనుమతి ఇచ్చారని తెలంగాణ హైకోర్టు సీజే జస్టిస్ ఏకే సింగ్ ప్రశ్నించారు. ఈ మేరకు దాఖలైన పిల్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. పోలీసుల అనుమతితో పేలుళ్లు నిర్వహించారని గనులశాఖ తరఫు న్యాయవాది తెలపగా.. బ్లాస్టింగ్ తీవ్రత, రాళ్లు ఎంతదూరం పడతాయనే అంశాలపై పోలీసులకు అవగాహన ఉంటుందా అని సీజే ప్రశ్నించారు. సిటీ పోలీస్ యాక్ట్ కింద అనుమతి ఇచ్చినట్లు చెబుతున్నారని.. నగరంలో భారీగా నిర్మాణాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. పేలుళ్ల అనుమతులకు సంబంధించి స్పష్టమైన విధివిధానాలు ఉండాలని జస్టిస్ ఏకే సింగ్ అభిప్రాయపడ్డారు. ఇళ్ల నిర్మాణంలో భాగంగా భారీ పేలుళ్లు నిర్వహిస్తున్నారని సీజే ధర్మాసనానికి ఓ న్యాయమూర్తి లేఖ రాశారు. భారీ పేలుళ్లతో రాత్రివేళ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని న్యాయమూర్తి లేఖలో పేర్కొన్నారు. గుట్టలను యథేచ్ఛగా తొలగించడం వల్ల పర్యావరణం దెబ్బతింటోందన్నారు. ఆ లేఖను ధర్మాసనం గతేడాది సెప్టెంబర్‌లో సుమోటోగా తీసుకుని విచారణ చేపట్టింది. తాజాగా మరోసారి విచారణ సందర్భంగా అనుమతితోనే పేలుళ్లు నిర్వహించారని.. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలలోపు బ్లాస్టింగ్‌కు అనుమతి ఉందని ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ కోర్టుకు తెలిపారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసేందుకు ఆయన సమయం కోరారు. అనంతరం తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 16కి వాయిదా వేసింది.

## తెలంగాణలో భారీ వర్షాలు.. 36 రైళ్లు రద్దు



హైదరాబాద్: తెలంగాణలో భారీ వర్షాల నేపథ్యంలో పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. దీంతో పాటు కొన్ని రైళ్లు దారి మళ్లించినట్లు, మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. 36 రైళు రద్దు, 25 రైళ్లు దారి మళ్లింపు, 14 రైళ్లను పాక్షిక్షంగా రద్దు చేసినట్లు ఆయన వివరించారు. కామారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

పలుచోట్ల రైలు మార్గంలో వరద నీరు ముంచెత్తింది. దీంతో రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. భారీవర్షాల నేపథ్యంలో రైల్వే ప్రయాణికులకు సహాయం కోసం హెల్ప్‌లైన్ నంబర్లను రైల్వే శాఖ ప్రకటించింది. కాచిగూడ – 90633 18082, నిజామాబాద్ – 97032 96714, కామారెడ్డి – 92810 35664, సికింద్రాబాద్ – 040 277 86170 నంబర్లను సంప్రదించాలని సూచించింది.



# ఉద్ధృతంగా గోదావరి

## ఉద్ధృతంగా గోదావరి.. భద్రాచలం వద్ద పెరుగుతున్న నీటిమట్టం

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. బుధవారం వరకు తగ్గుతూ వచ్చిన గోదావరి నీటిమట్టం.. ఈరోజు ఉదయం నుంచి వేగంగా పెరుగుతోంది.

ఉదయం 10 గంటలకు గోదావరి నీటిమట్టం 37 అడుగుల వరకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటి వల్ల ఇంకా నీటిమట్టం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. చర్ల మండలంలోని తాలిపేరు జలాశయానికి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. జలాశయంలోని 24 గేట్లు వదిలి 57 వేల క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న గోదావరి నదిలోకి విడుదల చేస్తున్నారు. వరద కారణంగా శబరి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది.

నీటిమట్టం భారీగా పెరగడంతో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.



## కామారెడ్డి జిల్లాలో వర్ష బీభత్సం..

# కొట్టుకుపోయిన వంతెన

కామారెడ్డి: కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. కుంభవృష్టి ధాటికి పలుచోట్ల జనజీవనం స్తంభించిపోయింది. చాలా ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. బీబీపేట నుంచి కామారెడ్డి వెళ్లే మార్గంలో వరద నీటి దాటికి వంతెన కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి.

**కుండపోత వర్షం.. కామారెడ్డి, మెదక్ జిల్లాలు అతలాకుతలం...** మరోవైపు క్యాసంపల్లి శివారులో వరద తీవ్రతకు జాతీయ రహదారి బైపాస్ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో నిజామాబాద్ వైపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

**మెదక్–బోధన్ మార్గంలో నిలిచిన రాకపోకలు...** పోచారం జలాశాయానికి భారీగా వరద పోటెత్తడంతో మెదక్, బోధన్ ప్రధాన రహదారిపై హై లెవల్ వంతెన కొట్టుకుపోయింది.

దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. ఇరువైపులా వాహనాలు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. మరో మార్గం నుంచి వాహనాలు ప్రయాణించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు.



# మానేరు ఉగ్రరూపం

ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో మానేరు వాగు ఉగ్రరూపం దాల్చింది. రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. నర్మాల వద్ద ఎగువ మానేరు జలాశయం నిండుకుండను తలపిస్తోంది. దీంతో దిగువకు వరద నీటిని విడుదల చేశారు. మరోవైపు మిడ్ మానేరులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మధ్య మానేరు 17 గేట్ల నుంచి 33 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వచ్చే 2 గంటల్లో సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, సంగారెడ్డి, హనుమకొండ, వరంగల్, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఈ మేరకు వాతావరణశాఖ వెల్లడించింది. సిద్దిపేట, మెదక్, జనగామ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.

**నేడు, రేపు భారీ వర్షాలు...** అల్పపీడనం ప్రభావంతో నేడు, రేపు తెలంగాణలో భారీవర్షాలు కురిసే అవకాశముంది.

నేడు ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే వీలుందని వాతావరణశాఖ తెలిపింది. నేడు ఆదిలాబాద్, కుమురం భీం, మంచిర్యాల, కామారెడ్డి, మెదక్, భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని వెల్లడించింది. ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

## వరదలో చిక్కుకున్న ఐదుగురు.. రెండు హెలికాప్టర్లతో రక్షించిన ఆర్మీ అధికారులు



గంభీరావుపేట: సిరిసిల్ల జిల్లాలో వరదలో చిక్కుకున్న ఐదుగురిని ఆర్మీ సిబ్బంది రక్షించారు. గంభీరావుపేట మండలం నర్మాల వద్ద ఎగువ మానేరు ప్రాజెక్టుకు అవతలివైపు పశువులను మేపేందుకు బుధవారం ఐదుగురు వ్యక్తులు వెళ్లారు. ఒక్కసారిగా వరద రావడంతో వారంతా అక్కడే చిక్కుకున్నారు. విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ తక్షణమే స్పందించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో మాట్లాడి రెండు హెలికాప్టర్లను తెప్పించారు. ఈక్రమంలో వరదలో చిక్కుకున్న వారిని గురువారం ఆర్మీ అధికారులు రెండు హెలికాప్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతానికి తరలించారు. సహాయక చర్యలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు.




# నిండుకుండలా.. హుస్సేన్ సాగర్

భారీ వర్షాల కారణంగా హైదరాబాద్ నగరంలోని హుస్సేన్ సాగర్‌కు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పోటెత్తింది. ఫుల్ ట్యాంక్ లెవెల్ దాటినట్లు అధికారులు చెబుతున్నారు. బంజారా, పికెట్, కూకట్ పల్లి నాలాల నుంచి హుస్సేన్ సాగర్ లోకి వరద నీరు వచ్చి చేరింది. హుస్సేన్ సాగర్‌కు ఇన్ ఫ్లో 1520 క్యూసెక్కులు ఉండగా.. 1190 క్యూసెక్కుల నీరు మూసిలోకి విడుదల చేస్తున్నారు. హుస్సెన్ సాగర్ ప్రస్తుత నీటిమట్టం 513.75 మీటర్లు కాగా.. హుస్సేన్ సాగర్ ఫుల్ ట్యాంక్ లెవెల్ 513.41 మీటర్లు ఉంది. హుస్సేన్ సాగర్ నుంచి తూముల ద్వారా నీటిని మూసి లోకి వదులుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# తెలుగు సాహితీ పరిశోధనా పితామహుడు వేటూరి ప్రభాకర శాస్త్రి


## - ఆగస్టు 29...వేటూరి ప్రభాకరశాస్త్రి వర్ధంతి



ఏదో ఒక రంగాన్ని ఎన్నుకుని అందులోనే జీవితాన్ని గడిపేవారు సామాన్యులు. కోరుకుని ఎన్నుకున్న రంగంలో నిరంతర కృషి సల్పుతూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకునే వారు అసామాన్యులు. కాలానికి అన్ని రంగాల్లో విశేష కృషి చేస్తూ, ఆయా రంగాల్లో పరిపూర్ణతను సాధించి, నిష్ణాతులై, ఒక ప్రత్యేక స్థానాన్ని పొందేవారే మహనీయులు. తెలుగు సాహిత్య లోకంలో చివరి కోవకు చెందిన మహనీయులు, మహామహులు వేటూరి ప్రభాకరశాస్త్రి. తెలుగు సాహిత్యానికి సక్రమమైన రూపం కల్పించి, ప్రజలందరికీ అందించే ప్రయత్నంలో తమ జీవితాలను ధారపోసిన మహనీయుల్లో అగ్రగణ్యులు వేటూరి. చరిత్రలో లభ్యమవుతున్న, మొట్ట మొదటిదిగా భావించ బడిన తెలుగు పదము "నాగబు" అని కనుగొన్నది ఆయనే కావడం విశేషం. "భాష అడవి వంటిది- కవిత ఉద్యానవనం వంటిది. ఉద్యానవన పెంపు సొంపులకు అరణ్య పరిశోధన అవసరమైనట్లే సుకవితకి భాషా పరిశోధన అవసరం" అని గట్టిగా నమ్మారు. చిన్నతనంలోనే సంపాదించుకున్న "శతావధాని వేటూరి ప్రభాకరశాస్త్రి" అనే గొప్ప పేరును తృణ ప్రాయంగా త్యజించి, తన జీవితానికి అర్ధం పరమార్ధం అవధానం కాదని, నిరంతర పరిశోధన అని నిర్ణయించుకుని, పరిశోధనకే అంకితమైన ధన్య జీవి వేటూరి. వేటూరి ప్రభాకరశాస్త్రి (ఫిబ్రవరి 7, 1888 – ఆగష్టు 29, 1950) తెలుగు కవి, భాష పరిశోధకులు, చరిత్రకారులు, రచయిత, విమర్శకులు, రేడియో నాటక రచయిత, తెలుగు, సంస్కృత పండితులు. వేటూరి కేవలం మేధావి మాత్రమే కాదు. తెలుగు భాషా, చారిత్రక సాహిత్య నిర్మాణానికి అక్షరాలను పేర్చిన మేస్త్రీ. ఆయన రచయిత మాత్రమే కాదు. విమర్శనా వ్యాస రచనకు ఆద్యులు. పన్నెండో ఏటే పరభాషలో కవిత చేసిన అనన్య సామాన్యులు. పిన్నవయసు శతావధాని. తెలుగు లిపి ప్రాచీనతకు ఆధారంగా దొరుకుతున్న మొట్టమొదటి తెలుగు పదం "నాగబు" గురించి వెలుగు లోనికి తెచ్చిందే వేటూరే కావడం విశేషం. తరువాత కాలంలో అది 'నాగబుద్ది' అనే పేరులో చివరి అక్షరం మరుగై పోగా 'నాగబు' మాత్రమే శాస్త్రికి దొరికిందని పండితులు తేల్చారు. పదం ఏదయినా మన లిపి ప్రాచీనతను వెదకటానికి అది చాలా తోడ్పడిందనేది కాదన లేని వాస్తవం. ప్రభాకర శాస్త్రి 'నాగబు' తెలుగువారి చరిత్ర గురించిన కొత్త ఆలోచనలకు దోహదపడిందని అనేది సత్యం. తొలిసారిగా అన్నమయ్య ఉనికిని లోకానికి చాటి చెప్పింది కూడా ఆయనే. అయిదు శతాబ్దాలకు పైగా మరుగున పడిన పదకవితా పితామహుని గురించి తెలియని పరిస్థితుల్లో అన్నమయ్య జీవితం గురించి, ఆయన రచనల గురించి ఎన్నో విశేషాలను శాస్త్రి వెలుగులోకి తెచ్చారు. తాళ్ళపాక చిన్నన్న వ్రాసిన "అన్నమాచార్య చరిత్ర"ను పరిష్కరించి ప్రచురించారు. అన్నమాచార్య ఉత్సవాలకు శ్రీకారం చుట్టి, ఆయన పదాలకు ప్రాచుర్యం కల్పించారు. సి.పి. బ్రౌను గురించి, తొలి తెలుగు కవయిత్రి తిమ్మక్కను గురించీ ఈ తరానికి తెలియ జేసింది ఆయనే. కాలగర్భంలో కలిసి పోతున్న తెలుగు సంస్కృతీ చరిత్ర పునరుద్ధరణకోసం కంకణ ధారియై, దీక్షాదక్షులై సిద్ధి పొందిన తాపసి ఆయన. ప్రభాకరశాస్త్రి, కృష్ణా జిల్లా, మోపిదేవి మండలంలో కృష్ణ నది తీరమున ఉన్న పెదకళ్ళే పల్లిలో శ్రీవత్స గోత్రజులైన వేటూరి సుందరశాస్త్రి, శేషమ్మలకు 1888, ఫిబ్రవరి 7 న జన్మించారు. ప్రభాకర శాస్త్రి ప్రాథమిక విద్య స్వగ్రామము లోనే నడిచింది. తండ్రి వద్ద, మద్దూరి రామావధాని వద్ద సంస్కృతాంధ్రములను నేర్చు కొన్నారు. ఉపనయనమైన తర్వాత ప్రభాకరశాస్త్రిని ఆయన తండ్రి శాస్త్రాల అభ్యసించడానికి చల్లపల్లిలోని అద్దేపల్లి సోమనాథశాస్త్రి వద్ద చేర్పించారు. 16 యేళ్ల వయసులో, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి బందరు ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారని తెలిసి కొందరు సహాధ్యాయులతో కలిసి అక్కడ చేరారు. తెలుగులో తనకు తెలిసినదంతా చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రితో ముఖతః వినోద గోష్ఠిలో విని నేర్చుకున్నదేనని ప్రభాకర శాస్త్రి చెప్పుకున్నారు. తన 19వ యేట మద్రాసు చేరి వెస్లీ మిషన్ హైస్కూలులో తెలుగు పండితునిగా రెండేళ్ళు పనిచేశారు. ఆ సమయములో మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకశాలకు వెళ్ళి అక్కడి గ్రంథాలను చదువుతుండే వారు. ప్రభాకరశాస్త్రి, తెలుగులో అనేక కావ్యాలు రచించడముతో పాటు అనువాదాలు, వివరణా గ్రంథాలు రచించారు. ఆయన ప్రాచ్యలిఖిత పుస్తకాయములో అనేక తెలుగు గ్రంథాలను చారిత్రకాధారములతో సవివరముగా పరిష్కరించి ప్రకటించారు. శృంగార శ్రీనాథం, క్రీడాభిరామం, బసవ పురాణం, రంగనాథ రామాయణం, తంజావూరి ఆంధ్ర రాజుల చరిత్ర, ప్రాచీనాంధ్ర శాసనాలు, శతావధానాలు, పుష్పబాణుడు, రెడ్డిరాజులు, చాటుపద్య మణి మంజరి, అన్నమాచార్య కీర్తనలు, తొలి తెలుగు రచయిత్రి తిమ్మక్క తొలి తెలుగు శాసనము... తదితరాలను ఈరోజు అందుబాటులో ఉంచడానికి వేటూరి కృషియే కారణం. తమిళ, కన్నడ భాషలతో బాగా పరిచయము ఏర్పరచుకుని, ఆండాళ్ రాసిన కొన్ని తమిళ పాశురాలను తెలుగులోకి అనువదించారు. మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో విస్తృత పరిశోధనలు చేశారు. అప్పటి వరకూ వెలుగులోకి రాని ఎన్నో తాళపత్రాలు, శాసనాలు, పుస్తకాలను పరిష్కరించారు. తాను ప్రచురించిన ప్రతి గ్రంథానికీ విపుల పీఠికా నిర్మాణం గావించారు. ముప్పయి సంవత్సరాలు మద్రాసులోనే ఉండి సాహితీ సరస్వతికి ఎనలేని సేవ చేశారు. శాస్త్రి సంస్కృత రూపకాలను తెలుగులోకి అనువాదం చేశారు. తెలుగు సాహితీ లోకంలో లబ్ధప్రతిష్ఠులు, పండితులు, పరిశోధకులు, ప్రాచీన వ్యా ప్రియులు అయిన వేటూరి ప్రభాకర శాస్త్రి తెలుగు దేశంలో బాల బాలికలు పాడే పాటలు, పలికే మాటలు, చెప్పుకునే కథలు కొన్నింటిని 'సేకరించి 'భారతి' (1930) లో 'బాలభాష' అనే పేరుతో ప్రచురించారు. ప్రభాకరశాస్త్రిని కవిగా, చరిత్ర పరిశోధకులుగా, శాసన పరిశోధకులుగా, ప్రాచీనాంధ్ర సంకలన ప్రమరణకర్తగా, సంస్కృత రూపకానువాదకర్తగా, తాళపత్ర గ్రంథ వివరణ రచయితగా, అన్నమయ్య సంకీర్తన సాహిత్యోద్ధారకులుగా, అన్నమాచార్య ఉత్సవాల ప్రథమ ప్రారంభకులుగా తెలుగు ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారు. ఆయన తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయులు, తెలుగువారికి ప్రాతఃస్మరణీయులు.

**రామకిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# మాటల మాంత్రికుడు డి.వి.నరసరాజు - ఆగస్టు 28...డి.వి.నరసరాజు వర్ధంతి



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తన రచనలతో ఎన్నో మరపురాని చిత్రాలను అందించిన ప్రసిద్ధ రచయిత డి.వి. నరసరాజు. సినీ కథ, సంభాషణల రచయితగా సుప్రసిద్ధులు. ఆయన రచించిన సినిమాలలో హాస్యరసం తొణికిస లాడుతూ ప్రేక్షకుల్ని నవ్వించింది. తెలుగు పలుకుబడిని ఉపయోగించడంలో నరసరాజు అందెవేసిన చేయి. జన సామాన్య వాడుక లోని పదాలతో వారి హాస్యం వ్యంగ్యం పండించిన కృషీవలుడు డి.వి.నరసరాజు. ఆయన మౌలికంగా నాటక రంగం తెలుగు పలుకు బడిని ఉపయోగించడంలో అందెవేసిన చేయి. డి.వి. నరసరాజుగా ప్రసిద్ధుడైన దాట్ల వెంకట నరసరాజు (జూలై 15, 1920 – ఆగష్టు 28, 2006) రంగస్థల, సినిమా నటుడు, రచయిత, దర్శకుడు. 1920 జూలై 15న గుంటూరు జిల్లా, సత్తెనపల్లి మండలంలోని తాళ్లూరులో జన్మించాడు. ఆయన హేతువాది. నరసరాజు గుంటూరులోని హిందూ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసుకొని, హిందూ కళాశాలలో ఇంటర్ తర్వాత మద్రాసు లయోలా కళాశాల నుండి బి.ఎ పూర్తి చేశారు. ఇప్పుడు విజయవాడలో కలిసి పోయిన ముత్యాలంపాడు గ్రామంలో తొలి గ్రాడ్యుయేట్ దాట్ల వెంకట నరసరాజు. నాటక రచయితగా జీవితాన్ని ప్రారంభించారు. సినిమాల లోకి రాకముందు నాటక రచయితగా పేరు తెచ్చు కున్నారు. అంతర్వాణి, ఈ ఇల్లు అమ్మ బడును, వాపసు లాంటి సూపర్ హిట్ నాటకాలు రాశాడు. ఈనాడు పత్రికలో కొంతకాలం పనిచేశాడు. మొదటి నుంచి సృజనాత్మక కళల మీదే నరసరాజు దృష్టి. 1951లో పాతాళభైరవి సినిమా వందరోజుల ఉత్సవం సందర్భంగా ప్రదర్శించ బడిన నరసరాజు నాటకం "నాటకం" చూసాడు దర్శకుడు కె.వి.రెడ్డి. ఆయన ప్రతిభ చూసిన దిగ్గర్శకులు కేవీ రెడ్డి తన 'పెద్ద మనుషులు' చిత్రం ద్వారా నరసరాజును చిత్రసీమకు పరిచయం చేశారు. అలా నరసరాజు 1954లో పెద్ద మనుషులు సినిమాతో రచయితగా సినీరంగ ప్రవేశం చేశాడు. ఆ సినిమా విజయవంతం కావడం తో సినీ రచయితగా స్థిరపడ్డాడు. దొంగ రాముడు మూవీకి రచయితగా డి.వి.నరసరాజునే తీసుకున్నారు. గుండమ్మ కథకు మాటలు రాశాడు. రాముడు భీముడును సూపర్ డూపర్ హిట్ కొట్టించాడు. నరసరాజుతో ఎన్టీఆర్ కు ఎక్కువ సాన్నిహిత్యం ఉండేది. తన స్వీయ నిర్మాణంలో తెరకెక్కిన సాంఘిక చిత్రాలకు ఎక్కువగా నరసరాజుకే స్క్రిప్ట్ బాధ్యతలు అప్పగించేవారు ఎన్టీఆర్. అలా రూపుదిద్దుకున్న చిత్రాల్లో కోడలు దిద్దిన కాపురం ఒకటి. బడి పంతులు డైలాగ్స్ కోసం డబ్బులు తీసుకున్న ఆత్రేయ రాయని స్థితిలో చివరకు నరసరాజు పూర్తి చేయాల్సి వచ్చింది. యన్టీఆర్ హీరోగా రూపొందిన "నాదీ ఆడజన్మే, సి.ఐ.డి., తిక్క శంకరయ్య, బడి పంతులు, వాడే-వీడు, మగాడు, యమగోల, కేడీ నంబర్ వన్, యుగంధర్ లాంటి చిత్రాలలో ఆయన చిరకాలం గుర్తుండేలా రచనలు చేశారు. అక్కినేని హీరోగా రూపొందిన మూగనోము, గృహలక్ష్మి, జై జవాన్, ఇద్దరు అమ్మాయిలు, శ్రీరంగనీతులు, రావుగారిల్లు చిత్రాలకు నరసరాజు రచన చేశాడు. చిత్రపు నారాయణ మూర్తి తీవ్రమైన కష్టాల్లో ఉన్న పరిస్థితి చూసి సాధారణంగా పౌరాణికాలు పెద్దగా అంగీకరించని నరసరాజు భక్త ప్రహ్లాదకు పని చేశారు. రంగుల రాట్నం, రాజ మకుటం లాంటి సినిమాలు ఆయన ఖాతాలోకే వస్తాయి. యమగోల చిత్రంలో చాలా పొలిటికల్ డైలాగులు పేల్చి నరసరాజు జనంతో ఈలలు కొట్టించు కున్నారు. ఎమర్జన్సీ మీద కాంగ్రెస్ పార్టీ మీద చాలా సెటైర్లు రాయగా, తెర మీద చెప్పేది ఎన్టీఆర్ కావడంతో ఆ డైలాగ్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. నాటకం' అనే నాటకంతో రంగస్థలం మీద సంచలనం సృష్టించిన డి.వి.నరసరాజు తెర మీద కూడా రెండు సినిమాల్లో నటించారు. ఒక సినిమాకు దర్శకత్వం వహించాడు. అలా నరసరాజు 92కు పైగా సినిమాలకు కథను, మాటలను సమకూర్చాడు. ఆయన దర్శకత్వం వహించిన కొన్ని సినిమాలలో కారు దిద్దిన కాపురం ఒకటి. వి.వి. సత్య నారాయణ తొలి చిత్రం చెవిలో పువ్వులో నరసరాజు హీరోయిన్ సీత తాతగా నటించారు. మనసు-మమత చిత్రంలోనూ ఓ కీలక పాత్ర పోషించారు నరసరాజు. ఈయన చివరి సినిమా 2006 లో విడుదలైన మాయా బజార్. ఆయన 2006 ఆగష్టు 28న హైదరాబాదులో మరణించాడు. **రామకిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# హాస్యం పండించడంలో సాటి లేని మేటి భమిడిపాటి

## ఆగస్టు 28...హాస్య బ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావు వర్ధంతి



హాస్య చమత్కార యుక్త మాటలు, సంభాషణలు, రచనల కోసం జీవితాంతం తపించి, తపస్సు చేసి సిద్ధి పొందిన తాపసి భమిడిపాటి కామేశ్వర రావు. వాస్తవానికి ఆయన హాస్య సృష్టి కర్త. అందుకే హాస్య బ్రహ్మగా గుర్తింపు పొందారు. భమిడిపాటి కామేశ్వరరావు (ఏప్రిల్ 28, 1897 – ఆగష్టు 28, 1958) రచయిత, నటుడు, నాటక కర్త. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో ఏప్రిల్ 28, 1897 సంవత్సరంలో నరసావ ధానులు, లచ్చమ్మ దంపతుల కు జన్మించారు. వీరు భీమవరం లో పాఠశాల విద్యను పూర్తి చేసి, ప్రతిభావంతులైన విద్యార్థుల కిచ్చే ఉపకార వేతనం సహాయంతో, పిఠాపురం మహారాజా కళాశాలలో గణితంలో పట్టా పొందారు. తరువాత కొంత కాలం నరసాపురం, కాకినాడ లలో ఉపాధ్యాయునిగా పని చేశారు. 1922లో ఎల్.టి పరీక్షలో ఉత్తీర్ణులై రాజమండ్రి వీరేశలింగం ఆస్తిక ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర అధ్యాపక పదవిలో స్థిరపడి, అదే పాఠశాలకు రెండు సంవత్సరాలు ప్రధానోపా ధ్యాయ బాధ్యతలను కూడా నిర్వహించారు. ఉపాధ్యా యునిగా పనిచేస్తూ వీరు చాలా నాటకాలు, నాటికలు, కథలు రచించారు. సమకాలీన సాంఘిక సమస్యలను తమ రచనలలో హాస్యరసాను రంజకంగా మలచిన ప్రజ్ఞాశాలి కావడం హాస్య బ్రహ్మ అని కొనియాడ బడ్డారు. త్యాగరాజు రచనలను, జీవితాన్ని చక్కగా పరిశీలించి రాగ, తాళ, వాద్యాలను ఆ గాయకుని భావానికి అనుగుణంగా సమకూర్చుకుని 'త్యాగరాజు ఆత్మ విచారం' రచన చేశారు. తన అభిప్రాయాలకు అనుగుణంగా రచించిన తమ నాటకాలను రాజమండ్రి కళాశాల వార్షికోత్సవాలలో ఆయనే దర్శకత్వం వహించి ప్రదర్శించే వారు. ఆయన స్వయంగా నటులు కూడా. ద్విజేంద్రలాల్ రచించిన 'చంద్రగుప్త'లో శక్తి సింహ పాత్ర పోషణ ద్వారా ఖ్యాతిని పొందారు. కామేశ్వర రావు ఎక్కువగా నాటికలు ముఖ్యంగా హాస్య ప్రధానమైన రచనలు గావించారు. ఆయన నాటికలకు చాలాభాగం ఫ్రెంచి నాటక కర్త మోలియర్ వ్రాసిన నాటికలు ఆధారం. ఆయన అనేక విషయాల మీద వ్రాసిన వ్యాసాలు 20వ శతాబ్దపు మొదటి అర్ధ భాగము లోని సామాజిక పరిస్థితులను తెలియ చేస్తాయి. ఆయన హాస్యం చదువరికి చురుక్కు మనిపిస్తుంది. ఆయన ఉత్తమ మైన హాస్య రచనలతో ఎందరినో మనసారా నవ్వించిన 1958, ఆగష్టు 28 న పరమ పదించారు. భమిడిపాటి కామేశ్వర రావు అనేక హాస్య రచనల నుండి కొన్ని హాస్య పూరకమై, ఈనాటికి సందర్భ సందర్భో చితంగా ఉండేవి .....వాటిల్లో కొన్ని తీసుకుంటే...... మన తెలుగు వ్యాసం నుండి......నూటికి నూరుమంది పైచిలుకు మాట్లాడే తెలుగు కలగాపులగమే. ఈ పులగంలో సంస్కృతం, పార్శీ, ఇంగ్లీషు మాత్రం జోరుగా పడ్డాయి. తెలుగు యొక్క మెత్తదనం వల్లనే ఇన్నిన్ని భాషల పదాలు బాణాల్లాగ హృదయంలో నాటే లాగ తెలుగులో గుచ్చుకుని ఉన్నాయి. తెలుగు శరీరంలో వాటిని నిల్చి ఉండనిస్తే అవి సెలలు వేసి ప్రాణం తీసేస్తాయ ని కొందరూ, లేక వాటిని పైకి లాగిపారేస్తే వెంటనే ప్రాణం పోకట అని కొందరూ. పరీక్షలు వ్యాసం నుండి... పరీక్షల కోసం, మార్కుల కోసం మాత్రమే బాధపడే వాడికి, విద్య అంటదు. విద్యకోసం పాటుపడే వాడికి పరీక్షవల్ల బాధే ఉండదు. ...జీవితం ఒక పెద్ద నిత్య పరీక్ష. జీవిత పరీక్షకి ఎప్పుడో తయా రు అవుతానులే అనడం కాక, అప్పటికప్పుడు తయారుగా ఉండడం మానవుడి విధి. పాలక సంఘాల్లో ఎన్నికల మజా అన్న వ్యాసం నుండి... జనం పంపిన మీదట పాలక సంఘంలోకి వెళ్ళి, వెంటనే ఆ జనాన్ని మరచి పోడమే ఎన్నికల్లో మజాబీ ఒకవేళ జ్ఞాపకం ఉంచుకున్నా, ఆ జనుల్లో మొదటి జనుడు తనేగదా అనుకోడం మరీ మజా. ఒకడు పాడు పన్లు చేస్తూ వుంటే, మనం కూడా, నెగ్గా లంటే, అంతకంటే పాడుపన్లు చెయ్యవలసి వచ్చేది ఎన్నిక ల్లోనే. ఎన్నికల నిఘంటువులో అసత్యం అధర్మం, అన్యాయం, ద్రోహం క్రౌర్యం, దారుణం లాంటి మాటలుండవు. గొంతు కేన్సర్ తో జీవిత చరమాంకంలో ఇంట్లో మంచం లో పడివున్న భమిడి పాటిని చూసేందుకు వచ్చిన బంధువు లు, మిత్రులకు ఆయన ఉన్న పరిస్థితి చూసి కళ్ళవెంట నీళ్ళు వచ్చే సందర్భంలో, అంత బాధలో కూడా "అరే, అప్పుడే ఏడుస్తా రెందుకు... ఆ కన్నీళ్ళకు ఇంకా కొంత సమయం ఉంది" అనే వారంటే భమిడిపాటి హాస్య చమత్కార ప్రియత్వం అర్థం అవుతుంది. **రామకిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# అన్య భాషా మాధ్యమం వద్దు... తెలుగు మాధ్యమమే ముద్దు




ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విజ్ఞానాన్ని తెలుసుకోవడం, తెలుసుకున్న జ్ఞానాన్ని అనుభవాన్ని సంస్కృతిని, సంప్రదాయాన్ని తర్వాతి తరాలకు అందించడానికి ఉపకరించే సాధనం మాతృభాష. గతానికి వర్తమానానికి భవిష్యత్తుకు వారధి కూడా మాతృభాషే. భాష అనేది చరిత్ర గమనానికి, సామాజిక పరిణామానికి మూలాధారం. మాతృభాష అనగా శిశువుకు తల్లి ఉగ్గుపాలతో నేర్పినటువంటి భాష. ఈ మాతృభాష ప్రతి శిశువుకు సహజంగా ఎలాంటి ప్రయత్నం అవసరం లేకుండానే వస్తుంది. మాతృభాష ద్వారా నేర్చుకున్న విద్య సులభంగా అవగత మవుతుంది. అంతేకాక విద్యార్థిలో ఉన్న సృజనాత్మక శక్తులను వెలికి తీస్తుంది. తద్వారా ఇతర భాషలు నేర్చుకోవడానికి మాతృ భాష ఎంతో సహాయకారిగా ఉంటుంది. ప్రాథమిక స్థాయిలో మాతృభాషా మాధ్యమం అనివార్యమైన అవసరమని భారత రాజ్యాంగం (అధికరణం 350 ఎ), కొఠారీ కమిషన్ చెప్పింది. 2010లో భారత ప్రభుత్వం తెచ్చిన విద్యాహక్కు చట్టం విభాగం 29(2)లో ఎలిమెంటరీ స్థాయిలో వీలైనంత వరకు మాతృభాషా మాధ్యమాన్నే అమలు చేయాలని నిర్దేశించింది. నూతన జాతీయ విద్యా విధానం (2020) కూడా ఐదవ తరగతి వరకు మాతృభాష లోనే బోధన జరగాలి అని చెబుతోంది. అంతర్జాతీయ సంస్థలన్నీ- యునెస్కో, వరల్డ్ బ్యాంక్, వరల్డ్ డిక్లరేషన్ ఆన్ ఎడ్యుకేషనల్ ఫరాల్ (ఎఫ్ఎఫ్ఎ) జనరల్ అసెంబ్లీ లాంటి సంస్థలన్నీ పిల్లలకు ప్రాథమిక విద్యని మాతృభాషలో నేర్చుకునే హక్కుందని నిర్ధారించాయి. ప్రాథమిక స్థాయి వరకు తెలుగు మాధ్యమం లోనే విద్యాబోధన చేసి 6వ తరగతి తరువాత ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని, తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు రెండింటినీ కొనసాగిస్తే ఎవరికి ఇష్టమైన మాధ్యమంలో వాళ్లు విద్యాభ్యాసం చేస్తారనేది అనేకమంది వాదన. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నది తెలుగు జాతి. ప్రపంచంలో "మా తల్లి భాష మాకొద్దు, ఇతర భాషల ముద్దు" అని చెప్పగలిగే జాతి ఏదైనా ఉంది అంటే నిస్సిగ్గుగా అది తెలుగు జాతి మాత్రమే. "తెలుగుకు" పట్టిన ఈ "తెగులు" ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్ర దేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. ఆంగ్ల మాధ్యమంలో చదివితే పిల్లలు గొప్పవారు కాగలరని, తెలుగు మాట్లాడితే చులకన అనే భావన వల్ల, ఆంగ్ల భాషకు ప్రాధాన్యత పెరిగి, తెలుగు భాష నిరంతర నిర్లక్ష్యానికి గురి అవుతున్నది. తెలుగు భాషను నికోలే కొంటి "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని 1402 లోనే ప్రశంసించారు. పరభాష ద్వారా ప్రాథమిక తరగతుల విద్యార్థులకు పాఠాలు చెప్పే విధానం పూర్తిగా అశాస్త్రీయమని, కాలహరణ హేతువని, బావి పౌరులను బానిసలుగా చేస్తుందని విద్యా వేత్తలు అభిప్రాయ పడుతున్నారు. పిల్లల సొంత ఆలోచనలను పెంపొందించడానికి, వారి సాంస్కృతిక బానిసత్వానికి మార్గం ఏర్పడుతుందని, విజ్ఞానానికి - విద్యార్థులకు మధ్య ఒక అడ్డుగోడలా సృష్టిస్తుందని, తమ చుట్టూ ఉన్న జీవిత విలువలను తెలియని విద్యార్థులను, విషయ పరిజ్ఞానం లోతుగా తెలీని, ఉపాధ్యాయులు చెప్పింది చెప్పినట్లు, నోట్సు కాపీ చేస్తూ, కంఠస్తం చేసే యంత్రాలుగా మారుస్తుందని విద్యాధికుల, మానసిక శాస్త్ర వేత్తల భావన. తనకు అర్థం కాని, సాధికారికత ఏమాత్రం చేకూర్చని భాషకు సంబంధించిన విషయాలను, బట్టీ పట్టి తమ తల్లిదండ్రులను మురిపింప చేస్తూ, తమను తాము, తమ పోషకులను, మోసం చేసుకోవడం అవుతుందని విజ్ఞులు, ప్రాజ్ఞులు ఎంత మొత్తుకున్నా, అర్థం చేసుకునే వారు భూతద్దానికి అగుపించడం లేదంటే అతిశయోక్తి లేదు...మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీ భాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృధా పరిచారని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్ర శిక్ష విధించిన విషయం చరిత్ర చెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగులోకి అనుమతించడమే కాక, తన కాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబు లాగా మనలను తప్పు పడతా యని హెచ్చరించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో, కేజీ నుండి పూర్తిగా ఆంగ్ల మాధ్యమం పెడదామన్న తాజా మాజీ సీఎం జగన్ ప్రభుత్వ నిర్ణయాన్ని, హై కోర్టు నిర్ద్వందంగా త్రోసి పుచ్చింది. ఇదైనా పాలకులకు గుణపాఠం కావాలి. ప్రైవేటు పాఠశాలలో తెలుగు మాధ్యమంలో, ప్రాథమిక విద్య దాదాపు కనుమరుగయింది. తెలుగు భాషకు.. తెలుగు తనానికి చోటు లేకుండా పోతున్నది. ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు "తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లెస్" అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు రాష్ట్రాలలో తెలుగును నిర్లక్ష్యం చేస్తుంటే.... దేశ ప్రధాని నరేంద్ర మోడీ, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూ, అహమ్మదాబాద్, సూరత్ లాంటి పట్టణాలలో, తెలుగు వారికోసం తెలుగు మాధ్యమ బడులు నడిపారు. ఇప్పటికీ అవి నడుస్తూనే ఉన్నాయి. అంతే కాదు, 2017లో కేంద్ర ప్రభుత్వ బళ్ళలో కూడా తెలుగు తప్పని సరి అని ప్రధాని అన్నారు కూడా. భారత తాజా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, "మాతృ భాష కళ్ళ వంటిది, పరాయి భాష కళ్ళద్దాల వంటిది, కళ్ళు లేకుండా, అద్దాలు పెట్టుకోవడం వల్ల ఉపయోగం శూన్యం". అన్న మాటలను మననం చేసుకోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

**రామకిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# అణు బాంబు నీడలో మానవ జీవితం - అణు వ్యతిరేక ఉద్యమం అనివార్యం

## ఆగస్టు 29... అంతర్జాతీయ అణు పరీక్షల వ్యతిరేక దినోత్సవం




ప్రపంచ చరిత్రలో అణుశక్తి మానవ మేధస్సు ఆవిష్కరణకు ప్రతీకగా నిలిచినప్పటికీ, అదే శక్తి మానవ నాగరికతను నాశనం చేసే భయంకర శక్తిగా కూడా పరిణమించింది. ప్రపంచ శాంతి, మానవ రక్షణ, పర్యావరణ పరిరక్షణ అనే అంశాలు నేటి యుగంలో అత్యంత ప్రాధాన్యం సంతరించు కున్నాయి. అణు ఆయుధాలు మానవజాతికి శక్తి, ఆధిపత్యం, సాంకేతిక ప్రగతి యొక్క చిహ్నాలుగా భావించ బడినా వాటి విధ్వంసకర శక్తి ప్రపంచాన్ని పునరావృతంగా ఆలోచించేలా చేస్తోంది. అందుకే ప్రతి సంవత్సరం ఆగస్టు 29న అంతర్జాతీయ అణు పరీక్షల వ్యతిరేక దినోత్సవం జరుపు కుంటారు. 1991లో కజాఖ్‌స్తాన్ లోని సెమిపాలటిన్స్క్ అణు పరీక్షా క్షేత్రం మూతపడిన రోజు గుర్తింపుగా ఐక్యరాజ్య సమితి 2009 డిసెంబర్ 2న తీర్మానం ఆమోదించి ఈ దినోత్సవాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది. ఈ నిర్ణయం అణు పరీక్షలు మానవ జాతిపై మోపిన విపరీతమైన దుష్పరిణామాలను స్మరింప జేయడమే కాక భవిష్యత్తులో అణు ముప్పులను నివారించే ప్రయత్నాలకు ఒక బలమైన ఆహ్వానం. ప్రపంచ చరిత్రలో అణు పరీక్షల మొదటి దృశ్యం 1945 జూలై 16న అమెరికా న్యూ మెక్సికోలోని అలమోగోర్డోలో "ట్రినిటీ" పేరిట జరిగిన ప్రయోగమే. తరువాత అదే సంవత్సరం జపాన్‌పై హిరోషిమా, నాగసాకిపై అణు బాంబులు ప్రయోగించ బడినప్పుడు ప్రపంచం అణు శక్తి యొక్క భయానకతను ప్రత్యక్షంగా చూచింది. ఆ ఘోర వినాశనం లక్షలాది ప్రాణాలను బలి తీసుకున్నదే కాక తరతరాల పాటు ఆ ప్రాంతాల్లో వికలాంగత్వం, కేన్సర్లు, పర్యావరణ కాలుష్యం వంటి అపరిమిత కష్టాలను మిగిల్చింది. ఆ తర్వాత అమెరికా, సోవియట్ యూనియన్, ఫ్రాన్స్, బ్రిటన్, చైనా తదితర దేశాలు యుద్ధ కాలంలో ఆధిపత్య పోరులో భాగంగా వందలాది అణు పరీక్షలు జరిపాయి. ఈ పరీక్షలు కేవలం ఎడారులు, సముద్రాలు, భూమి గర్భానికే పరిమితం కాలేదుబీ వాటి ప్రభావం వాతావరణంలో రేడియోధార్మిక కణాలుగా వ్యాప్తి చెంది మానవ ఆరోగ్యం, పర్యావరణ సమతుల్యంపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటివరకు 2,000కి పైగా అణుపరీక్షలు జరిగాయి. వీటిలో అమెరికా 1,030, సోవియట్ యూనియన్ 715, ఫ్రాన్స్ 210, బ్రిటన్ 45, చైనా 45, భారత్ 6, పాకిస్తాన్ 6, ఉత్తర కొరియా 6 పరీక్షలు జరిపాయి. ప్రతి పరీక్ష వాతావరణంలో విష రసాయనాలు, రేడియేషన్ విడుదల చేస్తూ జీవవైవిధ్యాన్ని ముప్పుకు గురిచేసింది. సంవత్సరాలుగా అణు పరీక్షల వ్యతిరేకంగా ప్రజల నిరసనలు ఉధృతమయ్యాయి. జపాన్‌లో అణుబాంబు బాధితులు, శాంతి కార్యకర్తలు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమాలు నడిపారు. ఈ నేపథ్యంలో 1963లో అమెరికా, సోవియట్ యూనియన్, బ్రిటన్‌లు "పాక్షిక అణు పరీక్షా నిషేధ ఒప్పందం"పై సంతకం చేసి భూమి మీద, వాతావరణంలో, నీటిలో పరీక్షలను నిషేధించాయి. అయితే భూగర్భ పరీక్షలకు మాత్రం అవకాశం ఇచ్చారు. తదనంతరం 1996లో సమగ్ర అణు పరీక్షా నిషేధ ఒప్పందం (%జుదీ%) రూపొందినా అది అమల్లోకి రాలేదు, ఎందుకంటే అణు శక్తివంతమైన కొన్ని దేశాలు దానిని అనుమోదించలేదు. అయినప్పటికీ, ఆ ఒప్పందం అంతర్జాతీయ రాజకీయాల్లో అణు నియంత్రణకు ఒక ప్రధాన పునాది వేసింది. భారతదేశం 1974లో "స్మైలింగ్ బుద్ధా" పేరిట మొదటి అణుపరీక్ష, 1998లో పోఖ్రాన్-%××% పేరిట ఐదు అణుపరీక్షలు నిర్వహించింది. అయితే భారత్ ఎల్లప్పుడూ "ప్రథమంగా అణ్వస్త్ర వినియోగం చేయమని" (%చీశీ ఖీఱతీర్ ఖంవూశీశ్రీఱఎఎ%) స్పష్టంగా ప్రకటించింది. ఈ విధానం ప్రపంచానికి శాంతి సందేశాన్ని ఇస్తుంది. అణు పరీక్షల ప్రభావం మానవ జీవితంలో అనేక కోణాలలో ప్రతిఫలించింది. భూగర్భ పరీక్షల వల్ల భూకంపాలు, భూగర్భ జలాల కలుషితం, నేల పాడైపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయి. సముద్ర పరీక్షలు సముద్ర జీవ సంపదపై ఘోర ప్రభావం చూపాయి. వాతావరణంలో వ్యాపించిన రేడియోధార్మిక కణాలు ఆహార శ్రేణిలోకి చేరి తరతరాల పాటు జన్యు వ్యాధులను సృష్టించాయి. వైద్యపరమైన పరిశోధనల ప్రకారం అణు పరీక్షల పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలలో కేన్సర్, ల్యూకేమియా, థైరాయిడ్ వ్యాధులు అధికంగా కనిపించాయి. కజాఖ్‌స్తాన్ లోని సెమిపాలటిన్స్క్ ప్రాంతం, పసిఫిక్ మహాసముద్రం లోని బికినీ అటోల్ దీవులు, నెవాడా ఎడారి లాంటి ప్రాంతాలు ఈ విషాదానికి సాక్ష్యాలుగా నిలిచాయి. అంతర్జాతీయ అణు పరీక్షల వ్యతిరేక దినోత్సవం నేడు మనిషి అనుభవించిన దుర్ఘటనల జ్ఞాపకమే కాక భవిష్యత్తు పట్ల మానవజాతికి ఒక హెచ్చరిక. ఈ రోజు దేశాలు పరస్పరం నమ్మకం పెంపొందించుకొని, ఆయుధ పోటీకి బదులుగా శాంతి సహకారం వైపు నడవాలని గుర్తు చేస్తుంది. ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ శాంతి సంస్థలు, శాస్త్రవేత్తలు, పౌర సమాజం అన్ని వర్గాలు ఈ రోజు నాడు అణు పరీక్షల ముప్పును సవివరంగా చర్చించి ప్రత్యామ్నాయ భద్రతా మార్గాలను అన్వేషిస్తాయి. అణు నిరాయుధీకరణ దిశగా వియన్నా, జెనీవా వంటి నగరాల్లో అనేక చర్చలు జరుగుతాయి. ఇది కేవలం ప్రభుత్వాలకే కాక సాధారణ పౌరులకూ శాంతి పట్ల బాధ్యతను గుర్తు చేసే రోజు. అణు శక్తి శాంతి ప్రయోజనాల కోసం ఉపయోగపడే శక్తివంతమైన సాధనం కావచ్చు. విద్యుత్ ఉత్పత్తి, వైద్యరంగం, వ్యవసాయం వంటి రంగాల్లో అది సద్వినియోగం అవుతుంది. కానీ దాన్ని ఆయుధాలుగా వినియోగించడం మానవ జాతికి అస్తిత్వపరమైన ముప్పు. అందుకే అంతర్జాతీయ సమాజం అణు నిరాయుధీకరణ పట్ల కట్టుబాటుగా ఉండి అణు పరీక్షలు జరపకుండా నిబద్ధతతో ముందుకు సాగాలి. ఆగస్టు 29 మనకు చేసే బోధ ఇదే. భవిష్యత్తు తరాలకు ఒక సురక్షితమైన, శాంతియుతమైన ప్రపంచాన్ని అందించాలంటే అణు ఆయుధాల రహిత భూగోళాన్ని సాధించడానికి ప్రయత్నాలు ఆగ కూడదు. మానవ జీవన విలువను కాపాడటం, ప్రకృతి సమతుల్యతను పరిరక్షించడం, శాంతిని నిలబెట్టడం అనే మూడు లక్ష్యాల కోసం ఈ రోజు మానవ జాతి ఒకటిగా నిలబడి ఆత్మ పరిశీలన చేయాలి. ఈ విధంగా అంతర్జాతీయ అణు పరీక్షల వ్యతిరేక దినోత్సవం చరిత్రను మాత్రమే కాదు, వర్తమానం, భవిష్యత్తును కూడా ఆలోచింపజేసే సందర్భం. ఇది కేవలం ఒక జ్ఞాపక దినం కాదు, మానవజాతి తన దారిని శాంతి, సహజీవనం వైపు మళ్లించుకోవాల్సిన సమయం అని గుర్తు చేసే అంతర్జాతీయ పిలుపు. **రామకిష్టయ్య సంగనభట్ల - 9440595494**

చురకలు



చురకలు

## సంపాదకీయం

### ఆర్ఎస్ఎస్ కి మోడీ భయపడుతున్నారా ?

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ షార్ట్ కట్ లో ఆర్ఎస్ఎస్ గా ఉన్న ఈ సంస్థ ఎపుడూ చర్చల్లో ఉంటూనే ఉంటుంది. ఆర్ఎస్ఎస్ మీద ఎక్కువగా వివాదాలు మాట్లాడుతూంటాయి. ఆర్ ఎస్ ఎస్ ని మత వాద సంస్థగా పేర్కొంటాయి. విపక్షాల విమర్శలను తిప్పికొట్టడంలో బీజేపీ ముందుకు వస్తూ ఉంటుంది బీజేపీ ఆర్ఎస్ఎస్ కి రాజకీయ అంగంగా పనిచేస్తుంది అన్నది తెలిసిందే. ఆర్ఎస్ఎస్ కి అనేక అనుబంధ విభాగాలు ఉన్నాయి. ఇక ఆర్ఎస్ఎస్ విషయం చూస్తే కనుక 1925లోనే ఈ సంస్థ బ్రిటిష్ ఇండియా హయాంలో ఏర్పాటు అయింది. ఆనాడు హిందువుల కోసం పనిచేసేందుకు ఏర్పాటు చేశారు అని చెబుతారు అయితే స్వాతంత్ర ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమిటి అన్నది విపక్షాలు ముఖ్యంగా కాంగ్రెస్ కమ్యూనిస్టులు ఎపుడూ ప్రస్తావిస్తుంటాయి. అది వేరే విషయం కానీ ఇపుడు ఆర్ఎస్ఎస్ బీజేపీ మధ్యనే గ్యాప్ ఉందని వార్తలు రావడమే రాజకీయంగా ఆసక్తిని కలిగించే విషయంగా అంతా చూస్తున్నారు.

**సంఘ్ వర్సెస్ బీజేపీనా :** ఇది ఎవరూ ఎపుడూ ఊహించలేదే. ఎందుకు అంటే ఆర్ఎస్ఎస్ కి బీజేపీ ఎపుడూ విధేయంగా ఉంటుంది అని చెబుతారు. అలాగే ఆర్ఎస్ఎస్ బీజేపీకి మార్గదర్శకత్వం వహిస్తూ ఉంటుంది. బీజేపీ గెలుపు కోసం ఆర్ఎస్ఎస్ పాటుపడుతూ ఉంటుంది. ఇలా సిద్ధాంతపరంగా ఒకే మార్గంలో పయనించే ఒక కొమ్మకు రెండు పూవులు లాంటి ఆర్ఎస్ఎస్ బీజేపీల మధ్య గ్యాప్ వచ్చింది అంటేనే అది పెద్ద చర్చకు దారి తీస్తోంది అని అంటున్నారు. అయితే కాస్తా తరచి చూస్తే బీజేపీతో ఆర్ఎస్ఎస్ కి ఎలాంటి వివాదం లేదని బీజేపీకి నాయకత్వం వహిస్తూ దేశాన్ని నడుపుతున్న వారి విధానాలలోనే విభేదాలు అని అంటున్నారు.

**మోడీ ప్రభుత్వ విధానాల మీదనా :** కేంద్రంలో గత పదకొండేళ్ళుగా నరేంద్ర మోడీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వాన్ని నడుపుతోంది. అయితే బీజేపీ ఏలుబడిలో కార్పొరేట్ సంస్థలకే పెద్ద ఎత్తున లాభాలు జరిగాయని దేశంలో పేదలు మధ్యతరగతి వర్గాలకు అనుకున్న స్థాయిలో ప్రయోజనం సమకూరలేదని విమర్శలు ఉన్నాయి. కార్పొరేట్ శక్తులకు అండగా ఉండటమే కాకుండా భారీ ఆర్థిక ప్రయోజనాలు లభించేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నది సంఘ్ కి నచ్చని విధానంగా ఉంది అని అంటున్నారు. అదే సమయంలో ప్రభుత్వంలో కానీ పార్టీలో కానీ సమిష్టి నిర్ణయాలకు పెద్ద పీట వేయాలని ఆర్ఎస్ఎస్ బలంగా కోరుకుంటోంది అని చెబుతున్నారు. వ్యక్తి పూజకు బీజేపీని దూరంగా పెట్టాలని భావిస్తోంది. బీజేపీ గత పదకొండేళ్లు చూస్తే వివిధ రాష్ట్రాలలో సంస్థాగతంగా బలహీనం అయినట్లుగా ఆర్ఎస్ఎస్ భావిస్తోంది అని చెబుతున్నారు.

**కొత్త నాయకత్వం కోసం :** సంస్థ శాశ్వతం వ్యక్తులు కాదు అన్నది ఆర్ఎస్ఎస్ ప్రాథమిక సూత్రం అని అంటున్నారు. అయితే దానికి విరుద్ధంగా బీజేపీలో జరుగుతున్న తీరు పట్ల సంఘ్ పెద్దలు ఆగ్రహంగా ఉన్నారని అంటున్నారు. అందుకే 75 ఏళ్ళకే రాజకీయాల నుంచి తప్పుకోవాలని ఆర్ఎస్ఎస్ పరోక్షంగా సూచనలు ఇస్తోంది అని అంటున్నారు ఆ మధ్యన ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఇదే విషయం మీద గట్టిగానే మాట్లాడారు. మోడీ ఈ సెప్టెంబర్ 17తో 75 ఏళ్ళకు చేరువ అవుతున్న వేళ ఆర్ఎస్ఎస్ చేసిన సూచన ఆయన గురించే అని అంతా అంటున్న నేపథ్యం ఉంది.

**సంఘ్ పట్టు అలానేది :** ఇదిలా ఉంటే ఆర్ఎస్ఎస్ బీజేపీల మధ్య కొన్ని విషయాల్లో విభేదాలు ఉన్నాయని అంతా అనుకుంటూ వస్తున్నారు. వాటి విషయంలో బీజేపీ పెద్దలు కూడా పట్టించుకోలేదు. కానీ ఎపుడైతే 75 ఏళ్ళకే రాజకీయాలకు దూరం పాటించాలి అన్న రూల్ ని ఆర్ ఎస్ ఎస్ వల్లించడం మొదలెట్టిందో బీజేపీ పెద్దలకు కొంత కంగారు మొదలైంది అని అంటున్నారు. నరేంద్ర మోడీ అయితే గత పదకొండేళ్లుగా ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయానికి ఎపుడూ వెళ్ళలేదు అని గుర్తు చేస్తున్నారు. అయితే ఇటీవలే ఆయన వెళ్ళి అక్కడ ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు. దాని మీద శివసేన ఠాక్రే వర్గం నాయకుడు సంజయ్ రౌత్ ఎంతో కీలక వ్యాఖ్యలు చేశారు తన పదవిని నిలబెట్టుకోవడం కోసమే మోడీ ఆ విధంగా వెళ్లారు అని కూడా సంజయ్ రౌత్ చెప్పుకొచ్చారు. సెప్టెంబర్ 17లో మోడీ పదవి పూర్తి అవుతుందని కూడా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. అలా తొలిసారిగా మోడీ 75వ పుట్టిన రోజుని ముడిపెట్టి ఒక రాజకీయ పార్టీ నేత మాట్లాడడం జరిగింది.

**ఆర్ఎస్ఎస్ కి ప్రశంసలు :** ఇక ఈ మధ్య జరిగిన ఎర్ర కోట మీద స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మోడీ చేసిన వంద నిముషాలకు పైగా ప్రసంగంలో ఆర్ఎస్ఎస్ గురించి ఎక్కువగా మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ దేశానికి గత వందేళ్ళలో చేసిన సేవలను ఆయన ఎంతగానో కొనియాడారు. నిజానికి స్వాతంత్ర వేడుకలలో ఆర్ఎస్ఎస్ ప్రస్తావన ఎందుకు అన్నది విపక్షాలు సంధించిన ప్రశ్న ఆర్ఎస్ఎస్ కి స్వాతంత్రానికి సంబంధం ఏమిటి అని కూడా వారు విమర్శించారు. అయితే ఆర్ఎస్ఎస్ ని ప్రసన్నం చేసుకోవడం కోసమే మోడీ ఈ విధంగా వ్యవహరించారు అని కూడా వారే చెప్పుకొచ్చారు. ఆర్ఎస్ఎస్ కి మోడీ భయపడుతున్నారని కూడా విమర్శించారు.

**భయం నిజమేనా :** ఆర్ఎస్ఎస్ కి మోడీ భయపడటం నిజమేనా అంటే జరుగుతున్న ప్రచారం చూస్తే అలాగే ఉంది అని అంటున్నారు నిజానికి మోడీ ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వారే. ఆయనకు ఆర్ఎస్ఎస్ ఎలా పనిచేస్తుంది అన్నది బాగా తెలుసు అని అంటారు. ఆర్ఎస్ఎస్ ఒక నిర్ణయం తీసుకుంటే అది అమలు చేసేందుకు ఏ విధంగా వ్యవహరిస్తుందో కూడా మోడీ కంటే ఎవరికీ బాగా తెలియదు అంటారు ఈ రోజున బీజేపీలో అత్యధికులు ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చి రాజకీయంగా కీలకమైన పదవులు చేపట్టిన వారే అని అంటారు ఆర్ఎస్ఎస్ అంటే బీజేపీకి విధేయత ఈనాటికీ ఉంది. ఆర్ఎస్ఎస్ ఒక్క మాట చెబితే శిరోధార్యంగా పాటిస్తారు. ఎందరో నేతలు ఆర్ఎస్ఎస్ నిర్ణయాలకు తలొగ్గి తమ పదవులు వదులుకున్నారు. అందులో 2009 తరువాత బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న ఎల్కే అద్వానీ కూడా పదవీ త్యాగం చేశారు అని గుర్తు చేస్తారు.

**ఆర్ఎస్ఎస్ తలచుకుంటే :** ఇక ఆర్ఎస్ఎస్ మొత్తం బీజేపీని సంస్థాగతంగా పటిష్టం చేయాలని నిర్ణయించుకుంది అని అంటున్నారు. అందులో భాగంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడిని ఆర్ఎస్ఎస్ నుంచి నియమించాలని చూస్తోంది అంటున్నారు. ఇప్పటికే ఆర్ఎస్ఎస్ మనసెరిగి ఉప రాష్ట్రపతి పదవికి సంఘ్ బంధం ఉన్న సీపీ రాధాకృష్ణన్ ని మోడీ అండ్ కో ఎంపిక చేసింది అని అంటున్నారు. ఇపుడు జాతీయ అధ్యక్షుడి ఎంపిక విషయంలో ఆర్ఎస్ఎస్ మాట నెగ్గుతుంది అని అంటున్నారు. రాజస్థాన్ లోని జోధ్ పూర్ లో సెప్టెంబర్ 5 నుంచి 7 మధ్యలో మూడు రోజుల పాటు జరిగే ఆర్ఎస్ఎస్ వార్షిక సమావేశాల్లో బీజేపీ కొత్త అధ్యక్షుడి మీద కసరత్తు ఉంటుంది అని అంటున్నారు. ఇంకో వైపు మోడీ విషయంలో ఏమైనా సూచనలు ఉంటాయా అన్నది కూడా అంతా ఆలోచిస్తున్నారు. మొత్తం మీద ఆర్ఎస్ఎస్ విషయంలో మోడీ అండ్ కో సీరియస్ గా ఆలోచిస్తోందని అంటున్నారు.

## వ్యావహారిక బాషకు పితామహుడు గిడుగు రామమూర్తి - అచ్చ తెలుగు చిచ్చర పిడుగు గిడుగు - నేడు తెలుగు భాషా దినోత్సవం





తెలుగు వ్యావహారిక బాషకు పితామహుడిగా, అభినవ వాగను శాసనునిగా పేరెన్నిక గన్న గిడుగు రామమూర్తి పంతులు జన్మదినమైన ఆగస్టు 29 ను 'తెలుగు భాషా దినోత్సవము'గా తెలుగు రాష్ట్రాలు పరిగణిస్తున్నాయి. గిడుగు వెంకట రామమూర్తి (1863-1940) తెలుగు ప్రజలు స్మరించదగ్గ ప్రథమ స్మరణీయుడు గిడుగు రామమూర్తి. ఆధునిక విజ్ఞాన వ్యాప్తికి, వచన రచనకు కావ్యభాష పనికి రాదనీ, సామాన్య జనానికి అర్థమయ్యే సమకాలీన ''శిష్టవ్యావహారికం''లో ఉండాలనీ ఆనాటి సాంప్రదాయిక పండితులతో హెూరాహెూరీగా యుద్ధంచేసి ఆధునిక ప్రమాణ భాషను ప్రతిష్ఠించటానికి మార్గదర్శకుడైన వాడు గిడుగు రామమూర్తి. గిడుగు వారి వ్యవహారిక భాషోద్యమం వల్ల ఆధునిక సాహిత్యం కొత్త సొగసులు సంతరించుకుంది. రచనావైవిధ్యం, వైశిష్ట్యంతో పుష్టి చేకూరింది. విశ్వ విద్యాలయాలలో వాడుకభాష రాజ్య మేలుతోంది. పత్రికలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. అక్షరాస్యత పెరిగింది. తెలుగు అధికార భాషగా, పరిపాలనా భాషగా కీర్తికెక్కింది. దీనికంతటికీ గిడుగు పిడుగే మూలకారకుడు. గ్రాంధికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారం లోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియ జెప్పిన మహనీయుడు. ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూల పురుషుడు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది. శిష్టజన వ్యవహారిక భాషను గ్రంథరచనకు స్వీకరింప జేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చ తెలుగు చిచ్చర పిడుగు గిడుగు. గిడుగు ఉద్యమంవల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారిక భాషలో సాగి, అందరికీ అందుబాటు లోకి వచ్చింది. పండితులకే పరిమితమైన సాహిత్య సృష్టి, సృజనాత్మకశక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ వీలైంది. తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని గిడుగు రామమూర్తి. ఈ వాడుక భాషా వాదాన్ని చేపట్టినందుకు గిడుగువారు పండితులతో యుద్ధం చేయవలసి వచ్చింది. దీన్ని గ్రామ్య వాదమనీ, గిడుగు వారు గ్రామాచార్యులనీ గ్రాంధికవాదులు హేళన చేస్తూ పద్యాలూ, వ్యాసాలు రాశారు. జయంతి రామయ్య పంతులు, కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి, వేదం వెంకటరామ శాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి మొదలైన వాళ్ళతో ఢీకొనవలసి వచ్చింది. ఆంధ్రసాహిత్య పరిషత్తు గ్రాంధిక భాషావాదానికి అండగ నిలిచింది. గిడుగువారు 'తెలుగు' పత్రిక ద్వారా గ్రాంధిక వాదాన్ని ఖండిస్తూ వ్యావహారిక వాదాన్ని బల పరిచారు. పండితులే తప్పులు లేకుండా రాయలేని గ్రాంధికం బలవంతాన రుద్దడం ఎందుకంటూ "ఆంధ్ర పండిత బిషక్కుల భాషా భేషజం" అనే పుస్తకం ప్రచురించారు. తెలుగు సాహిత్యంపై పండితుల గుత్తాధి కారాన్ని పోగొట్టాడు. ప్రజలలో ఒక్కరు కూడా నిరక్షరాస్యులు కాకూడదని, అందుకు వాడుక భాష సాధనం కానీ... గ్రాంధికమని తమకే రాని, తమకే తెలియని, భాషను పిల్లలు ఉపయోగించాలనీ అందులోనే పుస్తకాలు రాయాలనీ, దానిలోనే పాఠ్య పుస్తకాలుండాలని శాసించడం అవివేకమని ఉద్యమించారు. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి, తాతా సుబ్బరాయుడు శాస్త్రి వంటి ఉద్దండ పండితులే ఆయన వాదంలోని సబబు గుర్తించారు. బల పరచారు. కుండలాల, శాలువాల పండితుల సాహిత్యాధికారం, అసంబద్ధమైన వ్యాకరణ, ఛందశ్శాస్త్ర దండనాధికారం చెల్లదన్నాడు. సాహిత్య ఫ్యూడల్ సంప్రదాయాన్ని ధిక్కరించి, నిరాకరించి నిర్మూలించి ప్రజాస్వామ్య పద్ధతిని తెలుగు సాహిత్యంలో ప్రతిష్ఠించాడు. తప్పు ఒప్పులు నిర్ణయించే అధికారం ఎవరికీ లేదన్నాడాయన. భాషకైనా, మనిషికైనా మార్పు కూర్పు చేర్పు సహజమని బోధించాడు, నచ్చచెప్పాడు. వ్యావహారిక భాషోద్యమం తెలుగు భాషలో వచ్చిన చారిత్రాత్మకమైన మార్పుకు ప్రధాన కారణం గిడుగు రామమూర్తి సారథ్యంలో నడిచిన వ్యావహారిక భాష ఉద్యమం లేదా వ్యావహారిక భాషోద్యమం. ఇది 20వ శతాబ్దపు పూర్వార్ధంలో ప్రాచీనమైన గ్రాంధిక భాషకు మరియు వ్యావహారిక లేదా వాడుక భాషకు మధ్య జరిగిన భాషా ఉద్యమం. పూర్వం తెలుగులో పాఠ్యాంశాలు అన్నీ గ్రాంధిక బాషలోనే ఉండేవి. 1907లో ఉత్తర కోస్తా జిల్లాలకు పాఠశాలాల ఇన్స్పెక్టర్‌గా వచ్చిన జె.ఎ.యేట్స్ అనే బ్రిటీష్ అధికారి ప్రజలు వ్యవహరించే భాష, పుస్తకాల భాష మధ్య ఉన్న తేడాలు చూసి ఆవేదన చెందారు. ఆయన అదే విషయాన్ని గిడుగుతో చర్చించారు. ఆ విధంగా గిడుగు జీవిత ఉత్తరార్థంలో ఈ విషయాన్ని గురించి గాఢంగా ఆలోచించి తెలుగు విద్యా విధానంలో అన్యాయం జరుగుతున్నదని గుర్తించాడు. గురజాడ, గిడుగులు, శ్రీనివాస అయ్యంగారు, యేట్సు ౧ ఈ నలుగురి ఆలోచనల వల్ల వ్యావహారిక భాషోద్యమం ఆరంభమైంది. 1919-20ల మధ్య వ్యావహారిక భాషోద్యమ ప్రచారం కొరకు 'తెలుగు' అనే మాసపత్రిక నడిపాడు. వ్యవహారిక భాషను ప్రతిఘటించిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభలో (1925, తణుకులో) నాలుగు గంటలపాటు ప్రసంగించి గ్రంథాల్లోని ప్రయోగాల్ని ఎత్తి చూపి తన వాదానికి అనుకూలంగా సమితిని తీర్మానింప జేసాడు "గిడుగు". సాహితీ సమితి, నవ్య సాహిత్య పరిషత్తు మొదలైన సంస్థలు కూడా గిడుగు వాదాన్ని బలపరచాయి. స్కూలు కాలేజీ పుస్తకాల్లో గ్రాంధికభాషే పాతుకు పోయిందిబీ కొన్నిటిలో వీరేశలింగంగారు ప్రతిపాదించిన సరళ గ్రాంధికం కూడా వచ్చింది. గిడుగు రామమూర్తి ఊరూరా ఉపన్యాసాలిస్తూ గ్రాంధికంలో ఏ రచయితా నిర్దిష్టంగా రాయలేదని నిరూపించాడు. 1919లో గిడుగు "తెలుగు" అనే మాసపత్రికను స్థాపించి తన శాస్త్రీయ వ్యాసాలతో, ఉపన్యాస పాఠాలతో అవిశ్రాంతంగా పోరాటం సాగించాడు. కాని ఆ పత్రిక ఒక ఏడాది మాత్రమే నడిచింది. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, తల్లావజుల శివశంకరశాస్త్రి, కందుకూరి వీరేశలింగం, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, వజల చిన సీతారామశాస్త్రి మొదలైన కవులు, పండితులు వ్యావహారిక భాషావాదం వైపు మొగ్గు చూపారు. 1919 ఫిబ్రవరి 28న రాజమహేంద్ర వరంలో కందుకూరి వీరేశలింగం అధ్యక్షులుగా, గిడుగు కార్యదర్శిగా "వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం" స్థాపించారు. 1924లో కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్తు అధికారికంగా వ్యావహారిక భాషా నిషేధాన్ని ఎత్తివేసింది. 1933లో గిడుగు రామమూర్తి సప్తతి మహెూత్సవం ఆయన అభిమానులు, శిష్యులు రాజమహేంద్ర వరంలో బ్రహ్మాండంగా జరిపారు. తెలికచెర్ల వెంకటరత్నం సంపాదకుడుగా ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన 46 పరిశోధక వ్యాసాలతో వ్యాస సంగ్రహం అనే ఉద్గ్రంథాన్ని ఆయనకు సమర్పించారు. 1936 లో నవ్యసాహిత్య పరిషత్తు అనే సంస్థను ఆధునికులు స్థాపించి సృజనాత్మక రచనల్లో శిష్ట వ్యావహారికాన్ని ప్రోత్సహించే "ప్రతిభ" అనే సాహిత్యపత్రికను ప్రచురించారు. 1937లో తాపీ ధర్మారావు సంపాదకులుగా "జనవాణి" అనే పత్రిక కేవలం ఆధునిక ప్రమాణ భాషలోనే వార్తలు, సంపాదకీయాలు రాయటం మొదలు పెట్టింది. వాడుక భాష గ్రామ్యభాష కాదు. సజీవ భాష. తెలుగు భాష మారుతోంది. కాబట్టి కొత్త వ్యాకరణాలు, సవరణలు వెలువడ్డాయి. నన్నయ భాషకి, తిక్కన భాషకి, ప్రబంధ బాషకి, దక్షిణాంధ్ర యుగం నాటి భాషకి చాలా భేదాలున్నాయి. వ్యావహారిక భాషావాదం ప్రాచీన సాహిత్యానికి వ్యతిరేకంగా ఏర్పడలేదు. ప్రాచీన కావ్యాలను, వ్యాకరణాలను గౌరవిస్తూనే వాడుక భాషకి ప్రాచుర్యం కల్పించాలి. వాడుక భాషలో కూడా ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించవచ్చును. ఉదాహరణ: గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కం. గ్రాంధిక భాష పండితులకే అర్థం కాదు. గొప్ప పండితులు కూడా తప్పులు లేకుండా రాయలేరు. మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక రంగాలలో విజ్ఞానం పెంపొందించు కోవాలంటే పాఠ్య గ్రంథాలు వాడుక భాషలోనే ఉండాలి. వాడుక భాష ప్రజల భాష. గ్రాంధిక భాష పండితుల భాష. ఆ రోజుల్లోనే అతనికి దగ్గర అడవుల్లో ఉండే సవరల భాష నేర్చుకొని వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక కలిగి, తెలుగు, సవర భాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని చాలా ఏళ్ళు సవర భాష నేర్చుకున్నాడు. సవర భాషలో పుస్తకాలు రాసి సొంతడబ్బుతో స్కూళ్ళు పెట్టి అధ్యాపకుల జీతాలు చెల్లించి సవరలకు వాళ్ళ భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేశాడు. మద్రాసు ప్రభుత్వం వారు ఈ కృషికి మెచ్చి 1913లో "రావ్ బహదూర్" బిరుదు ఇచ్చారు. భాషాశాస్త్రంలో అప్పుడప్పుడే వస్తున్న పుస్తకాలు చదివి వ్యాకరణ నిర్మాణ విధానం నేర్చుకొన్నారు. ముప్పై అయిదేళ్ళ కృషితో 1931లో ఇంగ్లీషులో సవర భాషా వ్యాకరణాన్ని, 1936లో సవర-ఇంగ్లీషు కోశాన్ని నిర్మించారు. మద్రాసు ప్రభుత్వం వారు గిడుగు ఆంగ్లంలో తయారుచేసిన సవరభాషా వ్యాకరణాన్ని 1931లోను, సవర-ఇంగ్లీషు కోశాన్ని 1938లోను అచ్చువేశారు. 1934లో ప్రభుత్వం అతనికి 'కైజర్-ఇ-హింద్ ' అనే స్వర్ణ పతకాన్నిచ్చి గౌరవించింది. మనదేశంలో మొట్టమొదట ఆస్ట్రో-ఏషియాటిక్ భాషా కుటుంబంలో ఒక శాఖ అయిన ముండా భాషల ఉపకుటుంబ భాషను శాస్త్రీయంగా పరిశీలించిన వాడు గిడుగు రామమూర్తి. ఆర్యభాషా వ్యవహర్తలు మన దేశానికి రాకముందు (క్రీ.పూ. 15వ శతాబ్ది) నుంచి వీళ్ళు మనదేశంలో స్థిరపడ్డారు. వీరిని "శబరు"లనే ఆదిమ జాతిగా ఐతరేయ బ్రాహ్మణం (క్రీ.పూ. 7వ శతాబ్ది) లో పేర్కొన్నారు. హైస్కూల్లో చరిత్రపాఠం చెప్పేరోజుల్లోనే దేవాలయాల్లో ఉన్న శాసనాల లిపిని స్వతంత్రంగా నేర్చుకుని చదివాడు. విషయ పరిశోధన చేసి వాటి ఆధారంగా ఎన్నో చారిత్రకాంశాలు, ముఖ్యంగా గాంగ వంశీయులను గురించి రామమూర్తి ఇంగ్లీషులో ప్రామాణిక వ్యాసాలు రాసి ప్రచురించాడు. 1911లో గిడుగు 30 ఏళ్ళ సర్వీసుతో అధ్యాపక పదవి నుంచి స్వచ్ఛందంగా రిటైరయ్యాక, ఆధునికాంధ్ర భాషాసంస్కరణ వైపు దృష్టి మరల్చాడు. గిడుగు రామమూర్తి 1940 జనవరి 15వ తేదీన ప్రజామిత్ర కార్యాలయంలో పత్రికా సంపాదకులను సంబోధిస్తూ చేసిన తన తుది విన్నపంలో వ్యావహారిక భాషా వ్యాప్తికి చాలా సంతృప్తి పొందాడు. కాని, ప్రభుత్వ విద్యాశాఖ, విశ్వ విద్యాలయాలు గ్రాంధికాన్ని వదిలిపెట్టక పోవటానికి బాధపడ్డాడు. గిడుగు జన్మదినమైన ఆగస్టు 29 ను 'తెలుగు భాషా దినోత్సవము'గా తెలుగు రాష్ట్రాలు పరిగణిస్తున్నాయి. తెలుగు వ్యావహారిక బాషకు పితామహుడిగా పరిగణించ బడే, తెలుగు బాషకు ఎనలేని సేవ చేసిన గిడుగు 1940, జనవరి 22న కన్ను మూశారు.

**రామకిష్టయ్య సంగనభట్ల - 9440595494**

## భారత హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ - ఆగస్టు 29...హాకీ దిగ్గజం ధ్యాన్ చంద్ జయంతి

ధ్యాన్ చంద్ (1905, ఆగస్టు 29 %-% 1979, డిసెంబరు 3) సాటిలేని భారతీయ హాకీ ఆటగాడు. హాకీ క్రీడలో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారుల్లో ఒకడు. గోల్స్ చేయడంలో అద్భుత ప్రతిభ కనబరిచేవారు. హాకీలో భారత్‌కు చారిత్రాత్మక విజయాలు అందిం చడంతో పాటు, ఎన్నో అరుదైన ఘనతలు సొంతం చేసుకున్నారు. భారత్ అసలు సిసలు క్రీడా దిగ్గజంగా ధ్యాన్ చంద్‌కు పేరుంది. భారత దేశానికి హాకీలో స్వర్ణ యుగంగా పరిగణించదగిన 1928, 1932, 1936 ఒలంపిక్ క్రీడల్లో వరుసగా బంగారు పతకాలు సాధించి పెట్టారు. క్రీడారంగంలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన వారికి ఖేల్ రత్న అవార్డు ఇస్తారని చాలా మందికి తెలుసు. ఈ ఖేల్ రత్న అవార్డు నిన్నటి దాకా రాజీవ్ ఖేల్ రత్నగా పిలవబడగా.. ధ్యాన్ చంద్ సేవలకు, దేశ భక్తికి గుర్తింపుగా దాని పేరు ధ్యాన్ చంద్ ఖేల్ రత్నగా కేంద్ర ప్రభుత్వం ఇటీవలే మార్చింది. హాకీ దిగ్గజం ధ్యాన్ చంద్ పుట్టిన రోజునే దేశంలో జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపు కుంటు న్నారు. దేశానికి మూడు ఒలంపిక్స్ పతకాలు అందించిన ధ్యాన్ చంద్ గురించి నేటి తరానికి పెద్దగా తెలియక పోవచ్చు. హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతి 1905 ఆగస్టు 29న ధ్యాన్‌చంద్ జన్మించారు. మెరుపు వేగంతో గేల్స్ చేయగల మాంత్రికుడిగా ఆయన క్రీడా చరిత్రలో సుస్థిర స్థానం సాధించారు. మైదానంలో పాదరసంలా కదిలిపోతూ బంతిని పూర్తిగా తన నియంత్రణలో ఉంచుకోవడంలో ఆయనకు ఎవరూ సాటిరారు. హాకీలో భారత్‌కు చారిత్రాత్మక విజయాలు అందించడంతో పాటు,ఎన్నో అరుదైన ఘనతలు సొంతం చేసుకున్నారు. భారత్ అసలు సిసలు క్రీడా దిగ్గజంగా ధ్యాన్ చంద్‌కు పేరుంది. 29 ఆగస్ట్ 1922న తన 17వ పుట్టినరోజున చంద్ బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో సిపాయిగా చేరాడు. ధ్యాన్‌చంద్ నేతృత్వంలో భారత పురుషుల హాకీ జట్టు మూడు సార్లు ప్రతిష్టాత్మక ఒలింపిక్స్ పతకాలు సాధించింది. 1928 ఆమ్‌స్టర్ డామ్,1932 లాస్ ఏంజిలెస్,1936 బెర్లిన్ ఒలింపిక్ గేమ్స్‌లో భారత్‌కు బంగారు పతకాలు అందించిన ఘనత ధ్యాన్‌చంద్‌కే దక్కింది. చంద్రుడి వెలుతురు లోనూ ఆయన ప్రాక్టీస్ చేసేవారు. అందుకే ఆయన్ను ముద్దుగా చంద్‌గా పిలిచేవారు.



1936నాటి ఒలంపిక్స్ సందర్భంగా బెర్లిన్‌లో పెద్ద ఎత్తున ధ్యాన్ చంద్ పోస్టర్లు వెలిశాయి. ధ్యాన్ చంద్ ఆట చూసేందుకు స్టేడియంకు రావాలంటూ ఆయన ఫ్యాన్స్ ఈ పోస్టర్లు ఏర్పాటు చేశారు. ఆ ఒలంపిక్స్ హాకీ ఫైనల్ మ్యాచ్ లో భారత్ జర్మనీతో తలపడింది. ఆ ఫైనల్ మ్యాచ్ లో భారత్ 16-1 తేడాతో జర్మనీని మట్టి కరిపించింది. భారత్ పక్షాన ధ్యాన్ చంద్ 15 గోల్స్ చేసి చరిత్ర సృష్టించాడు. ఫైనల్స్‌లో ద్వితీయార్థంలో ధ్యాన్ చంద్..తన షూ, సాక్స్‌ను తీసేసి మ్యాచ్ ఆడారు. అయినా మూడు గోల్స్ సాధించి ఔరా అనిపించే ఆట ప్రదర్శించారు. ఆ సమయంలో స్టేడియంలో దాదాపుగా 25 వేల మంది ప్రేక్షకులతో పాటు గొప్ప నియంతగా పేరొందిన ఎడల్ఫ్ హిట్లర్ కూడా ఆ మ్యాచ్ ని తిలకించాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం ధ్యాన్ చంద్ వద్దకి వచ్చిన హిట్లర్ తన సహచరులతో "అతడి హాకీ స్టిక్ విరగ్గొట్టి చూడండి.. అందులో తప్పకుండా ఏదో అయస్కాంతం ఉండి ఉంటుంది లేకపోతే ఇలా ఎలా ఆడతాడు" అని హాకీ స్టిక్ విరగ కొట్టగా ఎలాంటి అయస్కాంతమూ దొరకలేదు. దాంతో కంగుతిన్న హిట్లర్ అదేరోజు రాత్రి ధ్యాన్ చంద్ ని తన వద్దకు పిలిపించుకొని హాకీ ఆట కాకుండా నువ్వు ఏమేమి చేస్తావని ధ్యాన్ చంద్ ని అడగగా "నేను ఆర్మీలో సుబేదార్ గా పని చేస్తున్నానని సమాధానం ఇచ్చాడు. హిట్లర్ "ధ్యాన్ చంద్, నీ దేశము నీకేమిచ్చింది..? ఈరోజుకు నువ్వు కేవలం సుబేదార్ వి. జర్మనీ హాకీ జట్టు తరపున ఆడితే తక్షణమే నిన్ను ఎయిర్ ఫీల్డ్ మార్షల్ గా నియమిస్తానని చెప్తూతుండగా...తమరు ఎన్ని పదవులు ఇచ్చినా, ఎంత డబ్బు ఇచ్చిన నేను నా దేశానికి మాత్రమే ఆడుతాను. పరాయి దేశాలకోసం ఆడను.." అని తెగేసి చెప్పగానే హిట్లర్ నిర్ఘాంతపోయి తలదించు కున్నట్లు చెపుతారు. ఒకసారి తను గోల్ వేసిన తరువాత అది పడకపోతే తను గోల్ వేసిన విధానం చూసి గోల్పోస్ట్ కొలతలు సరిచూడ వలసిందిగా అంపైర్ ను కోరగా అది సరియైన గుర్తింపుగా అందరి మన్ననలు పొందారు. ఓ మ్యాచ్ సందర్భంగా ధ్యాన్ చంద్ ప్రత్యర్థులపై ఒక్క గోల్ కూడా చేయలేక పోయారు. గోల్ పోస్ట్ విషయంలో రిఫరీకి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత పరిశీలనలో గోల్ పోస్ట్ అంతర్జాతీయ ప్రమా ణాలకు అనుగుణంగా లేనట్లు రుజువు అయింది. 1926 నుండి ఆయన 185 మ్యాచ్ ల్లో 570 గోల్స్ చేసి 1949 వరకు అంతర్జా తీయంగా ఆడారు. 2002లో ఢిల్లీలోని నేషనల్ స్టేడియంకు ధ్యాన్ చంద్ నేషనల్ స్టేడియంగా నామకరణం చేశారు. అలాగే అలిఘడ్ ముస్లిం యూని వర్సిటీలోని ఓ హాస్టల్‌కు ఆయన పేరు పెట్టారు. లండన్‌లోని ఇండి యన్ జింకానా క్లబ్‌కు ధ్యాన్ చంద్ పేరు పెట్టారు. ధ్యాన్ చంద్ పేరిట పోస్టల్ స్టాంప్ విడుదల చేసి భారత ప్రభుత్వం గౌరవించింది. ఇప్పటి వరకు ఆ గౌరవాన్ని పొందిన ఏకైక భారత హాకీ క్రీడాకారుడు ఆయనే. 34 సంవత్సరాల సేవ తర్వాత, ఆయన 29 ఆగస్టు 1956న భారత సైన్యం నుండి లెఫ్టినెంట్ (యాక్టింగ్ కెప్టెన్ ) గా పదవీ విరమణ చేశారు . భారత ప్రభుత్వం అదే సంవత్సరం ధ్యాన్ చంద్ కు భారతదేశ మూడవ అత్యున్నత పౌర పురస్కా రమైన పద్మ భూషణ్‌తో సత్కరించింది.

**రామకిష్టయ్య సంగనభట్ల - 9440595494**

## తెలుగుకు పునర్వైభవం తేవాలి... తెలుగుకు పట్టిన తెగులును వదిలించాలి - తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా

జంతువుల నుండి మానవుని వేరు చేసేది భాష ఒక్కటే. భాష లేకపోతే మన భావాలను ఇతరులతో వ్యక్తీకరించడం సాధ్యం కాదు. సమాజం ద్వారా వ్యక్తి లోనికి ప్రవేశించి వ్యక్తిని సామాజికుడిని చేసేది మాతృభాష. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విజ్ఞానాన్ని తెలుసుకోవడం, తెలుసుకున్న జ్ఞానాన్ని అనుభవాన్ని సంస్కృతిని, సంప్రదాయాన్ని తర్వాతి తరాలకు అందించడానికి ఉపకరించే సాధనం మాతృభాష. గతానికి వర్తమానానికి భవిష్యత్తుకు వారధి కూడా మాతృభాషే. భాష అనేది చరిత్ర గమనానికి, సామాజిక పరిణామానికి మూలాధారం. మాతృభాష అనగా శిశువుకు తల్లి ఉగ్గుపాలతో నేర్పినటువంటి భాష. ఈ మాతృభాష ప్రతి శిశువుకు సహజంగా ఎలాంటి ప్రయత్నం అవసరం లేకుండానే వస్తుంది. మాతృభాష ద్వారా నేర్చుకున్న విద్య సులభంగా అవగత మవుతుంది. అంతేకాక విద్యార్థిలో ఉన్న సృజనాత్మక శక్తులను వెలికి తీస్తుంది. తద్వారా ఇతర భాషలు నేర్చుకోవడానికి మాతృ భాష ఎంతో సహాయకారిగా ఉంటుంది. ఇదంతా గత కాలం గురించి పూర్తిగా తెలిసిన తెలుగు వారికి, తెలియనిది ఏమీ కాదు. ఆంగ్ల మాధ్యమంలో చదివితే పిల్లలు గొప్పవారు కాగలరని, తెలుగు మాట్లాడితే చులకన అనే భావన వల్ల, ఆంగ్ల భాషకు ప్రాధాన్యత పెరిగి, తెలుగు భాష నిరంతర నిర్లక్ష్యానికి గురి అవుతున్నది. తెలుగు భాషను నికోలే కొంటి "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని 1402 లోనే ప్రశంసించారు. పరభాష ద్వారా ప్రాథమిక తరగతుల విద్యార్థులకు పాఠాలు చెప్పే విధానం పూర్తిగా అశాస్త్రీయమని, కాలహరణ హేతువని, బావి పౌరులను బానిసలుగా చేస్తుందని విద్యా వేత్తలు అభిప్రాయ పడుతున్నారు. పిల్లల సొంత ఆలోచనలను పెంపొందించడానికి, వారి సాంస్కృతిక బానిసత్వానికి మార్గం ఏర్పడుతుందని, విజ్ఞానానికి - విద్యార్థులకు మధ్య ఒక అడ్డుగోడలా సృష్టిస్తుందని, తమ చుట్టూ ఉన్న జీవిత విలువలను తెలియని విద్యార్థులను, విషయ పరిజ్ఞానం లోతుగా తెలీని, ఉపాధ్యాయులు చెప్పింది చెప్పినట్లు, నోట్సు కాపీ చేస్తూ, కంఠస్తం చేసే యంత్రాలుగా మారుస్తుందని విద్యాధికుల, మానసిక శాస్త్ర వేత్తల భావన. తనకు అర్థం కాని, సాధికారికత ఏమాత్రం చేకూర్చని భాషకు సంబంధించిన విషయాలను, బట్టి పట్టి తమ తల్లిదండ్రులను మురిపింప చేస్తూ, తమను తాము, తమ పోషకులను, మోసం చేసుకోవడం అవుతుందని విజ్ఞులు, ప్రాజ్ఞులు ఎంత మొత్తుకున్నా, అర్థం చేసుకునే వారు భూతద్దానికీ అగుపించడం లేదంటే అతిశయోక్తి లేదు... మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీ భాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృధా పరిచారని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్ర శిక్ష విధించిన విషయం చరిత్ర చెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగులోకి అనువదించడమే కాక, తన కాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబు లాగా మనలను తప్పు పడతాయని హెచ్చరించారు. ప్రఖ్యాత ఆంగ్ల కవి విలియం షేక్స్పియర్ ఏమి చదవుకుని, ఆంగ్ల సాహిత్య శిఖరంలా ఎదిగారనేది అర్థం చేసుకోవాలి. భారతావనిలో హిందీ 366 మిలియన్ల, బెంగాలీ 83 మిలియన్ల, తెలుగు 74 మిలియన్ల, తర్వాత మరాఠీ 72, తమిళం 61, కన్నడం 55, ఉర్దూ 52, గుజరాతీ 46, మలయాళం 33, ఒరియా 33 మిలియన్ల మంది మాట్లాడుతూ 10 స్థానాలలో ఉన్నారు. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నది తెలుగు జాతి. ప్రపంచంలో "మా తల్లి భాష మాకొద్దు, ఇతర భాషల ముద్దు" అని చెప్పగలిగే జాతి ఏదైనా ఉంది అంటే నిస్సిగ్గుగా అది తెలుగు జాతి మాత్రమే. "తెలుగుకు" పట్టిన ఈ "తెగులు" ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్ర దేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో, కేజీ నుండి పూర్తిగా ఆంగ్ల మాధ్యమం పెడదామన్న మాజీ సీఎం జగన్ ప్రభుత్వ నిర్ణయాన్ని, హై కోర్టు నిర్ద్వందంగా త్రోసి పుచ్చింది. ఇదైనా పాలకులకు గుణపాఠం కావాలి. ప్రైవేటు పాఠశాలలో తెలుగు




మాధ్యమంలో, ప్రాథమిక విద్య దాదాపు కనుమరుగయింది. తెలుగు భాషకు... తెలుగు తనానికి చోటు లేకుండా పోతున్నది. ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు "తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లేస్" అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు రాష్ట్రాలలో తెలుగును నిర్లక్ష్యం చేస్తుంటే.... దేశ ప్రధాని నరేంద్ర మోడీ, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూ, అహమ్మదాబాద్, సూరత్ లాంటి పట్టణాలలో, తెలుగు వారికోసం తెలుగు మాధ్యమ బడులు నడిపారు. ఇప్పటికీ అవి నడుస్తూనే ఉన్నాయి. అంతే కాదు, 2017లో కేంద్ర ప్రభుత్వ బళ్ళలో కూడా తెలుగు తప్పని సరి అని ప్రధాని అన్నారు కూడా. భారత ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, "మాతృ భాష కళ్ళ వంటిది, పరాయి భాష కళ్ళద్దాల వంటిది, కళ్లు లేకుండా, అద్దాలు పెట్టుకోవడం వల్ల ఉపయోగం శూన్యం". అన్న మాటలను మననం చేసుకోవాలి. గొప్పలను ప్రదర్శించడం కాదు... గొప్పలను నిలబెట్టు కోవడమే గొప్ప.

**రామకిష్టయ్య సంగనభట్ల - 9440595494**

చురకలు



# సాగుకు ఊతం.. ఉపాధితో లాభం

చేగుంట: గ్రామాల్లో వలసలను నివారించి స్థానికంగానే ఉపాధి కల్పించాలనే ఉద్దేశంలో కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. కాలానుగుణంగా నూతన పనులను చేరుస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో చెరువులు, కుంటలు, కాలువలు, మొక్కల పెంపకం, చేపల చెరువులు వంటి వాటితో పాటు రెండేళ్లుగా ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుంటోంది. 100 శాతం రాయితీతో ఇచ్చే కింది పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుంటే ఎంతో ప్రయోజనం ఉంటుంది.

**పశువుల పాకలు:** యూనిట్ ధర రూ.98 వేలు. మూడు పశువులు కచ్చితంగా ఉన్న వారికే ప్రాధాన్యం. మేకలు లేదా గొర్రెల షెడ్లు: యూనిట్ ధర రూ.98 వేలు. 10 మేకలు లేదా గొర్రెలు ఉన్న వారే పథకానికి అర్హులు.

**పౌల్ట్రీ షెడ్లు:** ఒక యూనిట్ ధర(మండలానికి కేవలం ఐదు) రూ.25 వేలు. రైతు షెడ్డును నిర్మించుకొని 100 నాటు కోడిపిల్లలను పెంచాల్సి



ఉంటుంది. 1000 నాటు కోడిపిల్లలు పెంచేందుకు రూ.3 లక్షలు చెల్లిస్తారు.

**అజోల్లా పెంపకం:** యూనిట్ ధర రూ.20 వేలు. రైతులకు మాత్రమే అందజేస్తారు.

**వర్మీ కంపోస్టు గుంతలు:** యూనిట్ ధర రూ.15 వేలు. రైతులు సామూహికంగా లేదా వ్యక్తిగతంగా చేసుకోవచ్చు.

**ఇంకుడు గుంతలు:** ఒక్కో యూనిట్కు రూ.6,500 చొప్పున ఇస్తారు.

నిబంధనల ప్రకారమే పనులు...

ఎస్సీ, ఎస్టీ రైతులకు సంబంధించి సాగులో లేని భూముల్లో అభివృద్ధి పనులు, వ్యక్తిగత పనులు అందుబాటులో ఉంటాయి. లబ్ధిదారులు ఉపాధి హామీ పథకంలో నిబంధనల ప్రకారం మంజూరైన పనులు చేయాల్సి ఉంటుంది. పలు యూనిట్లకు కూలీల ఖర్చు, సామగ్రి ఖర్చులు కలిపి అందిస్తారు. మండల స్థాయిలో ఏపీవో, ఈసీ, టీఏ లేదా గ్రామస్థాయిలో క్షేత్ర సహాయకుడు లేదా పంచాయతీ కార్యదర్శులకు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి.

పంచాయతీలు: 493
ఉపాధి జాబ్ కార్డులు: 1,64,322
పనిచేస్తున్న జాబ్కార్డులు: 1,13,484
కూలీలు: 3,31,431
పనిచేసేవారు: 2,09,344

# పెట్టుబడి భారం.. సాగుకు దూరం

గుర్రంపోడు : రెండు దశాబ్దాల క్రితం నల్గొండ జిల్లాలో బత్తాయి సాగుకు రైతులు అత్యంత ఉత్సాహం చూపేవారు. ఎకరం భూమి ఉన్నా తగ్గకపోయేవారు. కాని నేడు పరిస్థితి విభిన్నం. బత్తాయి అంటేనే భయాందోళన చెందుతున్నారు. తెగుళ్ల బెడద, దిగుబడి తగ్గి, ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగి సాగు భారంగా మారింది. దీనికి తోడు మార్కెట్లో ధరలు కూడా తగ్గుతూ వస్తుండటంతో రైతులను కుంగదీస్తున్నాయి. దీంతో ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. ఇరవై ఏళ్ల కిందట ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు పైగానే విస్తీర్ణంలో సాగవగా నేడు అధికారిక లెక్కల ప్రకారం 40వేల ఎకరాలకు లోపే ఉండటం ఇందుకు నిదర్శనం.

**తగ్గుతున్న దిగుబడి**

వేరుకుళ్లు వంటి తెగుళ్లు విజృంభించడంతో నియంత్రించలేని రైతులు బత్తాయి తోటలను వదిలేశారు. వేళ్లతో సహా చెట్లను తొలగించి పత్తి, ఆయిల్పాం సాగుకు మొగ్గుచూపుతున్నారు. ఓ వైపు నాణ్యత తగ్గిన బత్తాయికి మార్కెట్లో ధర కూడా పలకని పరిస్థితి నెలకొంది. ఈసారి మార్కెట్లో టన్ను ధర రూ.15 వేలకు పతనం అయింది. దీంతో రైతులకు కూళ్లు, రవాణా ఛార్జీలు కూడా మిగలని పరిస్థితి ఎదురైంది.

**రూ.8వేలే మిగిలాయి: యాదగిరిరెడ్డి, బత్తాయిరైతు, శాఖ్లాపురం**

ఎకరంలో సాగు చేస్తే కూలీలు రవాణా ఖర్చులు పోను రూ.8 వేలు మిగిలాయి. అందులోనే మా కుటుంబం పడిన కష్టం కూడా ఉంది. ఇక బత్తాయిని నమ్ముకుంటే బతకలేం. తీసివేద్దాం అంటే ఇంతకాలం పెంచుకున్న చెట్లను నరికివేయలేకపోతున్నాం. ప్రభుత్వం మాలాంటి చిన్న రైతులను ఆదుకోవాలి.



**మూడున్నర ఎకరాల్లో సాగుచేస్తున్నా..: దైద వేణుగోపాలరెడ్డి, ఆరెగూడెం**

నాకున్న భూమిలో మూడున్నర ఎకరాల్లో సాగు చేశా. ఇప్పుడు ధర బాగా తగ్గింది. చెట్ల కిందనే పండ్లు పండి రాలిపోతున్నాయి. ఒకవేళ మరో నెలలో ధర పెరిగినా పండ్లు సగానికి పైగా రాలిపోతే నాకు మిగిలేదేమంది.

**మద్దతు ధర చెల్లించి ఆదుకోవాలి...: జొన్నలగడ్డ ఉపేందర్రెడ్డి, బత్తాయి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు**

ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి ఆదుకోకపోతే వచ్చే ఐదేళ్లలో ఒక్కరు కూడా బత్తాయి సాగుకు ముందుకు రారు. ఫలితంగా జిల్లాలో సాగు కనుమరుగవుతుంది. ప్రస్తుతం రైతులు ఎంతో ఇబ్బందుల్లో ఉన్నారు.

# చెరువుల్లోకి చేప పిల్లలు



ఎల్లారెడ్డిపేట :ఎట్టకేలకు ఉచిత చేప పిల్లల పంపిణీలో సందిగ్ధం తొలగింది. కొద్ది రోజులుగా ఎదురుచూస్తున్న మత్స్యకారుల నిరీక్షణకు తెరపడింది. ఈ ఏడాది చేప పిల్లలు వదిలేందుకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపడంతో జిల్లా యంత్రాంగం టెండర్ల ప్రక్రియ చేపట్టింది. వచ్చే నెల టెండర్లు ఖరారు కానున్నాయి. వాస్తవంగా ఇప్పటికే టెండర్లు పూర్తి చేసి చేప పిల్లలు పంపిణీ చేయాల్సి ఉండగా పలు కారణాలతో జాప్యం నెలకొంది.

**ఇవీ సమస్యలు** ప్రతీ సీజన్లో పిల్లల పరిమాణం, మోతాదు విషయంలో కచ్చితమైన ప్రామాణికత పాటించడం లేదు.

పెద్దసైజు(80 నుంచి 100 ఎంఎం) పిల్లలు, చిన్న సైజు(35-40ఎంఎం) పిల్లలను చెరువుల్లో వదిలి వేయాలి.

చిన్న సైజు, కల్తీ విత్తన పిల్లల పంపిణీ చేయడంతో రవ్వ, బొచ్చ రకాల ఉత్పత్తి పెరగకపోవడంతో నష్టం వస్తుంది.

పోషకాహారలోపంతో రెండు కిలోలు ఉండాల్సిన చేప అర కిలోకే పరిమితమవుతోంది.

1.58 కోట్ల పంపిణీ లక్ష్యం

జిల్లాలో చెరువులు, కుంటలతోపాటు సుందిళ్ల బ్యారేజీ, శ్రీపాద ఎల్లంపల్లి జలాశయాల్లో చేపలు, రొయ్యల పెంపకం చేస్తున్నారు. అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి జలాశయాలు, 1,073 చెరువులు, కుంటల్లో 1.58 కోట్ల చేప పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందులో 35-40 ఎంఎం సైజు 1.02 కోట్లు, 80-100 ఎంఎం సైజు 56.80 లక్షలు ఉన్నాయి. గతేడాది సుల్తానాబాద్, అంతర్గాం మండలాల్లో 1.30 లక్షల పిల్లలను చెరువుల్లో వదిలేశారు. చిన్న సైజు పిల్లలు సరఫరా చేయడంతో మధ్యలో నిలిచిపోయింది. ఉచిత చేపల పిల్లల స్థానంలో నగదు బదిలీ పథకాన్ని అమలు చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నప్పటికీ పిల్లల పంపిణీకే ప్రభుత్వం మొగ్గు చూపింది.

**టెండర్ల దశలో ఉంది**

ఈ ఏడాది 1.58 కోట్ల ఉచిత చేప పిల్లల పంపిణీ టెండర్ల దశలో ఉంది. వచ్చే నెల టెండర్లు తెరవనున్నాం. పెద్ద సైజులో నాణ్యమైన చేప పిల్లల పంపిణీ చేసే చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటి వనరుల్లో వదలనున్నాం.నరేష్నాయుడు, మత్స్యశాఖ అధికారి, పెద్దపల్లి

ఉచిత చేప పిల్లల వివరాలు
సొసైటీలు : 281
సభ్యులు : 13,450
వదలనున్న వనరులు: 1,073
ఈ ఏడాది లక్ష్యం: 1.58 కోట్లు
సుందిళ్ల బ్యారేజీ: 11.41 లక్షలు
అన్నారం బ్యారేజీ: 8.79 ”
శ్రీపాద జలాశయం: 6.10 ”

# పర్యవేక్షణ లోపం.. వినియోగదారులకు శాపం




ఎల్లారెడ్డిపేట : పెట్రోలు బంకుల్లో కనీస సౌకర్యాలు మృగ్యమయ్యాయి. అస్తవ్యస్త నిర్వహణపై ఇటు అధికారులు, అటు ఆయా కంపెనీల ప్రతినిధులు ఎలాంటి చర్యలను చేపట్టడం లేదు. విజిలెన్స్, పౌరసరఫరాలశాఖ అధికారులు పెట్రోలు, డీజిల్ బంకులను క్రమం తప్పకుండా తనిఖీ చేయడం ద్వారా అక్రమాలను అరికట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

**ఇదీ పరిస్థితి** జిల్లాలో సుమారు 75 పెట్రోలు బంకులను నడుపుతున్నారు. ఉచితంగా కల్పించాల్సిన కనీస వసతులు నామమాత్రంగా అందుతున్నాయి.ఎయిర్ ఫిల్లింగ్ యంత్రాలను ఏర్పాటు చేసి, వాహనాల్లో గాలి నింపేందుకు ఓ వ్యక్తిని నియమించాలి. కానీ అనేక చోట్ల బంకుల్లో ఈ యంత్రాలు పనిచేయడం లేదు. ఎవరైనా రోడ్డు ఏదైనా ప్రమాదానికి గురైనప్పుడు అందుబాటులో ఉండే బంకుల్లో ప్రథమ చికిత్స చేసుకోవచ్చు కానీ ప్రథమ చికిత్స పెట్టెలు మచ్చుకైనా కనిపించడం లేదు. వినియోగదారులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉంచడం లేదు.కొన్ని బంకుల్లో శౌచాలయాలను నిర్మించకపోగా ఉన్నవాటిలో వినియోగించుకునేందుకు నిర్వాహకులు అభ్యంతరం తెలుపుతున్నారు.

బంకుల్లో సేవలు నచ్చకపోతే ఫిర్యాదు చేసేందుకు పెట్టెలను ఏర్పాటు చేయాల్సి ఉండాలనే నిబంధనలను గాలికొదిలేస్తున్నారు.

అగ్నిప్రమాదాలను అరికట్టేందుకు ఉన్న ఫైర్ఫైటింగ్ పరికరాలు పనిచేస్తున్నాయో లేదో తెలియని పరిస్థితి.

పెట్రోలు, డీజిల్ నాణ్యత, పరిమాణాలను పరీక్షించే అధికారం వినియోగదారులకు ఉంటుంది. అందుకోసం అయిదు లీటర్ల క్యాన్ను అందుబాటులో ఉంచాల్సి ఉన్నా పరీక్షించేందుకు ససేమిరా అంటున్నారు.

కొన్ని బంకుల్లో పైకప్పు లేకపోవడంతో ఎండ, వర్షాల నుంచి వినియోగదారులకు రక్షణ లేకుండా పోతోంది.

బంకుల యజమానులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిణి రజిత పేర్కొన్నారు. ఏవైనా ఆరోపణలుంటే వినియోగదారులు తమకు ఫోన్లో ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.

ఇంధనం పోసేటప్పుడు తొలుత సున్న అంకె ఉండేలా యంత్రాన్ని సరిచేయాలి. సిబ్బంది వాహనదారుల దృష్టి మరల్చి రీడింగ్ను మార్చడం ద్వారా ఇంధనాన్ని తక్కువగా పోస్తుండడంతో వినియోగదారులు నష్టపోతున్నారు. నాజిల్ను పదేపదే నొక్కుతూ పెట్రోలు, డీజిల్ పరిమాణాన్ని తగ్గిస్తున్నట్లు జిల్లాలో పలుమార్లు వినియోగదారులు ఆందోళనకు దిగిన ఘటనలు ఉన్నాయి. మరికొన్ని బంకుల్లోని యంత్రాలను ట్యాంపర్ చేస్తున్నారనే ఆరోపణలూ లేకపోలేదు. పెట్రోలు, డీజిల్ ధరలను తెలుసుకునేందుకు పెద్దపెద్ద అక్షరాల్లో రాసి ఉన్న బోర్డులు పలుచోట్ల కనిపించడం లేదు.

కొన్ని బంకుల్లో పెట్రోలులో కలిపే ఆయిల్ ప్యాకెట్లు, ఇతర ఇంజిన్ ఆయిల్లను ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్ముతున్నారు.

వాహనాల్లో ఇంధనం వేసుకోగానే సంబంధిత బిల్లులను కొన్నిచోట్ల నిర్వాహకులు, సిబ్బంది ఇవ్వడం లేదు.

# దుకాణాలు ఎక్కువ.. ట్రేడ్ లైసెన్స్లు తక్కువ



వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలో రోజురోజుకు దుకాణాలు, వ్యాపారాల సముదాయాలు వెలుస్తున్నప్పటికీ ఆ స్థాయిలో ట్రేడ్ లైసెన్స్ల సంఖ్య పెరగడం లేదు. కొందరు దుకాణాల నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్లు తీసుకోకుండానే వ్యాపారాలు చేస్తున్నారు. మరికొందరు రెన్యూవల్ చేసుకోకుండానే కొనసాగిస్తున్నారు. ఏటా ఏప్రిల్ నుంచి మార్చి 31 వరకు లైసెన్స్లు తీసుకోవడం, రెన్యూవల్ చేసుకోవాల్సి ఉండగా చాలామంది వ్యాపారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ట్రేడ్ లైసెన్స్ల విధానాన్ని ఆన్లైన్ చేయాలని ఆదేశాలిచ్చినప్పటికీ వ్యాపారులు పట్టించుకోకపోవడంతో మున్సిపల్ అధికారులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం లేదు.

**మున్సిపల్ ఆదాయానికి గండి**

మున్సిపల్ అధికారులు, సిబ్బంది పట్టణంలో క్షేత్ర స్థాయిలో పర్యటించి వ్యాపారులను గుర్తించి లైసెన్స్లు జారీ చేయాల్సి ఉంది. కానీ అధికారులు ఉదాసీనత చూపిస్తుండటంతోనే చాలావరకు ట్రేడ్ లైసెన్స్లు పొందడం లేదన్న విమర్శలున్నాయి.ముఖ్యంగా వ్యాపార స్థలాన్ని బట్టి ఏటా పన్ను వసూలు చేయాల్సి ఉంటుంది. ఒక్కో వ్యాపారి కనీసం ఏడాదికి రూ.వెయ్యి వరకు చెల్లించాల్సి ఉంటుంది.ప్రధానంగా ఆలయ పరిసరాల వీధులు, ప్రధాన రోడ్ల వెంబడి, పట్టణంలోని మొదటి, రెండో బైపాస్ రహదారుల వెంబడి వేలల్లో దుకాణాలున్నా చాలామంది లైసెన్స్లు పొందకుండానే వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.

ప్రస్తుతం వేల సంఖ్యలో దుకాణాలున్నా.. కేవలం 1978 మాత్రమే ట్రేడ్ లైసెన్స్లు మాత్రమే ఉన్నాయి. ఏటా వివిధ దుకాణాలు, వ్యాపార సముదాయాలు పదుల సంఖ్యలో వెలుస్తున్నప్పటికీ లైసెన్స్ల సంఖ్య పెరగకపోవడంతో మున్సిపల్ ఆదాయానికి గండి పడుతోంది.

బ్యాంకులు, ప్రైవేటు సంస్థల్లో రుణాలు పొంది వ్యాపారాలు నిర్వహించుకునే వారు తప్పనిసరిగా లైసెన్స్లు తీసుకుంటున్నా మిగతా వారు ఆసక్తి చూపడం లేదు. కొందరు పలుకుబడి ఉన్న నాయకులు, వ్యక్తుల ఒత్తిడితోనూ లైసెన్స్లు జారీకి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తప్పక తీసుకోవాలి

పట్టణంలో వ్యాపార వాణిజ్య సంస్థలు, దుకాణాల నిర్వాహకులు తప్పకుండా ట్రేడ్ లైసెన్స్లు తీసుకోవాలి. దుకాణాల నిర్వాహకుల వద్దకు మున్సిపల్ సిబ్బంది వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. సిబ్బందితో సర్వే చేయించి ఎప్పటికప్పుడు దుకాణాల నిర్వాహకులకు ట్రేడ్ లైసెన్స్ల జారీకి తగిన చర్యలు తీసుకుంటున్నాం. అన్వేష్, మున్సిపల్ కమిషనర్ వేములవాడ

# నీటి మీటర్లతో చుక్కలు

హైదరాబాద్ : నగరానికి తాగునీటిని సరఫరా చేసే జలమండలిలో వాటర్ మీటర్ల ప్రక్రియ ప్రహసనంగా మారింది. మీటర్లు పనిచేయకుంటే బిల్లులను రెట్టింపు, మూడు రెట్లు బాదేస్తున్నారు. 14.07 లక్షల కనెక్షన్లు ఉన్నా సగం కనెక్షన్ల మీటర్లు పని చేయడం లేదని సమాచారం. గ్రీన్బ్రిగేడ్ కాంట్రాక్టర్లు, విక్రయ సంస్థలు, రీడర్ల ఇష్టారాజ్యం నడుస్తోంది. బల్క్ కనెక్షన్లకు బిగించిన ఆటోమెటిక్ మీటర్లు పనిచేయక ప్రతినెలా సగటు అంచనాల మేరకు బిల్లింగ్ చేయాల్సి వస్తుంది. దీంతో జలమండలితోపాటు వినియోగదారులకూ నష్టం వాటిల్లుతోంది.

**ఫిర్యాదు చేసినా..**

మీటరు పనిచేయకపోతే మార్చుకోవడానికీ ఇక్కట్లు తప్పడం లేదు. అధికారులను సంప్రదిస్తే మీటరు మార్పు బాధ్యత మీదేనని చెబుతున్నారు. ఒక వినియోగదారుడి ఇంట్లో జనవరి నుంచి మీటరు పనిచేయడం లేదు. మార్చాలని జలమండలి కార్యాలయం చుట్టూ తిరగడమే కాకుండా ఆన్లైన్లో 30 సార్లు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ స్పందన లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**పరిష్కరించినట్లు సందేశాలు**

మీటరు పనిచేయడం లేదని ఆన్లైన్లో జలమండలికి ఉదయం ఫిర్యాదు చేస్తే సాయంత్రానికి సమస్య పరిష్కరించినట్లు వినియోగదారు చరవాణికి మెసేజ్లు మాత్రం వస్తున్నాయి. పరిష్కరించకుండానే ఇలా



సందేశాలు పంపడంతో వినియోగదారులు తలలు పట్టుకుంటున్నారు. తాము ఉచిత నీటి పథకం పరిధిలో ఉన్నా పనిచేయని మీటర్ల కారణంగా బిల్లులు చెల్లించాల్సి వస్తోందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఓ కొత్త కనెక్షన్ కథ ఇది**

అమీన్పూర్లో కొత్త నల్లా కనెక్షన్కు మీటరు కోసం జూన్లో జలమండలి రూ.37 వేలు వసూలు చేసింది. కనెక్షన్ ఇచ్చేటపుడు మీటరు ఏర్పాటుకు మరో రూ.8వేలు చెల్లించాలని గ్రీన్బ్రిగేడ్ కాంట్రాక్టర్ వసూలు చేశారు. నెలలోపే పాడైంది. ఏడాది గ్యారంటీ ఉన్నందున మార్చాలని ఒత్తిడి చేస్తే కొత్తది ఏర్పాటు చేశారు. అదీ మొరాయించింది. చివరకు కొత్త మీటరు బిగించుకోవాల్సి వచ్చిందని వినియోగదారు వాపోయారు.


# డెంగీపై నిర్లక్ష్యం.. ప్రాణాంతకం

హైదరాబాద్ : నగరానికి చెందిన ఓ వ్యక్తి ఐదారు రోజులుగా జ్వరంతో బాధపడుతూ.. స్థానిక ఆర్ఎంపీకి చూపించారు. 4 రోజులకు జ్వరం తగ్గింది. పల్స్, బీపీ పడిపోవడం, కాళ్లు చేతులు చల్లబడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. పెద్దాసుపత్రికి వెళ్లగా లక్షణాలనుబట్టి డెంగీ హెమరేజిక్ ఫీవర్గా గుర్తించారు. నగరానికి చెందిన ఓ బాలింతకు డెంగీ జ్వరం వచ్చింది. స్థానికంగా చికిత్స అందించారు. ఇంతలో ఆరోగ్యం దిగజారడంతో వెంటనే ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె ఆరోగ్యపరిస్థితి విషమంగా మారడంతో చికిత్స అందిస్తుండగానే ఆమె కన్నుమూశారు.

నగరంలో డెంగీ కేసులు పెరుగుతున్నాయి. గ్రేటర్లో ఇప్పటికే 500పైనే డెంగీ కేసులు దాటాయి. ఈ డెంగీ జ్వరంతో 90 శాతం మందికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. కేవలం 10 శాతం మందిలో కొన్నిసార్లు తీవ్రంగా మారే ప్రమాదం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. డెంగీలో సిరో టైప్ 1, 2, 3, 4 రకాలు ఉంటాయి. గతంలో సిరో టైపు-1 వచ్చి తగ్గిన తర్వాత మరోసారి టైపు-2 వైరస్ సోకితే కొన్నిసార్లు అది డెంగీ హెమరేజిక్ ఫీవర్కు దారి తీస్తుంది. వెంటనే చికిత్స అందించాలని నిపుణులు చెబుతున్నారు.

**ప్లేట్లెట్స్ తగ్గడం...**

డెంగీ జ్వరంలో ప్లేట్లెట్స్ తగ్గడం సాధారణమే. డెంగీ హెమరేజిక్ ఫీవర్లో ప్లేట్లెట్లు 10-20 వేలకు పడిపోతాయి. శరీరంపై రాషెస్, చిగుళ్ల నుంచి రక్తం రావడం, మూత్రంలో రక్తం పోవడం, మలం



నల్లగా రావడంలాంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే బాధితులను ఆస్పత్రిలో చేర్పించాలి.

**ప్లాస్మా లీకేజీ...**డెంగీలో ప్లేట్లెట్స్ తగ్గడంకంటే ప్లాస్మా లీకేజీ ఎక్కువ ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. రక్తంలో ఉన్న ఫ్లూయిడ్స్ బయటకు పోవడాన్ని ప్లాస్మా లీకేజీగా చెబుతారు. రక్తం చిక్కబడి రక్తప్రసరణ తగ్గి.. మెదడు, కాలేయం, కిడ్నీలులాంటి కీలక విభాగాలకు ఆక్సిజన్, పోషకాలు సరఫరా ఆగిపోయి పనిచేయడం మానేస్తాయి. గుండె వేగంగా కొట్టుకోవడం, కడుపులో తీవ్రమైన నొప్పి ఉంటుంది.

**ఈ లక్షణాలుంటే జాగ్రత్త - రాజారావు, ప్రిన్సిపల్, ఉస్మానియా మెడికల్ కళాశాల** సాధారణంగా 90 శాతం మందిలో డెంగీతో ఎలాంటి ఇబ్బంది ఉండదు. డెంగీ హేమరేజిక్ ఫీవర్తో మాత్రం జాగ్రత్తగా ఉండాలి. తీవ్రమైన కడుపునొప్పి, వాంతులు, శరీర భాగాల నుంచి రక్తస్రావం, పల్స్, బీపీ తగ్గడం, కాళ్లు, చేతులు చల్లబడడం, కాళ్ల వాపుతోపాటు కళ్ల కింద వాపు లాంటి లక్షణాలు కన్పిస్తే.. డెంగీ షాక్ సిండ్రోమ్కు దారితీస్తుంది. అపస్మారకస్థితికి చేరుకుంటారు. వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.

## మొక్కుల తాళాలు.. తెరిచేది కోరికలు

జమ్మికుంట : కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్ దర్గాకు ప్రత్యేక ప్రాశస్త్యం ఉంది. 11వ శతాబ్దంలో నిర్మించిన ఈ దర్గాలో ఇస్లాం మత ప్రబోధకులు, విశ్వమానవ సమానత్వాన్ని చాటిన సయ్యద్ ఇంకుషావలి రహమతుల్లా అలై, ఆయన సోదరుడు సయ్యద్ అజ్మత్‌షావలి, వారి కుమారులు హజ్రత్ సయ్యద్ అక్బర్‌షావలి, ముర్తుజాషావలి సమాధులున్నాయి. వీరు జమ్మికుంట ప్రాంతాలు ప్రచారాలు నిర్వహించేవారు. ఇంకుషావలిని కొలిస్తే కోరికలు తీరుతాయనే నమ్మకం భక్తుల్లో ఇప్పటికీ ఉంది. కోరికలు తీరాలని ప్రార్థించి దర్గాలోని హుండీలకు ఇరువైపులా చిన్న చిన్న తాళాలను



కడతారు. వాటికి చిన్నపాటి గుర్తులు పెట్టుకుంటారు. కోరుకున్న కోరికలు తీరగానే దర్గాకు వచ్చి వారు కట్టిన తాళాన్ని తీసి హుండీల్లో వేస్తారు. తర్వాత దర్గా వద్ద ఇంకుషావలికి మాంసాహార బిర్యానీ సమర్పించి కుటుంబ సభ్యులతో కలిసి సామూహికంగా కందూరు విందు చేస్తారు. ఈ విధంగా కోరికలు తీరగానే తాళం తీసి కానుకలు వేసి సమాధులను చాదర్లతో అలంకరించి, కొందరు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారని దర్గా కమిటీ చైర్మన్ ఇక్బాల్ తెలిపారు. మానసిక రుగ్మతలు నయం కావడానికి, వివాహం అయ్యేందుకు, సంతానం కలిగేందుకు, ఉద్యోగాల కోసం పలు రకాలు కోరికలు తీరేందుకు ఈ విధంగా ప్రత్యేక ఆచారంలో మొక్కులు చెల్లించుకుంటున్నారన్నారు.

## అతివల జగతి.. ఆర్థిక ప్రగతి

ఆత్మకూరు : మహిళలు ఇంటి, వ్యవసాయ పనులకే పరిమితం కావడంలేదు. స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసుకుని ఆర్థిక సాధికారత సాధిస్తున్నారు. జిల్లాలోని 17 మండలాల్లో 14,875 ఎస్‌హెచ్‌జీల్లో 1,58,501 మంది సభ్యులు ఉన్నారు. వారంతా రూ.కోట్లల్లో రుణాలు పొంది తమకు అభిరుచి, ఆసక్తి ఉన్న రంగాల్లో పెట్టుబడులు పెట్టి శతశాతం వాయిదాలు చెల్లిస్తున్నారు. పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణ, కిరాణ, వస్త్ర, డెయిరీ, దుస్తుల తయారీ, కుట్లు అల్లికలు, మెడికల్ షాపులు, వాహనాలు, హొటళ్లు, పండ్లు, కూరగాయల, పిండిమర తదితర దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. ఉత్తమంగా నడుస్తున్న కొన్ని సంఘాలపై కథనం.

**22 ఏళ్లుగా పొదుపు:**

చౌటుప్పల్ మండలం దామెరలో జీవనోపాధుల సంఘం పరిధిలో ప్రగతి సమభావన సంఘాన్ని 2003లో ఏర్పాటు చేసుకున్నారు. 22 ఏళ్లుగా క్రమం తప్పకుండా పొదుపు చేసుకుంటున్నారు. బ్యాంకు నుంచి పొందిన రుణాలతో టైలరింగ్, ఎంబ్రాయిడరీ, పండి వంటల తయారీ వంటి స్వయం ఉపాధిని ఏర్పాటు చేసుకున్నారు.

**రూ.20వేల నుంచి రూ.17లక్షలకు..**

ఆత్మకూరు(ఎం) మండలం పలెర్ల గ్రామంలో 2004లో మహిళలు మమత సమభావన సంఘంగా ఏర్పడ్డారు. ఎనిమిదిసార్లు అనుసంధాన రుణాలు పొందారు. 2004లో రూ.20 వేల రుణం పొందిన వారు రెండు నెలల క్రితం రూ.17 లక్షల బ్యాంకు లింకేజీ రుణం తీసుకున్నారు. స్త్రీనిధి నుంచి రూ.3 లక్షలకు పైగా పొందారు. మెడికల్ షాపు, కిరాణం, కారు, టైలరింగ్, పాడిపరిశ్రమ, ఆటో వంటి యూనిట్లు ఏర్పాటు చేసుకుని విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

సంస్థాన్ నారాయణపురం మండలం గుడిమల్కాపురంలో 1997లో ఐదు ఎస్‌హెచ్‌జీలతో ప్రారంభమై 29కి చేరుకోగా 304 మంది సభ్యులుగా ఉన్నారు. పొదుపు సొమ్ము రూ.40 లక్షల వరకు నిల్వ ఉంది. బ్యాంకుల నుంచి రూ.2 కోట్ల రుణాలు పొందారు.

**రూ.1.5 కోట్ల రుణం**: బీమగోని విజయ అధ్యక్షురాలు, శ్రీనిధి సంఘం గుండ్లగూడెం ఆలేరు మండలం గుండ్లగూడేనికి చెందిన శ్రీనిధి సమభావన సంఘం 1999లో 12 మంది సభ్యులతో ఏర్పడింది. నెలకి రూ.60 పొదుపుతో ప్రారంభించి, ప్రస్తుతం రూ.200 పొదుపు చేస్తున్నారు. బ్యాంకు, స్త్రీనిధి నుంచి రూ.1.5 కోట్ల వరకు రుణాలు పొంది ప్రగతి సాధించారు.

## నమూనా ఇక్కడ.. నిర్ధారణ ఎక్కడో!

నల్గొండ: జిల్లా కేంద్రంలోని ఓ ప్రముఖ డయాగ్నోస్టిక్ కేంద్రంలో ఓ రోగికి మూత్రాశయంలో రాయి ఉందని చెప్పారు. తక్షణమే శస్త్రచికిత్స చేయాలని సూచించారు. సదరు రోగికి అనుమానం వచ్చి వేరే డయాగ్నోస్టిక్ సెంటర్‌కు వెళ్తే అలాంటిదేమీ లేదని తేలింది. ఇలాంటి ఘటనలు జిల్లా కేంద్రంలో కోకొల్లలు. ఇవన్నీ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు చెందిన డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అనుమతులు పొందకుండా.. రిపోర్టులు అప్పటికప్పుడు స్వతహాగా వెల్లడించే అవకాశం లేకున్నా.. యథేచ్ఛగా వైద్యారోగ్య నిబంధనలను తుంగలో తొక్కి రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఎలాంటి రిజిస్ట్రేషన్ నంబర్లు, లైసెన్సులు లేకుండా డయాగ్నోస్టిక్ సెంటర్లు, కంప్యూటరైజ్డ్ ల్యాబోరేటరీల పేరిట అన్నిరకాల రక్తం, మూత్ర పరీక్షలు చేస్తూ.. ఫలితాల కోసం రోగులను వేచిచూసేలా వ్యవహరిస్తున్నారు. రిపోర్టుల జాప్యం ఎందుకని ప్రశ్నిస్తే పెద్ద డయాగ్నోస్టిక్ సెంటర్‌కు పంపించాం ఆగాల్సిందే అని చెబుతున్నారు. జిల్లాలో మొత్తం 712 సెంటర్లు ఉండగా అనధికారికంగా మరో 300 కేంద్రాలు నిర్వహిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లావైద్యాధికారుల టాస్క్‌ఫోర్సు బృందం క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేస్తేనే రోగుల ప్రాణాలకు భరోసా కల్పించినట్లు అవుతుంది. ఈ విషయాన్ని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్‌తో ప్రస్తావించగా తనిఖీలు చేసి నిబంధనలు లేని కేంద్రాలను మూసివేస్తామని పేర్కొన్నారు.

గుండెకు సంబంధించిన సీబీపీ లిపిడ్ ప్రొఫైల్, టీ3, టీ4, టీఎస్‌హెచ్, హెచ్‌ఐవీ, కాలేయ, మూత్ర పిండాలు, ఐరన్, ప్రెగ్నెన్సీ ప్రొఫైల్, థైరాయిడ్, మలేరియా, టైఫాయిడ్, ప్లేట్‌లెట్స్, డెంగీ, చికున్‌గున్యా, విషజ్వరాలకు సంబంధించిన అన్ని పరీక్షలు చేస్తామని పెద్దబోర్డులు పెట్టి చిన్న చిన్న గదుల్లో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఆర్‌ఎంపీ స్థాయిలో రోగుల వద్ద నుంచి వివిధ శాంపిళ్లు సేకరించి వాటిని పేరున్న డయాగ్నోస్టిక్ సెంటర్లకు పంపించి అక్కడి నుంచి రిపోర్టులు వస్తే మళ్లీ రోగికి రిపోర్టు ఇచ్చే సంప్రదాయం నడుస్తుంది.

## జ్వరాలతో అవస్థలు.. సిబ్బంది కొరత



ధర్మపురి : ధర్మపురి క్లస్టర్ ఆసుపత్రిని గత ఏడాది 50 పడకలకు అప్‌గ్రేడ్ చేసినా సేవలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఆసుపత్రిలో పలు సమస్యలు తిష్ఠ వేశాయి. వైద్య సిబ్బంది లేక బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆసుపత్రి పరిధిలో ధర్మపురి, వెల్గటూర్, బుగ్గారం, బీర్‌పూర్ మండలాలుండగా ప్రతిరోజు 150 మంది ఓపీ ఉంటుంది. ప్రస్తుతం నిత్యం పది వరకు వైరల్ జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. ఎక్కువ సంఖ్యలో రోగులొస్తే మంచాలు సరిపోవడం లేదని, అత్యవసర వైద్య సేవలు అందడం లేదని స్థానికులు వాపోతున్నారు. అత్యవసర సేవలకు జగిత్యాల ఆసుపత్రికి 108 వాహనం ద్వారా తరలిస్తున్నారని పేర్కొంటున్నారు.

20 మంది వైద్యులకు 10 మంది, 25 మంది సిబ్బందికి పది మంది మాత్రమే సేవలు అందిస్తున్నారు.

గర్భిణులకు కావాల్సిన పరీక్షల పరికరాలు, ఎక్స్‌రేప్లాంట్, స్కానింగ్ తదితర ప్రధాన పరికరాలు ఏర్పాటు చేయలేదు.

రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న మూడో అంతస్తు భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

కరోనా సమయంలో రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంటును గతేడాది ప్రారంభించినా సాంకేతికలోపంతో పని చేయడం లేదు.

**మెరుగైన వసతులు కల్పించాలి**

ధర్మపురి ఆసుపత్రికి జ్వరంతో వచ్చాను. రెండ్రోజులుగా జ్వరం బాధిస్తోంది. వసతులు మెరుగుపరచాలి. పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించాలి. మందులు అందించి భరోసా కల్పించాలి.మల్లీశ్వరి, బాధితురాలు

**వైద్య సేవలు అందిస్తున్నాం**

ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రిని ఇటీవల అప్‌గ్రేడ్ చేశాం. ఈ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నాం. పరికరాల కోసం ప్రతిపాదలను పంపించాం. ఆసుపత్రిలో జ్వర పీడితులకు ఎప్పటికప్పుడు సేవలందిస్తున్నాం. మందుల కొరత లేదు. డా.రవి.ఆసుపత్రి సూపరింటెండెంట్, ధర్మపురి

## నాలుగు రోజులు.. ఆరు రైళ్లు




పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా కేంద్రం నుంచి తిరుపతి పుణ్యక్షేత్రానికి రైళ్ల అనుసంధానం మరింతగా పెరిగింది. కరీంనగర్-తిరుపతి బైవీక్లీకి అదనంగా మూడు ప్రత్యేక రైళ్లు నడుస్తుండగా వచ్చే నెల నుంచి మరో ప్రత్యేక రైలు ఉమ్మడి జిల్లా ప్రజలకు అందుబాటులోకి రానుంది. గత నెలలో నాందేడ్ నుంచి తిరుపతికి ప్రారంభించిన వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు మద్దతు పెరగడంతో మరో రైలును తిరుపతి మీదుగా ధర్మవరం నడిపించేందుకు నాందేడ్ అధికారులు షెడ్యూలు విడుదల చేశారు.

**షెడ్యూల్ ఇలా..** పెద్దపల్లి నుంచి తిరుపతికి ఇక నుంచి వారంలో ఆరు రైళ్లు అందుబాటులో ఉండనున్నాయి. ప్రస్తుతం నడిచే కరీంనగర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ ప్రతి గురు, ఆదివారాలు నడుస్తుండగా గత నెలలో ప్రారంభించిన నాందేడ్-తిరుపతి ప్రత్యేక రైలు ప్రతి శనివారం(రాత్రి 10.05గంటలు), సెప్టెంబరు 5 నుంచి నడిచే నాందేడ్-ధర్మవరం ప్రతి శుక్రవారం(రాత్రి 10.05 గంటలు) అందుబాటులోకి రానుంది. వీటికి అదనంగా ప్రతి ఆదివారం లాల్‌కౌన్ జంక్షన్-కేఎస్సార్ బెంగళూరు ప్రత్యేక వీక్లీ రైలు ప్రతి ఆదివారం రాత్రి 8.20 గంటలకు పెద్దపల్లికి చేరుకుంటుంది. మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. దన్‌బాద్-కోయంబత్తూరు ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ కూడా ఆదివారం రాత్రి 11.09 గంటలకు చేరుకొని, మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు రేణిగుంటకు చేరుకుంటుంది. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో తిరుపతికి చేరుకోవాల్సి ఉంటుంది. ప్రతి సోమ, గురు, శనివారాల్లో నడిచే ఏపీ సంపర్క్‌క్రాంతి, బుధవారం నడిచే హిమ్‌సాగర్ ఎక్స్‌ప్రెస్‌లకు పెద్దపల్లిలో హాల్టింగ్ కల్పించినట్లయితే ఉమ్మడి జిల్లావాసులకు మరింత ప్రయోజనం కలుగుతుంది.

**పుణ్యక్షేత్రాల మీదుగా..**

సెప్టెంబరు 5 నుంచి 26 వరకు ప్రయోగాత్మకంగా ప్రత్యేక రైలును నడపనున్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి కొనసాగించడం, క్రమబద్ధీకరించడం చేపడతారు. ప్రతి శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు నాందేడ్‌లో బయలుదేరి 6 గంటలకు బాసర, 6.25కు నిజామాబాద్, రాత్రి 8కి జగిత్యాల, 9కి కరీంనగర్, 10.05 గంటలకు పెద్దపల్లి మీదుగా శనివారం ఉదయం 11 గంటలకు తిరుపతి, సాయంత్రం 4 గంటలకు ధర్మవరం చేరుకుంటుంది. మరుసటి రోజు(ఆదివారం) ఉదయం 5.30 గంటలకు బయలుదేరి 10.25 గంటలకు తిరుపతి, సోమవారం మధ్యాహ్నం 12.05 గంటలకు పెద్దపల్లి, 12.40కు కరీంనగర్, 1.30కి జగిత్యాల, బాసరకు 4.27 గంటలకు చేరుకుంటుంది. ప్రస్తుతం ఈ ప్రత్యేక రైలును నాందేడ్, నిజామాబాద్, కామారెడ్డి, చర్లపల్లి, నల్గొండ, పిడుగురాళ్ల, నంద్యాల, ఎర్రగుంట్ల మార్గంలో నడిపిస్తున్నారు. ఈ మార్గంలో ప్రయాణిలకు ఆదరణ లభించకపోవడంతో నిజామాబాద్-పెద్దపల్లి మార్గంలో మళ్లిస్తున్నారు. ఈ ప్రత్యేక రైలు ద్వారా బాసరలోని జ్ఞాన సరస్వతి, వరంగల్ భద్రకాళి, విజయవాడ కనకదుర్గ, శ్రీకాళహస్తి, తిరుపతి పుణ్యక్షేత్రాలతోపాటు కదిరిలో ప్రసిద్ధిచెందిన శ్రీలక్ష్మీనరసింహస్వామిలను నేరుగా దర్శించుకునే అవకాశముంటుంది.

## నేత్రాల్లోకి ధూళి రేణువులు

గోదావరిఖని : ఇటీవల కురిసిన వర్షాలకురహదారులపై పేరుకుపోయిన బురద ప్రస్తుతం ధూళిగా మారింది. వాహనాల రాకపోకలతో ధూళి కణాలు గాలిలోకి లేచి వాహనదారులను ఇబ్బంది పెడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 11,62,412 వాహనాలు నిత్యం రహదారులపై రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారులపై పేరుకుపోయిన మట్టి రేణువులు గాలిలోకి లేచి ద్విచక్ర వాహనదారులు, పాదచారులను ఇబ్బంది పెడుతున్నాయి. కళ్లలో పడుతున్న దుమ్ము, ధూళి రేణువులను చేతులతో నలుపుతూ సమస్యలు తెచ్చుకుంటున్నారు. కంటి సమస్యలు తలెత్తడంతో ఆస్పత్రుల బాటపడుతున్నారు.



**సంరక్షణ తప్పనిసరి:** ద్విచక్ర వాహనదారులు కళ్ల సంరక్షణ తప్పనిసరిగా పాటించాలి. కళ్లలో పడ్డ ధూళిని నీటితో శుభ్రం చేసుకోవాలి. దానివల్ల గుడ్డు, కంటిరెప్పలో పేరుకుపోయిన ధూళి తొలగిపోతుంది.

**రహదారులను శుభ్రం చేయాలి:** ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులపై వరదలు పారి మట్టి పేరుకుపోయింది. ఉమ్మడి జిల్లాలో రెండు నగరపాలికలు, 13 పురపాలక సంఘాలు, 1214 గ్రామపంచాయతీలున్నాయి. ఆయా స్థానిక సంస్థల పరిధిలో ఉన్న రహదారులపై పేరుకుపోయిన మట్టిని తొలగించడంతో పాటు నీటిని చల్లించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలి.రుద్దడం వల్ల ప్రమాదం: కళ్లలో ధూళి పడగానే చేతులతో రుద్దడం వల్ల కొత్త సమస్య వస్తుంది. కనుగుడ్డుపై గాయాలయ్యే ప్రమాదం ఉంటుంది. దీని వల్ల కన్ను ఎర్రబారడంతో పాటు మంట, నీరు కారడం, చూపు మందగించడం లాంటి సమస్యలు ఎదురవుతాయి. వైద్యులను సంప్రదించి పరీక్షించుకోవాలి. కంటిపై ఉన్న దుమ్ము, మట్టి రేణువులు తొలగించే విధంగా చికిత్స చేయించుకోవాలి. **కంటి రక్షణ పాటించాలి**

వాహనదారులు కంటి రక్షణ చర్యలు పాటించాలి. కళ్లలో దుమ్ము, ధూళి రేణువులు పడకుండా సంరక్షణగా అద్దాలు వాడాలి. లేదంటే శిరస్త్రాణం ధరించాలి. దీని వల్ల కళ్లకు రక్షణ ఉంటుంది. కంటి సమస్య వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. పరీక్షించిన తర్వాత అవసరమైన చికిత్స అందించే అవకాశం ఉంటుంది.

గోపి, నేత్ర వైద్య నిపుణులు, గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రి

## తరలింపులో పైలం.. అప్రమత్తతే ప్రధానం

మెట్‌పల్లి : కోరుట్ల నుంచి మెట్‌పల్లి వైపు ఇటీవల భారీ వినాయక విగ్రహం తరలిస్తుండగా.. మారుతినగర్ సమీపంలో జాతీయ రహదారిపై ఎల్‌టీ విద్యుత్తు తీగల్లో విగ్రహం కిరీటం ఇరుక్కుంది. దానిని తరలిస్తున్నవారు తీగలను తప్పించడానికి కర్రలతో ప్రయత్నిస్తుండగా.. అటుగా వెళ్తున్న మెట్‌పల్లి ఏడీఈ మనోహర్ అప్రమత్తమై సరఫరాను నిలిపి వేయించారు. విగ్రహ తరలింపు సమయంలో విద్యుత్తు విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని ఈ సంఘటనతో అర్థమవుతుంది.

**ఇప్పటివరకు 234 స్తంభాల బిగింపు**

మెట్‌పల్లి డివిజన్ పరిధిలో విద్యుత్తు తీగలను సరిచేసేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. పలు బృందాలను ఏర్పాటు చేసి డివిజన్ పరిధిలోని మెట్‌పల్లి, కోరుట్ల, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కథలాపూర్ మండలాల్లో తీగలను సరిచేయిస్తున్నారు. ఇప్పటివరకు సుమారుగా 234 ఎత్తయిన విద్యుత్తు స్తంభాలను బిగించినట్లు అధికారులు తెలిపారు.

**గత విషాద ఘటన**

కోరుట్ల పట్టణంలో తయారీ కేంద్రాలు ఎక్కువగా ఉండగా.. ఇక్కడి



నుంచి జిల్లాలోని మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కథలాపూర్ మండలాలతోపాటు.. నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాలకు విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. అయితే వాహనాలపై తరలింపులో చిన్నపాటి నిర్లక్ష్యం పెను ప్రమాదాలకు దారి తీసే అవకాశాలున్నాయి. గత మేలో కోరుట్లలో ఇద్దరు, ఇటీవల రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పలువురు మరణించిన సంగతి విదితమే.

**సొంత ప్రయత్నాలు తగదు**

విద్యుత్తు తీగలు 33కేవీ, 11కేవీ, ఎల్‌టీ లైన్లుగా ఉండటంతో.. భారీ విగ్రహాల తరలింపు సమయంలో ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. తక్కువ ఎత్తులో తీగలుంటే స్థానిక విద్యుత్తు అధికారులకు సమాచారమిచ్చి సాయం తీసుకోవాలి. సొంతంగా తీగలను తప్పించే ప్రయత్నం చేయొద్దు 33కేవీ, 11కేవీ వాటిని కర్రలతో ఎత్తి తప్పించాలని చూస్తే ఒక్కోసారి విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశాలున్నాయి. దీనివల్ల బాధిత కుటుంబాలకు తీరని శోకం మిగులుతుంది. ఊరేగింపులు, శోభాయాత్రలు, మండపాల వద్ద ఎక్కడైనా విద్యుత్తు సమస్యలు, అంతరాయాలు ఏర్పడితే వెంటనే 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందిస్తే సిబ్బంది వెంటనే సమస్యను పరిష్కరిస్తారు.

## అసంపూర్ణం.. దక్కని ఆహ్లాదం

హుజూర్‌నగర్ : పరుగుల జీవితంలో కాసేపు సేద తీరి నలుగురితో కాలక్షేపం చేసేందుకు ప్రభుత్వాలు చేపట్టిన పనులు ముందుకు సాగడం లేదు. పట్టణవాసుల ట్యాంక్‌బండ్ కల సాకారం కావడంలేదు. ప్రభుత్వాలు, వారి ప్రాధాన్యాలు మారి పనులు పక్కన పెట్టడం వల్ల ఇప్పటికే ఖర్చు చేసిన ప్రజాధనం వృథా అవుతోంది. కనీసం చిన్న పార్కు కూడా లేని పట్టణాలు కొన్నయితే, ఒకటి, అర మాత్రమే ఉండి రద్దీగా మారుతున్న పరిస్థితి మరికొన్ని పట్టణాల్లో ఉంది. ఇక వృద్ధులు, మహిళలు, సరదాగా సేద తీరుదామనుకున్న వారు మళ్లీ రద్దీ రోడ్ల మీదనే తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం చొరవ తీసుకుని ఇప్పటికే ప్రారంభించిన నిర్మాణాలను పనులు పూర్తి చేయాలని పట్టణాల ప్రజలు కోరుతున్నారు.

**కబ్జా కన్ను:**

హుజూర్‌నగర్ పట్టణవాసుల కోరిక మేరకు రూ.7.23 కోట్లతో ట్యాంక్‌బండ్‌ను మంజూరు చేశారు. పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. ప్రభుత్వం మారడంతో ప్రాధాన్యాలు మారాయి. దీంతో పనులు ఆగిపోయాయి. దీంతో కొందరు ట్యాంక్‌బండ్ వెంట ఉన్న స్థలం తమదంటూ ఆక్రమణలకు సిద్ధమయ్యారు. స్థలం అన్యాక్రాంతం కాకముందే పనులు పూర్తి చేస్తారని స్థానికులు ఎదురు చూస్తున్నారు.

**నిధులొచ్చినా..:**

కోదాడ పురపాలక సంఘం పరిధిలో పెద్ద చెరువుపై ఏర్పాటుకు ప్రతిపాదలను సిద్ధం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రూ.5 కోట్లతో



పనులు మొదలుపెట్టారు. రూ.50 లక్షలు వెచ్చించి కట్టను చదును చేశాక నిధులు మంజూరు కావడంలేదని గుత్తేదారు నిలిపివేశారు. తిరిగి ఈ ప్రభుత్వం రూ.8 కోట్లతో పూర్తిచేయాలని మరో శిలాఫలకం వేసి ఏడాదైంది. కానీ పనులు మాత్రం ప్రారంభించలేదు.

**జాప్యం..:**

సూర్యాపేట పట్టణంలో పుల్లారెడ్డి చెరువు ట్యాంకుబండ్ అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. గత ప్రభుత్వం రూ.17.5 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించింది. కట్ట లైనింగ్, వెడల్పు మాత్రం చేపట్టారు. అధికారులు వేసవిలో పూర్తి చేస్తామని చెప్పినా నేటికీ మొదలు పెట్టలేదు. ప్రస్తుతం కట్ట వెంట దట్టంగా కంపచెట్లు పెరిగాయి. గుర్రపు డెక్క విస్తరించి దోమలకు నిలయమైంది. చుట్టుపక్కల నివాసితులు దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు త్వరగా పనులు పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చురకలు



# పోరుకు సన్నద్ధం

నల్గొండ : స్థానిక సంస్థల ఎన్నికలపై ఉత్కంఠ వీడింది. 90 రోజుల్లో ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు బెంచ్ ఆదేశాలు ఇవ్వడంతో ప్రభుత్వం ఎన్నికలకు సన్నద్ధం అవుతోంది. ముందుగా పార్టీ గుర్తులతో ఎన్నికలు జరిగే జిల్లా, మండల ప్రాదేశిక నియోజకవర్గాలకు పోలింగ్ నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా ఎన్నికల్లో కీలక పాత్ర పోషించే మండల పరిషత్తు అధికారు(ఎంపీడీవో)ల బదిలీలు చేపట్టేందుకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్లమెంటు ఎన్నికల ముందు జిల్లా నుంచి సుమారు 20 మంది ఎంపీడీవోలు సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. వారు తిరిగి నల్గొండకు వచ్చే అవకాశం ఉంది. బదిలీ కోసం దరఖాస్తు చేసుకునే అధికారుల వివరాలు పంపించాలని జిల్లా పరిషత్తు అధికారులకు ఆదేశాలు అందడంతో వివరాలు సేకరించి జాబితా పంపించే పనిలో నిమగ్నమయ్యారు.

**రాష్ట్రంలోనే పెద్ద జడ్పీ**

రాష్ట్ర అసెంబ్లీ తర్వాత నల్గొండ జిల్లాపరిషత్తు మినీ అసెంబ్లీని తలపించనుంది. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల, మండలాల పునర్విభజన, కొత్త మండలాల ఏర్పాటుతో రాష్ట్రంలోనే నల్గొండ పెద్ద జిల్లాగా రూపాంతరం చెందింది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు జిల్లాలో రెండు కొత్త మండలాలు ఏర్పాటుతో 31 జడ్పీటీసీ స్థానాల నుంచి 33 వరకు చేరాయి.



మండల పరిషత్తు ప్రాదేశిక నియోజకవర్గాలు 349 ఉండగా పునర్విభజనతో 352 స్థానాలకు చేరాయి. ఇక్కడ జడ్పీ చైర్మన్‌కు దాదాపు సహాయ మంత్రి హోదా దక్కనుండటంతో చాలా మంది నేతలు జడ్పీ చైర్మన్ కుర్చీపై ఆశలు పెట్టుకున్నారు.

**ఏర్పాట్లు పూర్తి..!**

ప్రాదేశిక సమరానికి ఎప్పుడు ప్రకటన వచ్చినా ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. ఇప్పటికే రిజర్వేషన్లు మినహా ఇతర అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎంపీటీసీల పునర్విభజన, ఓటర్ల విభజన వంటి ప్రక్రియ పూర్తి చేసి పోలింగ్ కేంద్రాలను గుర్తించింది. ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించే అధికారులకు, సిబ్బందికి ఇప్పటికే రెండు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించనుండటంతో దీనికి ఉపయోగించే పేపరును దిగుమతి చేసి నిల్వ ఉంచారు.

# సీడీపీ నిధులకు గ్రహణం

నల్గొండ : నియోజకవర్గ అభివృద్ధి పథకానికి గ్రహణం పట్టింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావొస్తున్నా.. ఎమ్మెల్యేలకు నియోజకవర్గ అభివృద్ధి పథకం(సీడీపీ) కింద వచ్చే నిధులు మాత్రం విడుదల కావడం లేదు. దీంతో ఎమ్మెల్యేలు అభివృద్ధి పనులు చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది.

**గతంలో ఇలా..**ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పర్యటించినప్పుడు ప్రజలు ఇచ్చిన అర్జీల పరిష్కారం, సదుపాయాల కల్పన, తక్షణ అవసరాలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధి పథకాన్ని అమలు చేస్తోంది. గతంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.3 కోట్లు కేటాయించగా, ఆ నిధులను 2022-23లో భారాస ప్రభుత్వం రూ.5 కోట్లకు పెంచింది. ఇందులో రూ.3 కోట్లను ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలకు చేపట్టే అవకాశం ఉండగా, మిగిలిన రూ.2 కోట్లు విద్యాశాఖలో పాఠశాలల అభివృద్ధికి వెచ్చించాలని పేర్కొంది. అయితే విద్యాశాఖకు కేటాయించిన నిధులను గత ప్రభుత్వం నేరుగా ఆ శాఖకు విడుదల చేసేది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తిగా ఈ నిధులను నిలిపివేయడంతో అభివృద్ధి పనులకు బ్రేక్ పడుతుంది. నిధులు విడుదల చేస్తే తాగునీరు, రహదారులు, అసంపూర్తి భవనాల పూర్తి , గ్రామాల్లో సదుపాయాల కల్పన, ఇతర అభివృద్ధి పనులకు వెచ్చించే అవకాశం ఉంటుంది.

**ఎస్‌డీఎఫ్‌తోనే అభివృద్ధి పనులు**

సీడీపీ నిధులను ప్రభుత్వం కేటాయించకపోవడంతో నియోజకవర్గాల్లో ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్)తోనే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ప్రతి నియోజకవర్గానికి ఎస్‌డీఎఫ్ కింద రూ.10 కోట్లు మంజూరవుతాయి. ఈ నిధులను ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదంతో పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలుండగా వాటిలో సూర్యాపేట నియోజకవర్గం మినహా అన్ని నియోజకవర్గాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నారు. సూర్యాపేటలో మాత్రం భారాస ఎమ్మెల్యే ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నుంచి సీడీపీ నిధులు విడుదల కాకపోవడంతో కొంతమంది ఎమ్మెల్యేలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సీడీపీ నిధులు విడుదల చేస్తే నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చని, అలాగే ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుందని కొందరు ఎమ్మెల్యేలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# మంత్రులారా.. మా గోడు వినండి!

తలమడుగు : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం సుంకిడి కొత్త వ్యవసాయ మార్కెట్‌యార్డు ఏర్పాటు 16 ఏళ్లుగా ఊరిస్తూనే ఉంది. తొలుత సబ్ మార్కెట్‌యార్డు అనుకున్నా పూర్తిస్థాయి ప్రత్యేక మార్కెట్‌యార్డుకు అడుగులు ముందుకు పడినా అది స్థల సేకరణకే పరిమితమైంది. మార్కెట్‌యార్డు ఎప్పుడు అందుబాటులోకి వస్తుందోనని తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల రైతులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. తలమడుగు మండలంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామిల పర్యటన ఉన్నందున మూడు మండలాల రైతులు తమ గోడును విన్నవించనున్నారు. ఆదిలాబాద్‌లో వ్యవసాయ మార్కెట్‌యార్డు పరిధిలో ఆదిలాబాద్ గ్రామీణం, ఆదిలాబాద్ అర్బన్, మావల, తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల రైతులు తమ పంట ఉత్పత్తులను తీసుకొస్తారు. ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు పండించిన

పత్తి, సోయా, శనగలు, కందులు, జొన్న పంటలను విక్రయించేందుకు ఆదిలాబాద్ మార్కెట్‌కు వెళ్లాల్సి వస్తోంది. విక్రయాల వేళ రైతులంతా పంటను మార్కెట్‌కు తీసుకొచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా భీంపూర్, తలమడుగు, తాంసి మండలాల్లోని పలు గ్రామాల రైతులు 45 కిలోమీటర్లకు పైగా ప్రయాణం చేసి ఆదిలాబాద్ పట్టణానికి పంట తీసుకొస్తూ అవస్థలు పడుతున్నారు. ఆదిలాబాద్ మార్కెట్ పరిధిలో ఆరు మండలాలకు చెందిన 40 వేల మంది రైతులు ఉన్నారు. ఆదిలాబాద్ మార్కెట్‌లో పంట విక్రయించేందుకు అక్కడే రెండు నుంచి మూడు రోజులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. మూడు మండలాల రైతుల ప్రయోజనార్థం సుంకిడిలో మార్కెట్‌యార్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఏళ్ల నుంచి ఉంది. తద్వారా 15 కిలోమీటర్లకు పైగా దూరం తగ్గుతుంది. రైతుల పడిగాపుల ఇబ్బందులు దూరమవుతాయి. సుంకిడిలో మార్కెట్ యార్డు నిర్మాణం జరిగితే 24 వేల మంది అన్నదాతలకు ప్రయోజనం కలుగుతుంది.

# దోమలతో తస్మాత్ జాగ్రత్త



సిరిసిల్ల: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ పంచాయతీలో మురుగునీరు వెళ్లలేని పరిస్థితి. ఈ గ్రామంలో రెండ్రోజులుగా నలుగురు జ్వరాలతో బాధపడుతుండగా.. ఒకరు డెంగీ లక్షణాలతో జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జిల్లా అంతటా ముసురు వర్షాలు ముంచెత్తాయి. పంచాయతీల్లో వరద, మురుగునీరు నిలిచి చాలా చోట్ల కుంటలను తలపిస్తున్నాయి. ఇలాంటి ప్రాంతాలు దోమలకు ఆవాసంగా మారే ప్రమాదం ఉంది. వ్యాధులు ముసురుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. జిల్లాలో జూన్, జులై నెలల్లో 3,311 సాధారణ జ్వరాలు.. ఈ ఏడాదిలో ఇప్పటికీ 11 డెంగీ జ్వరాలు నమోదయ్యాయి. పంచాయతీల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతోపాటు దోమల నివారణకు తీసుకునే చర్యలు కనిపించడం లేదు. కారణం చాలా పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. వ్యాధులు వచ్చాక చేసే హడావుడికంటే.. వాటి నివారణకు చర్యలు చేపట్టాలి.

**ఇదీ పరిస్థితి**

జిల్లాలోని 260 పంచాయతీలకు 98 పెద్దవి, 132 చిన్న ఫాగింగ్ యంత్రాలు ఉన్నాయి. వారంలో ఒక రోజు డ్రైడే పాటిస్తున్నట్లుగానే ఒక రోజు ఫాగింగ్ చేయాలి. డ్రైడే నిర్వహణకు వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది తమ పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు ఇంటి పరిసరాల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. వీటితోపాటు ఫాగింగ్ చేయాల్సిన యంత్రాలు మాత్రం కదలడం లేదు. పెద్ద ఫాగింగ్ యంత్రం ఒకసారి నడపాలంటే కనీసం రూ.6 వేల వరకు ఖర్చు అవుతుంది. డీజిల్, మలాథిన్ (దోమల నివారణ రసాయనం), ఆటోను అద్దెకు తీసుకొని గ్రామాల్లో వార్డుల వారీగా ఫాగింగ్ చేయాలి. చిన్న యంత్రానికి రూ.3 వేల వరకు ఖర్చవుతుంది. జిల్లాలోని చాలా పంచాయతీల్లో ఈ మాత్రం కూడా నిధులు వెచ్చించలేని పరిస్థితులు ఉన్నాయి.

పంచాయతీలకు 18 నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కావడంలేదు. చివరగా 2024 జులైలో ఒకసారి నిధులు వచ్చాయి. కాగా అవి అప్పటికే చేసిన పనుల పెండింగ్ బిల్లులకే సరిపోని పిరిస్థితి. పదిహేను రోజుల క్రితం స్టేట్ మ్యాచింగ్ గ్రాంటు కింద జిల్లాకు రూ.7 కోట్లు విడుదలయ్యాయి. వీటిని పంచాయతీల్లోని మల్టీపర్పస్ వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా మేజర్ పంచాయతీలు మండల కేంద్రాలు మినహా మిగతా పంచాయతీల్లో సాధారణ నిధులు లేవు.

పంచాయతీల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలు, తీసుకున్న చర్యలపై డీఎల్‌పీవో నరేష్‌ను సంప్రదించింది. 'పరిస్థితి తీవ్రతను బట్టి కార్యదర్శులు సొంతంగా నిధులు వెచ్చించి పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా రూ.కోటి నిధులు మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా పంచాయతీల్లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి మరిన్ని నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చార'ని పేర్కొన్నారు.

# అధ్వానంగా అంతర్గత రోడ్లు



సిరిసిల్ల : ఈ చిత్రంలో కనిపిస్తున్న రోడ్డు సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేట జ్యోతినగర్‌లోనిది. చిన్నపాటి వర్షానికే రోడ్డు గుంతలుగా మారుతుండగా కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. బురద కారణంగా అదుపు తప్పి కింద పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనమై ఏళ్లు గడిచినా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాకాలం వచ్చిందంటే అవస్థలు పడుతున్నట్లు చెబుతున్నారు. ఇది సిరిసిల్ల నుంచి పెద్దబోనాల వెళ్లే రోడ్డు. ఈ దారిగుండా నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షానికే రోడ్డు అధ్వానంగా మారుతుంది. గుంతలు పడిన చోట మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఏటా వర్షకాలంలో ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు వాపోతున్నారు.సిరిసిల్ల మున్సిపాల్టీలో చిన్నపాటి వర్షానికే రోడ్లు ఛిద్రం అవుతున్నాయి. జిల్లా కేంద్రంగా ఏర్పడి ఏళు గడుస్తున్నా పూర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రధాన, లింకు, విలీన గ్రామాల్లోని రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. దశాబ్దాల క్రితం వేసిన రోడ్లు కావడం, మరమ్మతులకు నోచుకోకపోవడంతో పూర్తిగా దెబ్బతింటున్నాయి. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికావడమే కాకుండా, రోడ్లు సైతం దెబ్బతింటున్నాయి. విలీన గ్రామాల పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారింది. చంద్రంపేట, జ్యోతినగర్, ఇప్పల్లపలి, పెద్దూరు తదితర గ్రామాల్లో ఇప్పటికీ చాలాచోట్ల మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. పూర్తి స్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో ఆయా గ్రామ ప్రజలు అవస్థలు పడుతున్నారు. బురద రోడ్ల మీదనే ప్రయాణాలు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. ఫస్ట్ గ్రేడ్ మున్సిపాలిటీలో కనీస మౌలిక వసుతులు కల్పించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**బురదతో అవస్థలు**

చిన్న పాటి వర్షానికే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. బురద రోడ్డుపై వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. సీసీ రోడ్లు నిర్మాణం చేపడతామని అంటున్నారే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. అధికారులు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

– శ్రీకాంత్ చంద్రంపేట

సీసీ నిర్మాణం చేపట్టాలిపట్టణంతో పాటు, శివారు ప్రాంతాల్లో సీసీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో శివారు ప్రాంతాల్లో ఉన్న మట్టి రోడ్లపై వాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. బురద రోడ్లపై ప్రయాణం చేయడం కష్టంగా మారుతోంది. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి.

– రాజు, 12వ వార్డు

సిరిసిల్ల పట్టణ స్వరూపం

| | |
|---|---|
| వార్డులు | : 39 |
| పట్టణ జనాభా | : 1,16,938 |
| పట్టణంలో రోడ్లు | : 276.91 కి.మీ |
| బీటీ రోడ్లు | : 40.33 కి.మీ |
| సీసీ రోడ్లు | : 137.44 కి.మీ |

# నిధులు రాలే.. వసతులు మెరుగవలే!

పెద్దపల్లి : ఉత్తమ వైద్యసేవలు అందిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్స్(ఎన్‌క్వాస్) ప్రోత్సాహక నిధులు అందని ద్రాక్షలా మారాయి. జాతీయస్థాయి నిర్దేశిత ప్రమాణాలు పాటించిన ఆసుపత్రులకు నిధుల మంజూరులో నిరీక్షణ తప్పడం లేదు. రెండేళ్లుగా నిధుల కేటాయింపు కాగితాలకే పరిమితమైంది. ఫలితంగా ఆసుపత్రుల్లో వసతులు మెరుగుపడటం లేదు.

ప్రక్రియ ఇలాప్రైవేటుకు దీటుగా వైద్య సేవలు అందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులకు కేంద్రం చేయూతనిస్తోంది. ఓపీ, అడ్మిన్, రేడియాలజీ, ఎమర్జెన్సీ, ఆక్సిలరీ, ఐపీడీ, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, ప్రసూతి వార్డు విభాగాల్లో సేవలు, రికార్డులు, పరిసరాలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తుంది. సేవలకు పాయింట్లు కేటాయించి అత్యధిక స్కోరు సాధించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఏటా రూ.3 లక్షలు, ఉప వైద్య కేంద్రాలకు రూ.1.50 లక్షలు, వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులకు ఒక్కో బెడ్‌కు రూ.10 వేల చొప్పున మూడేళ్ల పాటు నిధులు మంజూరు చేస్తారు. ఏటా 25 శాతం అటెండర్ స్థాయి నుంచి వైద్యుల వరకు పొందుతారు. 75 శాతం కుర్చీలు, బెంచీలు, వైద్య పరికరాలు, తాగునీరు, ఇతర మౌలిక వసతులకు. వైద్య సేవల్లో ఇబ్బంది లేకుండా రోగులకు అవసరమైన ఇతర వనరులు సమకూర్చుతారు.

**ఎంపికైనా ..**

కాల్వశ్రీరాంపూర్ పీహెచ్‌సీ ఎన్‌క్వాస్‌కు ఎంపికైనా వసతులు మెరుగవక ప్రసవాలు జరగడం లేదు.

కోరుట్ల, ఎకీన్‌పూర్, ఎస్కోనిగుట్ట పీహెచ్‌సీలలో ప్రాథమిక వైద్యమే అందుతోంది. వీణవంకలో రోగులకు సరిపడా సదుపాయాలు లేవు. ప్రమాదాల బారిన పడి వెళ్లిన రోగులకు ప్రథమ చికిత్సతో సరిపెడుతున్నారు. సరైన కుర్చీలు, బెంచీలు లేక నిలబడే పరిస్థితి నెలకొంది. వైద్య విధాన పరిషత్తు ఆసుపత్రుల్లో రోగుల సంఖ్యకు సరిపడా వసతులు లేవు.

నిధులు రాకున్నా పీహెచ్‌సీల్లో వైద్య సేవలకు ఇబ్బంది లేదని, సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నామని పెద్దపల్లి జిల్లా వైద్యాధికారి ప్రసన్నకుమారి చెప్పారు. ప్రోత్సాహక నిధులు విడుదలైతే వసతులు మరింత మెరుగుపడనున్నాయని వివరించారు.

రెండేళ్లలో ఎంపికైన ఆసుపత్రులు

| | |
|---|---|
| పెద్దపల్లి : | 8 |
| జగిత్యాల : | 9 |
| కరీంనగర్ : | 4 |
| రాజన్న సిరిసిల్ల : | 9 |

# సెస్సు.. గ్రంథాలయానికి ఆయుష్షు

సంగారెడ్డి: మార్చి నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగిసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని చాలా పంచాయతీల్లో శతశాతం ఆస్తి పన్ను వసూలయింది. బల్దియాలకూ ఆశాజనకంగా ఆదాయం సమకూరింది. ఇందులోంచి నిర్దేశిత వాటా ప్రకారం గ్రంథాలయాలకు చెల్లించాల్సిన 'సెస్' జమ చేయడం లేదు. ఫలితంగా పుస్తక నిలయాలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిధులు లేక ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధి పడకేసింది. మండల కేంద్రాల్లోని పుస్తక నిలయాల్లో ఏళ్లుగా మార్పు కానరావడం లేదు. ఆస్తిపన్నులోని వాటాను గ్రంథాలయాలకు చెల్లిస్తే సమస్య కొంతమేరకైనా గట్టెక్కే వీలుంటుంది.

**అమలుకు నోచని ఆదేశాలు**

గ్రంథాలయాల అభివృద్ధికి పంచాయతీల్లో జమవుతున్న సెస్‌ను చెల్లించాలని ఆ సంస్థ కార్యదర్శులు పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులకు ఆదేశాలు జారీ చేసినా.. స్పందన కరవైంది. ప్రస్తుతం గ్రంథాలయాలకు అభ్యర్థుల తాకిడి అధికమైంది. వివిధ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్నారు. వందలాది మంది నిరుద్యోగులు వస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇక్కడే ఉండి పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. గ్రంథాలయాల్లో వసతులు లేమి కారణంగా అభ్యర్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. సెస్ బకాయిలు సమకూరితే బల్లలు, కుర్చీలు, పుస్తకాలు తెప్పించే వీలుంది.

**క్షేత్రస్థాయి పరిస్థితి**

సంగారెడ్డిలో జిల్లా లైబ్రరీతో పాటు.. 19 శాఖా గ్రంథాలయాలున్నాయి. గత నాలుగేళ్లుగా గ్రామ పంచాయతీలు సెస్‌ను జమ చేయడం లేదు. జిల్లా పరిధిలోని జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్, జోగిపేట బల్దియాలు సైతం లైబ్రరీ సెస్ జమచేయక ఏళ్లు గడిచాయి. గత నాలుగేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పంచాయతీలతో పాటు బల్దియాల నుంచి పన్ను బకాయిలు రూ.5.18 కోట్లు జమచేయించారు. ఈ నిధులతోనే జిల్లాలోని గ్రంథాలయాల నిర్వహణ కొనసాగుతోంది.సిద్దిపేటలో జిల్లా గ్రంథాలయంతో పాటు 16 శాఖా గ్రంథాలయాలున్నాయి. గత ఎనిమిదేళ్ల నుంచి పంచాయతీలు సెస్‌ను జమచేయడం లేదు. పురపాలికలు మాత్రం నిర్దేశిత వాటా కింద పన్నులో వాటాను జమ చేస్తున్నాయి. ఈ నిధులతోనే జిల్లాలోని గ్రంథాలయాల నిర్వహణ సాగుతోంది.

మెదక్ జిల్లా గ్రంథాలయంతో పాటు 19 మండల కేంద్రాల్లో మినీ గ్రంథాలయాలున్నాయి. మెదక్, రామాయంపేట మినహా మిగిలిన బల్దియాలు సెస్ జమ చేస్తున్నాయి.

**సౌకర్యాలు మెరుగుపడితేనే..**

ఉమ్మడి మెదక్ పరిధి మూడు జిల్లాల్లోని గ్రంథాలయాల్లో సౌకర్యాలు మెరుగు పడాల్సిన అవసరం ఉంది. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జిల్లా గ్రంథాలయాల్లో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం నిధుల కొరత కారణంగా డిమాండ్‌కు అనుగుణంగా విద్యార్థులు కోరిన కొన్ని పుస్తకాలు మాత్రమే తెప్పిస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా ఉండాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉండడం లేదు. ప్రధానంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అవసరమయ్యే పుస్తకాలు సమకూర్చాల్సి ఉంది.

**అధికారులు ఏమంటున్నారంటే..**

సెస్ బకాయిలు జమచేయాలని పంచాయతీ కార్యదర్శులతో పాటు బల్దియాల కమిషనర్లకు తాఖీదులు జారీచేశామని సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వసుంధర, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంశీకృష్ణ పేర్కొన్నారు.

# వ్యూహం రచిద్దాం.. పాగా వేద్దాం


సంగారెడ్డి: రానున్న మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించిన నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎన్నికలకు సమాయత్తమవుతున్నాయి. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలైన అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భారాస, భాజపాలు వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు రిజర్వేషన్లు అనుకూలిస్తే సిద్ధంగా ఉండేందుకు కసరత్తు చేసుకుంటున్నారు.

**హామీలు అమలు చేయడం లేదని భారాస**

ప్రతిపక్ష భారాస ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో బలమైన క్యాడర్‌ను కలిగి ఉంది. మాజీ మంత్రి హరీశ్‌రావు నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలపై నిరసన కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా జిన్నారంలో పటాన్‌చెరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల కర్షకులకు రైతుభరోసా కోసం మహాధర్నా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలు సక్రమంగా అమలు చేయడం లేదంటూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేస్తున్నారు.

**మెజార్టీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్**

రానున్న స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవడానికి



అధికార కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇప్పటికే నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై నేతలు, పార్టీ కార్యకర్తల నుంచి అంతర్గతంగా సమాచారాన్ని సేకరిస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలతో పాటు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలున్న చోట మండలాల వారీగా పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నారు. ఇటీవలే ఉమ్మడి జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులైన వివేక్ వెంకటస్వామి ఉమ్మడి జిల్లాలోని పదకొండు నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై నిఘా వర్గాల ద్వారా సమగ్ర సమాచారం తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ బలహీనంగా ఉన్న నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని నిర్ణయించారు.

**పట్టున్న ప్రాంతాలపై భాజపా దృష్టి**

గ్రామీణ ప్రాంతాల్లో పట్టున్న ప్రాంతాలపై భాజపా దృష్టి సారించింది. గతంలో పలు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు సాధించిన దుబ్బాక నియోజకవర్గంతో పాటు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, భారాసల కంటే అధిక ఓట్లు సాధించిన ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని అన్ని స్థానాల్లో పోటీచేసేందుకు భాజపా సమాయత్తమవుతోంది. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించేందుకు అవసరమైన వ్యూహాలు రచిస్తున్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు నియోజకవర్గాల వారీగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

# నీరుగారిన బెల్లం మార్కెట్

అనకాపల్లి : జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన అనకాపల్లి బెల్లం మార్కెట్ వైభవం కోల్పోతోంది. ఏటా ఆగస్టులో మొదలై వచ్చే ఏడాది జులై వరకు మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతుంటాయి. గత సీజన్‌లో 7.13 లక్షల బెల్లం దిమ్మలే అమ్ముడయ్యాయి. వీటి విలువ రూ.38.03 కోట్లు. వందేళ్లకుపైగా చరిత్ర ఉన్న మార్కెట్‌లో ఇంత తక్కువ స్థాయిలో అమ్మకాలు ఎప్పుడూ జరగలేదని వ్యాపారులు చెబుతున్నారు.

**గిట్టుబాటు ధరల్లేకే.. :** బెల్లం తయారీ తగ్గిపోవడానికి అనేక కారణాలున్నాయి. గిట్టుబాటు ధరలు లభించకపోవడం, కూలీల సమస్య ఎక్కువగా ఉండటమే ప్రధాన కారణం. ఏటికేడు సాగు ఖర్చులు పెరుగుతుంటే.. గిట్టుబాటు ధరలు తగ్గుతున్నాయి. 2023-24 సీజన్‌లో వంద కేజీల బెల్లం ధర సగటున రూ.3,912 పలకగా, గత సీజన్‌లో రూ.3,759 పలికింది. 1987-88లో 84.63 లక్షలు



దిమ్మలు విక్రయించగా 2011-12 సీజన్‌లో రూ.155.40 కోట్ల వ్యాపారం జరిగింది. ఆ సమయంలో వంద కేజీల బెల్లం సగటు ధర రూ.2,763. చెరకు పక్వదశకు రావాలంటే పది నెలలు పడుతుంది. చెరకు నుంచి రసం తీసి బెల్లం తయారు చేస్తారు. ఇది అందరూ చేయలేరు. నైపుణ్యం ఉన్న రైతులే చేయగలరు. నాట్లు నుంచి గానుగాట వరకు కూలీలు అవసరం ఉంటుంది. కుటుంబంలోని సభ్యులంతా కష్టపడ్డా నాట్లు, కలుపుతీత, కోత, గానుగాట సమయంలో కూలీల అవసరం ఉంటుంది. ఎకరా విస్తీర్ణంలో చెరకు సాగు చేసేందుకు రూ.70 వేలు ఖర్చవుతుంది. ఎకరాకు 25 టన్నులు దిగుబడి వస్తుంది. బెల్లం తయారీ చేసి విక్రయిస్తే నికరంగా రూ.15 వేలు కూడా మిగలడం లేదని రైతులు వేగి రామారావు, మళ్ల రామజోగి చెబుతున్నారు. సొంత భూమి లేకపోతే కౌలుకే రూ.10 వేలు అవుతోందన్నారు. పదేళ్లుగా ఏటా మార్కెట్‌కు వచ్చే బెల్లం దిమ్మలు తగ్గుతున్నాయి. ఒక్కో దిమ్మ బరువు 14 నుంచి 16 కేజీలు ఉంటుంది. ముగిసిన సీజన్‌లో 7.62 లక్షల దిమ్మలు అమ్మకం చేశారు. గత సీజన్‌తో పోలిస్తే 50 వేల దిమ్మలు తక్కువగా వచ్చాయి.

# పల్లెలు వెలుగుతున్నాయ్..!

చిత్తూరు :కార్వేటినగరం సబ్-డివిజన్ పరిధి నింద్ర సెక్షన్‌లో 16 ఫీడర్లు.. ఆరు ఉపకేంద్రాల స్టేషన్లలో పరిధిలో వందశాతం ఆర్డీఎస్ఎస్ పనులు పూర్తయ్యాయి. తద్వారా 150 గ్రామాలకు నిరంతరాయంగా త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా ఉంది. లోఓల్టేజీ, సరఫరాలో అంతరాయం సమస్యే ఇకలేదు. ప్రమాదకర లైన్ల సమస్యలేదని ఆప్రాంత రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కుటీర, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతామని చెబుతున్నారు. పట్టణాలతోపాటు పల్లెల్లోనూ త్రీఫేజ్ విద్యుత్తు సరఫరాకు వేగంగా అడుగులు పడుతున్నాయి. పల్లెల్లోనూ 24గంటల నిరంతర వెలుగులకు కేంద్ర ప్రభు త్వం నిర్ణయించింది. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 60 శాతం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం డిస్కంల నిధులతో ఆర్డీఎస్ఎస్( రీవ్యాప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్) పథకాన్ని అమలు చేస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రూ.1,400 కోట్లతో 2023 జూన్ లో పనులు ప్రారంభించగా.. గత ప్రభుత్వం ఆటంకాలు సృష్టించడంతో పనులు నత్తనడకన సాగాయి. కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో ఉమ్మడి జిల్లా పరిధిలో 200 ఫీడర్ల పరిధిలో పనులు పూర్తిచేసి.. 1,190 గ్రామాల్లో నిరంతరం త్రీఫేజ్ వెలుగులు ప్రారంభమయ్యాయి. మిగిలినవాటిలోనూ వేగంగా పనులు కొనసాగుతున్నాయి.

**వేగంగా పనులు..**



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్డీఎస్ఎస్ పనులు వేగంగా సాగుతున్నాయి. నగరి, నింద్ర, ఏర్పేడు మండలాల్లో వంద శాతం పూర్తికాగా.. పాకాల, చిన్నగొట్టిగల్లు, ఎస్ఆర్‌పురం, వెదురుకుప్పం తదితర మండలాల్లో 75శాతం పూర్తయ్యాయి. మిగిలిన మండలాల్లో 50-45 శాతం జరిగాయని అధికారులు పేర్కొంటున్నారు.

**తంబళ్లపల్లెలోనూ కదలిక..**

అన్నమయ్య జిల్లాలోని తంబళ్లలోని నియోజకవర్గంలో కూటమి పార్టీకి చెందిన ఓ ముఖ్య నాయకుడి జోక్యంతో పనులు ఆగిపోయినట్లు ఇటీవల కథనం ప్రచురితమైంది. కథనంతో పనులు సజావుగా సాగుతున్నాయి. నిర్దేశిత సమయానికి పనులు పూర్తిచేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

**చిన్నతరహా పరిశ్రమలకు ఉపయుక్తం**


ప్రస్తుతం పట్టణాలకు త్రీఫేజ్ వసతి ఉంది. ఈ పనులు పూర్తయితే గ్రామాల్లోనూ గృహ, వ్యవసాయ, పరిశ్రమలు ఇలా అన్ని కేటగిరీలకు 24 గంటలు త్రీఫేజ్ సౌకర్యం రానుంది. ప్రస్తుతం పల్లెల్లోనూ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. వ్యవసాయ, అనుబంధ పరిశ్రమలు ఏర్పాటుకు ఔత్సాహక పారిశ్రామికవేత్తలు ఆసక్తి కనబరుస్తున్నారు.

**సకాలంలో పూర్తి చేస్తాం**

నిర్దేశిత సమయానికి పనులు పూర్తిచేస్తాం. పనుల పురోగతిపై ప్రతివారం అధికారులు, గుత్తేదారులతో సమీక్షిస్తున్నాం. జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి ఈ పథకం ఎంతో ఉపయుక్తం కానుంది.
అయూబ్‌ఖాన్, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్), ఎస్పీడీసీఎల్

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం ఫీడర్లు: 890
వందశాతం పూర్తి: 200

# చేతి గ్లోవ్.. ఆరోగ్యం చెప్పేస్తుంది..!



విశాఖపట్నం: హృదయ స్పందన, రక్తపోటు, తదితర ఆరోగ్య విషయాలను తెలిపే వైద్య పరికరాలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. వాటికి భిన్నంగా పనిచేసే పరికరాన్ని తయారు చేయాలని ఏయూ ఇంజినీరింగ్ విద్యార్థినులు భావించారు. ఆలోచనలకు పదును పెట్టి 'చేతి గ్లోవ్' తయారు చేశారు. దీన్ని ధరిస్తే శరీరంలోని కీలక అవయవాలు ఎలా పనిచేస్తున్నాయో ఇట్టే తెలుసుకోవచ్చు. దీనికి 'వియరబుల్ హెల్త్ గ్లోవ్' అనే పేరు పెట్టారు.

**ప్రాజెక్టులో భాగంగా...:** ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ట్రిపుల్‌ఈ చదివిన విద్యార్థినులు కె.శివచంద్రిక, మోనాలిసా సేథి, ఎస్.తనూజ చివరి సంవత్సరం ప్రాజెక్టులో భాగంగా ఆరోగ్యాన్ని తెలియజేసే 'చేతి గ్లోవ్' ఆలోచన చేశారు. ఈ విషయాన్ని సహాయ ఆచార్యులు డాక్టర్ కె.అరవింద శిల్ప దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సహకారం, కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఆర్.పద్మశ్రీ ప్రోత్సాహంతో ఆలోచన కార్యరూపం దాల్చింది.

**ఎలా పనిచేస్తుందంటే..:** ఈఎస్‌పీ32 మైక్రో కంట్రోలర్ ఆధారంగా ఈ గ్లోవ్‌ను అభివృద్ధి చేశారు. మాక్స్ 30102, ఎంపీయూ 6050, ఇతర సెన్సార్లు ఉపయోగించారు. ఒకే సారి ఎస్పీఓ2 (ఆక్సిజన్ స్థాయి), బీపీఎం (హృదయ స్పందనలు), స్టెప్స్, కేలరీలు, శరీర ఉష్ణోగ్రతను కొలవగలగడం దీని ప్రత్యేకత. గ్లోవ్ ధరించిన వ్యక్తి తన ఆరోగ్య సమాచారాన్ని మొబైల్ యాప్ ద్వారా చూడగలుగుతారు. రియల్ టైమ్ డేటా అప్‌డేట్, సెన్సార్ ఇంటిగ్రేషన్ కోసం సులభమైన యూజర్ ఇంటర్‌ఫేస్ కలిగి ఉంది. ఎప్పుడైనా ఆరోగ్యంలో అసాధారణతలు కనిపిస్తే (ఉదాహరణకు: గుండె స్పందనలు, శరీర ఉష్ణోగ్రత, ఆక్సిజన్ స్థాయి మొదలైనవి) వెంటనే ఒక హెచ్చరిక(అలెర్ట్)ను పంపిస్తుంది. ఈ హెచ్చరికలను ఎస్.ఎం.ఎస్.రూపంలో వ్యక్తి సన్నిహితులు, కుటుంబ సభ్యులు, మిత్రులు, లేదా వైద్యులకు చేరవేస్తుంది. తద్వారా తక్షణమే వైద్య సహాయం పొందవచ్చు.'అనారోగ్యంతో ఉన్న వృద్ధులు బయటకెళ్లినప్పుడు వారున్న స్థలాన్ని తెలుసుకోవడానికి దీనికి జీపీఎస్ సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. జీఎస్ఆర్ సెన్సార్‌తో వ్యక్తుల్లో ఒత్తిడిని గుర్తించి మానసికంగా ఎలా ఉన్నారో కూడా తెలుసుకోవచ్చు'ని విద్యార్థినులు వివరించారు. ప్రస్తుతం ప్రొటోటైప్ పరికరం తయారు చేసినట్లు తెలిపారు.

# తీరం దాటిన అక్రమం..!



ఇచ్ఛాపురం : సంతబొమ్మాళి మండలం కొల్లిపాడు, ఆర్‌హెచ్‌పురం, ఆకాశలఖవరం వద్ద ప్రభుత్వానికి చెందిన వందల ఎకరాల్లో తంపర, ఉప్పు భూముల్లో రొయ్యల చెరువులు నిర్మించారు. జగన్నాథపురం సమీపంలో సుమారు 300 ఎకరాల మేర ఆక్రమణలు తొలగించాలని హైకోర్టు ఆదేశాలిచ్చినా అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టి ఊరుకున్నారు. ఇచ్ఛాపురం మండలం డొంకూరు, బూర్జపాడు, చిన్నలక్ష్మీపురం ప్రాంతాల్లో తంపరను ఆనుకుని రొయ్యల చెరువుల నిర్మాణం చేపట్టారు. సుమారు 200 ఎకరాల మేర ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. రెవెన్యూ అధికారులు పలుమార్లు పరిశీలించినా తొలగించలేదు. జిల్లాలో చాలాచోట్ల తీర ప్రాంతానికి దగ్గర ప్రభుత్వ భూముల్లో రొయ్యల చెరువులు అక్రమంగా వెలిశాయి. వర్షపు నీరు సముద్రంలో కలిసే ప్రదేశాన్ని ఆక్రమించి ప్రవాహాన్ని అడ్డగించడంతో వేల ఎకరాలు ముంపునకు గురై పంటలు దెబ్బతింటున్నాయి. రైతులు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకునేవారు కరవయ్యారు. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, పోలాకి, గార, ఎచ్చెర్ల, శ్రీకాకుళం ప్రాంతాల్లో 1,550 హెక్టార్లలో రొయ్యలు సాగు చేస్తున్నారు. చెరువులకు సమీప ప్రాంతాల్లో చేపట్టిన పంట కోత ప్రయోగాల్లో సున్నా దిగుబడి వస్తుండటం గమనార్హం.

**కీలక నేతల అండ**

జిల్లాలోని పలు ప్రాంతాల్లో రొయ్యల అక్రమ సాగుకు కీలక నేతల అండ ఉంది. అధికార పార్టీకి చెందిన వారి చెరువులు తొలగించకుండా తమవి తొలగించరనే ధీమాతో ఇతర నాయకులున్నారు. పలువురు గుత్తేదారులు, స్థిరాస్తి వ్యాపారం చేసే వారు ఈ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నారు.
నిబంధనలు ఉల్లంఘిస్తున్నా పట్టించుకునే వారు కరవయ్యారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

**నివేదిక సిద్ధం చేస్తున్నాం..:** అనధికారికంగా రొయ్యల చెరువులు నిర్వహిస్తున్నట్లు పరిశీలనలో తేలితే ఉపేక్షించం. వాటిపై స్థానిక అధికారులే బాధ్యత వహించాలి. దీనికి సంబంధించి నివేదిక సిద్ధం చేస్తున్నాం. ఉన్నతాధికారుల సూచన మేరకు చర్యలు తీసుకుంటాం.
ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సంయుక్త కలెక్టర్, శ్రీకాకుళం

# తైలం పాపం.. తలో లీటరు



పుత్తూరు : నగరపాలక సంస్థలు, పురపాలికల్లో డీజిల్ పేరుతో ఏటా రూ.లక్షల్లో పక్కదారి పట్టిస్తున్నారు.. వినియోగానికి, చెల్లింపులకు పొంతన కుదరడం లేదు.. వాహనాల సంఖ్య తక్కువగా ఉన్నా వందలాది లీటర్లు వినియోగిస్తున్నట్లు దస్త్రాల్లో నమోదుచేసి కొందరు అధికారులు, ప్రజాప్రతినిధుల సొంత వాహనాలకు వాడేస్తున్నారు.. ఉన్నతాధికారులు సైతం విచారణ చేపట్టకపోవడంతో అక్రమాలకు అడ్డే లేకుండాపోయింది.

**వాహనాల వినియోగం ఇలా..**

పురపాలిక సంఘాల్లో ట్రాక్టర్లు, పెద్ద వాహనాలు, కంపాక్టర్లు చిన్న, పెద్ద జేసీబీలు, ఫాగింగ్ యంత్రాలు వినియోగిస్తున్నారు. రోజుకు సగటున ఓ ట్రాక్టర్ పురపాలికలో 30 కి.మీ. మేర నడుస్తుంది. 250 నుంచి 300 నివాసాల నుంచి చెత్త సేకరిస్తారు. వీటన్నింటినీ కలిపి రోజుకు సగటున 2-3 లీటర్లు డీజిల్ వినియోగం ఉంటుంది.

**కంపాక్టర్:** మిడిల్ పాయింట్ నుంచి యార్డుకు చెత్త తీసుకెళ్తుంది. రోజుకు 10-15 కి.మీ. రాకపోకలు ఉంటాయి. లీటర్ డీజిల్ చొప్పున నెలకు 150 లీటర్లకు మించి కాదు. మున్సిపాలిటీలో 1-3, నగరపాలికల్లో 10 వాహనాలు ఉంటాయి.

**ఫాగింగ్ యంత్రాలు:** ఫాగింగ్ యంత్రానికి 3 లీటర్లు పడుతుంది. మూడు యంత్రాలు ఉంటే 10 లీటర్లు అవసరం. జేసీబీ గంట పనిచేస్తే 10 లీటర్లు చిన్న జేసీబీలకు గంటకు మూడు లీటర్లు ఖర్చవుతుంది. వీటి సేవలు నిరంతరం ఉండవు.

**ఎవరూ పట్టించుకోరని..**

డీజిల్ వినియోగానికి సంబంధించి ఎవరూ పట్టించుకోరనేది అధికారుల ధీమా. దీంతో ఇష్టానుసారంగా డీజిల్ బిల్లులు పెట్టి స్వాహా చేస్తున్నారు. ఇదంతా ఉన్నతాధికారులు ఆడిట్ సమయంలో గట్టిగా ప్రశ్నించాలి. అయితే వారికీ ఎంతోకొంత ముట్టజెప్పుతుండటంతో అభ్యంతరాలు లేవని సంతకాలు చేస్తుండటం గమనార్హం.
పుత్తూరు పురపాలికలో గత వైకాపా హయాంలో డీజిల్ పేరుతో పెద్దఎత్తున బిల్లులు పెట్టి స్వాహా చేశారు. 2019-20లో రూ.15.47 లక్షలు, 2020-21లో రూ.23.74 లక్షలు, 2021-22లో 32.85 లక్షలు, 2022-23లో రూ.29.22 లక్షలు ఖర్చు చేశారు. 2021-22లో ఏకంగా రూ.10 లక్షల డీజిల్ ఖర్చు పెరగడం చూస్తే ఏమేరకు అవినీతి జరిగిందో తెలుస్తోంది.
సూళ్లూరుపేట పురపాలికలో ఆరేళ్లలో డీజిల్ వినియోగానికి లెక్కేలేదు. వాహనాలు తక్కువ ఉన్నా ప్రతినెలా రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు దస్త్రాల్లో చూపారు. పురపాలక ఖాతా నుంచే పలువురు తమ సొంత వాహనాలకు డీజిల్ వినియోగించారనే ఆరోపణలు ఉన్నాయి.
తిరుపతి నగరపాలకసంస్థలో గత ప్రభుత్వంలో నెలకు రూ.25 లక్షల వరకు డీజిల్ పక్కదారి పట్టినట్లు అంచనా. ఇవన్నీ తెలిసినా అప్పటి అధికారులు పట్టనట్లు వ్యవహరించడంతో నగరపాలకసంస్థకు సంబంధం లేని వ్యక్తులు సైతం దర్జాగా సొంతానికి డీజిల్ వినియోగించిన ఘటనలు ఇటీవల రహస్య తనిఖీల్లో వెలుగుచూడటంతో కమిషనర్ మౌర్య విస్తుపోయారు. ఓ డీఈఈ నిర్వాకంతో గతంలో నెలకు రూ.75 లక్షలు (అన్ని వాహనాలు) డీజిల్‌కు ఖర్చవుతుండగా అతడిపై 'వేటు', బదిలీ తరవాత ఇప్పుడు నెలకు రూ.25 లక్షలు మిగులుతోందంటే గత ఐదేళ్లలో ఎంతగా అక్రమాలు సాగాయనేది వేరే చెప్పనక్కర్లేదు.
చిత్తూరు నగరపాలకలో నెలకు రూ.10 లక్షలు డీజిల్‌కు ఖర్చవుతోంది. అందులో రూ.2 లక్షల మేర పక్కదారి పడుతోంది. ఇది తెలిసినా అధికారులు నోరు మెదపరు.

# సిలికా తవ్వకాల్లో మందగమనం

చిల్లకూరు : రాష్ట్రంలోనే అరుదుగా దొరికే సిలికా ఖనిజం తవ్వకాలు గాడిన పడటం లేదు. చిల్లకూరు, కోట మండలాల్లోని ఆరువేల హెక్టార్లలో నిల్వలు ఉన్నాయి. వ్యాపారులు టన్నుకు రూ.348 వంతున రాయల్టీ చెల్లిస్తుండగా క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులతో ప్రభుత్వ ఆదాయంపై ప్రభావం పడుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి గనుల్లో కార్యకలాపాలు సాగుతున్నాయి. తవ్వకాల బాధ్యతను ఓ సంస్థకు అప్పగించగా నెలకు సరాసరి 30 నుంచి 70 టన్నులు తరలిస్తున్నట్లు అంచనా.



**గుజరాత్ నుంచి దక్షిణాది రాష్ట్రాలకు దిగుమతి**

తవ్వకాల బాధ్యతను చేపట్టిన సంస్థ ధరలు పెంచడంతో కొనుగోలు చేసేందుకు ఇటు వ్యాపారులు, అటు పరిశ్రమలు ఆసక్తి కనబరచడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో టన్ను సిలికాను ఎండీఎల్స్‌కు రూ.1,400, శుద్ధిచేసే కర్మాగారాలకు రూ.1600లకు విక్రయించేవారు. తాజాగా టన్నుకు రూ.200 పెంచేశారు. దీనికితోడు యార్డులకు తరలించేందుకు రవాణా ఛార్జి గతంలో రూ.60 ఉండగా అదికాస్త రెట్టింపయ్యింది. దీంతో సిలికా రవాణా నాలుగో వంతుకు పడిపోయింది. మహారాష్ట్రకు ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని పరిశ్రమల అవసరాలకు గుజరాత్ నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు సమాచారం. తక్కువ ధరకు కర్నూలులో దొరికే క్వార్ట్జ్ పొడిని గాజు పరిశ్రమల అవసరాలకు వినియోగిస్తున్నట్లు సమాచారం. సిలికా ఖనిజ రవాణా రూపేణా ప్రభుత్వానికి రాబడి తగ్గిన మాట వాస్తవమేనని, అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయగలిగామని గూడూరు గనుల శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

# దద్దణాల.. నిర్లక్ష్యమేల

బనగానపల్లి : బనగానపల్లి మండలం.. జోలాపురం సమీపంలో జుర్రేరు వాగుపై నిర్మించిన దద్దణాల చెరువు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. సుమారు 1,550 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు 0.27 టీఎంసీల సామర్థ్యంతో 1959లో దీనిని నిర్మించారు. చెరువు నుంచి నీరు బయటకు వెళ్లేందుకు రెండు గేట్లు ఏర్పాటుచేశారు. వీటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో తుప్పు పట్టాయి. ఓ గేటు పైకెత్తేందుకు వీలు లేకుండా పోయింది. అధికారుల నిర్లక్ష్యం, లస్కర్లు లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి.

**ముళ్లకంపలతో నిండి..**

చెరువు నుంచి పొలాలకు నీరందించేందుకుగాను సుమారు 7 కి.మీ. మేర కాలువ నిర్మించారు. దీని నిర్వహణను సైతం గాలికొదిలేయడంతో మొత్తం ముళ్ల కంపలతో నిండిపోయింది. చెరువులో నీరున్నప్పటికీ రైతులకు ఉపయోగపడని పరిస్థితి నెలకొంటోంది. ఈసారి వర్షాలు ఆశాజనకంగా పడటం.. ఎత్తిపోతల ద్వారా నీరు రావడంతో చెరువు సగం వరకు నిండింది. కాలువ అధ్వానంగా ఉండటంతో నీరు ముందుకు ప్రవహించని పరిస్థితి నెలకొంటోంది. ఈ నేపథ్యంలో గేట్లకు మరమ్మతులతోపాటు కాలువకు మరమ్మతులు చేయించాలని అన్నదాతలు విన్నవిస్తున్నారు.

**రూ.22 కోట్లు వెచ్చించి..**

దద్దణాల చెరువు నీటితో కళకళలాడుతున్నప్పటికీ గేట్లు సరిగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గేట్ల నుంచి నీరంతా లీకేజీ రూపంలో కిందకు పోతోంది. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో సుమారు రూ.22 కోట్లు వెచ్చించి ఎస్సార్బీసీ నుంచి ఎత్తిపోతల ద్వారా చెరువుకు సాగునీరు అందిస్తున్నారు. ఓ వైపు ఎత్తిపోతల ద్వారా చెరువులోకి నీరు వస్తుండగా.. మరోవైపు లీకేజీ రూపంలో నీరు బయటకు పోతుండటం గమనార్హం. గత ప్రభుత్వం చెరువు నిర్వహణకు ఒక్క పైసా నిధులు కేటాయించలేదు.

# ఊరంతా తెలిసినా ఉరుకుంటారేం?

ఒంగోలు : ఒంగోలు: జిల్లా కేంద్రమైన ఒంగోలు నగర నడిబొడ్డునున్న ఊర చెరువు ఆక్రమణలపై నగరపాలక సంస్థ అధికార యంత్రాంగం కినుక వహిస్తోంది. చెరువు స్థలంలో పెద్ద పెద్ద భవంతులు నిర్మించి భారీగా అద్దెలు వసూలు చేస్తున్న వ్యవహారం కళ్ల ముందే కనిపిస్తున్నా చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. మరోవైపు రీసర్వే ఎందుకు చేయలేదని కిందిస్థాయి సిబ్బందికి సంజాయిషీ తాఖీదులతో సరి పుచ్చడం గమనార్హం. పేరు పేదలది.. సోకు పెద్దలది అన్నట్లు ఊర చెరువుకు సంబంధించి పట్టాలిచ్చిన స్థలంలో పెద్దలు పాగా వేసి భారీ భవంతులు నిర్మించారు. అత్యంత రద్దీ ప్రాంతం కావడంతో ఒక్కో భవనానికి రూ.లక్షల్లో అద్దె వసూలు చేస్తున్నారు. దీనిపై క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి నగరపాలక సంస్థ యంత్రాంగం వరకు మామూళ్లు సమర్పించుకోవడంతో ఎవరూ నోరుమెదపడం లేదు. ఇక్కడ నకిలీ పట్టాలు పుట్టించి ఊర చెరువు స్థలాలు కబ్జా చేయడంతో పలు వివాదాలు చెలరేగాయి. దీనిపై హైకోర్టులో సైతం కేసులు నడుస్తున్నాయి. బండ్లమిట్ట రహదారి విస్తరణలో తమకు అన్యాయం జరిగిందని పలువురు చిరు వ్యాపారులు లోకాయుక్తాకు ఫిర్యాదులు చేశారు.
ఊర చెరువు స్థలంలో పట్టాలిచ్చిన స్థలంలో నిర్మాణాలపై 108 మంది పట్టాదారులకు సంబంధించి సర్వే చేపట్టి ఏయే భవంతులున్నాయనే దానిపై పదేళ్ల కిందటేసర్వే చేపట్టారు. అప్పటి నుంచి ఎలాంటి చర్యల్లేవు సరికదా రీసర్వే పేరుతో కాలాయపన చేస్తున్నారు. ఈ ప్రాంతంలో నిర్మాణాలపై రీసర్వే చేపట్టాల్సిందిగా నగరపాలక సంస్థలోని నలుగురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుకు బాధ్యతలు అప్పగించారు. ఇక్క ఎలాంటి అనుమతుల్లేకుండా నిర్మించిన భవంతులకు సంబంధించి క్షేత్రస్థాయిలో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి చర్యల్లేకపోవడంతో మూడు రోజుల కిందటనలుగురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు సంజాయిషీ తాఖీదులు జారీ చేయడం గమనార్హం.
ఆక్రమణలతో అక్రమార్కులు రూ.లక్షల్లో ఆదాయం పొందుతుండగా, నగరపాలక సంస్థకు పన్నుల రూపంలో ఎలాంటి ఆదాయం రావడంలేదు. గతంలో ఇచ్చిన పట్టా స్థలానికి, ప్రస్తుతం రోడ్డుపైకి వచ్చి ఆక్రమణలతో భారీ భవంతులు ఉన్న దానికి ఏమాత్రం పొంతన ఉండడంలేదు. సుమారు 14 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఊరచెరువు పేదల ఇంటి స్థలాలు, ఆక్రమణదారులతో కుదించుకుపోయింది. ఇక్కడ చిన్న దుకాణానికి సైతం రూ.వేలల్లో అద్దెలు వసూలు చేస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు చెరువుకు నలువైపులా కబ్జాలతో చొచ్చుకొస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించి కబ్జా పర్వానికి అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

చురకలు



## వైద్య కళాశాలపై చిగురించిన ఆశలు

పెనుకొండ : 2026–27 విద్యాసంవత్సరానికి వైద్యకళాశాల నిర్మాణం పూర్తి చేస్తామని ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఓ సమావేశంలో ప్రకటించడంతో పెనుకొండ ప్రజల ఆశలు చిగురించాయి. కూటమి ప్రభుత్వంలోనైనా కళాశాల నిర్మాణం జరిగితే పట్టణ అభివృద్ధికి ఊతం లభిస్తుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెనుకొండలో భూములు, ఇతర వ్యాపారాలకు పూర్వవైభవం వస్తుందని వ్యాపారులు ధీమాతో ఉన్నారు.

**నిర్మాణం ప్రారంభించి నాలుగేళ్లు**

వైకాపా పాలనలో 2021 మే 31న అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ.475 కోట్ల అంచనాలతో పెనుకొండలో దాదాపు 80 ఎకరాల విస్తీర్ణంలో వైద్యకళాశాల నిర్మాణానికి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. మేగా కంపెనీ గుత్తేదారు పనులు ప్రారంభించి 2021 నుంచి 2024 వరకు కేవలం 15శాతం పూర్తి చేశారు. వైకాపా పాలనలో నిధుల కొరతతో పనులు నత్తనడకన సాగాయి. గత ప్రభుత్వం నిధులు సమకూర్చకుండానే, అనాలోచితంగా పార్లమెంటు నియోజకవర్గానికి ఒక వైద్యకళాశాల నిర్మిస్తామని ఆట్టహాసంగా ప్రారంభించారు. చివరకు నిధుల కొరతతో ఏళ్లు గడిచినా పనులు




పూర్తి చేయలేదు. 2024 సార్వత్రిక ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కళాశాల నిర్మాణం పూర్తవుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

**పెరిగిన భూముల ధరలు**

అప్పట్లో వైద్యకళాశాల రావడంతో పట్టణంలో ఇంటి స్థలాలు, భూముల ధరలు అమాంతం పెరిగాయి. కళాశాల నిర్మిస్తున్న మడకశిర రోడ్డు పక్కన జర్నలిస్టు కాలనీలో సైతం నివాస గృహాల నిర్మాణం వేగంగా జరిగింది. కళాశాల నిర్మాణం ఆగిపోవడంతో భూములు, ఇంటి స్థలం కొనుగోలు చేసిన ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. మొదట్లో సెంటు రూ.4లక్షలకు కొనుగోలు చేసిన వారు, ప్రస్తుతం అదే స్థలం రూ.4 లక్షలన్నా ఎవరూ ముందుకు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కాసింత ఆలస్యం

చిత్తూరు : నూతన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ ఆలస్యం కానుంది. వైకాపా ప్రభుత్వం హడావుడిగా సర్వే చేయడంతో పాటు విస్తీర్ణంలో తేడాలు, పేర్లలో తప్పులు ఉన్నా పట్టించుకోలేదు. సరిహద్దు రాళ్లనే కాదు.. రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాలపైనా నాటి సీఎం జగన్ తన బొమ్మలేసుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక జగన్ బొమ్మ తొలగించి.. రాజముద్రతో కొత్త పాస్‌పుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఇది రైతులకు సంతోషం కలిగించే అంశమే అయినా వాటిలో తప్పులు చూస్తేనే ఆందోళన కలుగుతోంది. గత ప్రభుత్వంలో చేసిన తప్పుల్ని సరిదిద్దకనే కొత్త పుస్తకాలు ప్రింట్ చేయించారు. చిత్తూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 107 గ్రామాలకు సంబంధించి సుమారు




28 వేల పట్టాదారు పుస్తకాలు ఆర్డీవో కార్యాలయానికి చేరాయి.

**3,031 ఫొటోలు తారుమారు**


రెవెన్యూ గ్రామాల వారీగా సంబంధిత వీఆర్వోలే పాసుపుస్తకాలు క్షుణ్నంగా పరిశీలించారు. 3,031 పాసుపుస్తకాల్లో ఫొటోలు తారుమారైనట్లు గుర్తించారు. జాయింట్ ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్) సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ఆధార్, మొబైల్ నంబర్లలో తప్పులు, సర్వే నంబర్లు, భూ విస్తీర్ణంలో వ్యత్యాసాలు, రైతుల పేర్లలోనూ తప్పులు దొర్లడాన్ని ప్రధానంగా గుర్తించారు. తప్పులు సరిదిద్దే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

**ప్రభుత్వానికి నివేదించాం..**

నూతన పట్టాదారు పాసుపుస్తకాల్లో ఫొటోలు తారుమారు తదితర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి నివేదించాం. తప్పులు లేని పట్టాదారు పుస్తకాల పంపిణీకి చర్యలు చేపడుతున్నాం. శ్రీనివాసులు, ఆర్డీవో, చిత్తూరు

## డిప్యుటేషన్ రద్దు ఉత్తర్వులెక్కడ?

సూళ్లూరుపేట: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగుల డిప్యుటేషన్లు రద్దు చేయమని ప్రభుత్వ ఆదేశాలిచ్చినా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోలేదు. జూన్‌లో బదిలీ సర్వీసు పూర్తయిన వారందరూ బదిలీ అయ్యారు. సొంత




మండలాల్లో పని చేయకూడదన్న నిబంధన తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో బదిలీ అయిన పలువురు రాజకీయ నేతల సిఫార్సుతో డిప్యుటేషన్లపై తిరిగి సొంత మండలాలకు, వారు ఎంచుకున్న ప్రాంతాలకు చేరారు. దీనిపై వార్డు, గ్రామ సచివాలయాల వ్యవస్థ ముఖ్య కార్యదర్శి కాటంనేని భాస్కర్ స్పందించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో డిప్యుటేషన్లు రద్దుచేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఉత్తర్వులు వచ్చి రోజులు కావస్తున్నా అమలుకు నోచుకోలేదు. బదిలీలకు ముందు క్లస్టర్ వ్యవస్థను తీసుకొచ్చి ఉద్యోగులకు హేతుబద్ధీకరణ చేసింది. డిప్యుటేషన్‌పైనే విధులు నిర్వహిస్తుండటంతో సచివాలయాల్లో మళ్లీ పెద్దఎత్తున ఖాళీలు ఏర్పడ్డాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది.

# పచ్చదనంపై బొగ్గుల కుంపటి



రాయదుర్గం : అనంతపురం జిల్లా తక్కువ వర్షపాతం కురిసే ప్రాంతం. జిల్లాలో చెట్లు, అడవుల పెంపకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నాయి. కానీ కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పచ్చని చెట్లను నరికేస్తున్నారు. వాటిని కాల్చి బొగ్గుగా మార్చి ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో పచ్చదనం తరిగిపోయి తీవ్ర కరవు ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది. జిల్లాలోని రాయదుర్గం, కణేకల్లు, బెళుగుప్ప, కళ్యాణదుర్గం మండలాల్లో బొగ్గుల కోసం పచ్చని చెట్లను నరుకుతున్నారు. వంట చెరుకుగా ఉపయోగపడే కంప చెట్లతో పాటు మామిడి, చింత, నీలగిరి తదితర వృక్షాలను నేలకూలుస్తున్నారు. వాటిని కాల్చి బొగ్గులుగా మార్చి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. వేపరాళ్ల, రచ్చుమర్రి, ఆదిగానిపల్లి తదితర గ్రామాల్లో బొగ్గుల బట్టీలు విపరీతంగా వెలిశాయి. ఇక్కడి నుంచి బొగ్గును నిత్యం లారీల్లో కర్ణాటక రాష్ట్రానికి ఎగుమతి చేస్తున్నారు.

**పొగ కమ్ముకొని ఆరోగ్యంపై ప్రభావం**

వేపరాళ్ల గ్రామం పరిసరాల చుట్టూ పెద్దఎత్తున బొగ్గుల బట్టీలు నిర్వహిస్తుండటంతో వాతావరణం కలుషితం అవుతుంది. పొగ కమ్ముకొని ప్రజలు శ్వాసకోశ వ్యాధులు, నల్లని దుమ్ము, ధూళితో ఊపిరితిత్తుల రోగాల బారిన పడుతున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పరిసరాల్లోనూ బొగ్గుల బట్టీలు నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన కొందరు ఒకే పర్మిట్‌పై నాలుగు, ఐదు ట్రిప్పుల లారీల బొగ్గులు తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవంగా బొగ్గుల తయారీకి కంప చెట్లు మాత్రమే వాడాల్సి ఉన్నా.. పచ్చని చెట్లను నరికేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. బొగ్గుల తయారీదారులు, వ్యాపారులకు అటవీశాఖ అధికారులు సహకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. బొగ్గుల బట్టీలను గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**చెట్లు నరికితే కేసులు నమోదు చేస్తాం: దామోదర్‌రెడ్డి, అటవీశాఖ డీఆర్‌ఓ**

రాయదుర్గం నియోజకవర్గంలో కొన్ని బర్నింగ్ పాయింట్ల ఏర్పాటుకు ప్రభుత్వం లైసెన్సులు మంజూరు చేసింది. గ్రామాల సమీపంలో బొగ్గుల బట్టీలు నిర్వహిస్తే తొలగిస్తాం. వృక్షాలు నరికితే కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా విధిస్తాం.

# నిధులు నిక్షేపం.. పనుల్లో నిర్లక్ష్యం



ధర్మవరం : కూటమి ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా దేవాదాయ శాఖ పరిధిలోని ప్రముఖ ఆలయాలకు జీర్ణోద్ధరణ పథకం కింద (సీజీఎఫ్–కార్పస్ గుడ్ ఫండ్) నిధులు మంజూరు చేసింది. పనులకు ఆన్‌లైన్‌లో టెండర్లు ఆహ్వానించగా పలువురు గుత్తేదారులు చేజిక్కించుకున్నారు. గత ఏడాది నవంబర్‌లోనే ఈ పనులు చేపట్టాలని దేవాదాయశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కానీ గుత్తేదారులు తీవ్ర అలసత్వం చూపుతున్నారు. ఉన్నతాధికారుల ఒత్తిడితో పలు ఆలయాల్లో శంకుస్థాపనలు చేసి పునాదులు తవ్వి వదిలేశారు. ధర్మవరం పట్టణంలోని పాండురంగస్వామి ఆలయానికి రూ.1.25 కోట్లు మంజురయ్యాయి. పనులు చేపడుతున్నామని గుత్తేదారు తెలుపడంతో ఆలయాన్ని పాక్షికంగా కూల్చారు. శంకుస్థాపన చేసి పునాదులు తవ్వారు. ఇటీవల కురిసిన వర్షాలకు అందులో నీరు నిల్వ చేరాయి. ఏడాదవుతున్న ఒక్క ఇటుక పేర్చలేదు. ముఖ్యమైన పండుగల సమయంలో స్వామిని దర్శించుకోలేక ఇంట్లోనే పూజలు చేసుకుంటున్నామని భక్తులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు.

**చేపట్టాల్సిన పనులు ఇవే..**

ఆలయాల్లో ముఖ మండపాలు, ధ్వజస్తంభాలు, భక్తులు సేద తీరేందుకు గదులు, అవసరమైన చోట స్నానపు గదులు, గర్భగుడి చుట్టూ రక్షణతో కూడిన ఇనుప కడ్డీలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

**సకాలంలో పూర్తి చేయిస్తాం: నరసింహరాజు, జిల్లా దేవాదాయ శాఖాధికారి**

నిధుల మంజూరులో ఆలస్యంతో అభివృద్ధి పనుల వేగం తగ్గింది. గుత్తేదారులతో మాట్లాడి సకాలంలో పూర్తి చేయించి, భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

# 'నాటీ' నిపుణులు.. పేదల సేవకులు..!



విశాఖపట్నం: ఎండాడకు చెందిన వెంకన్న ఎప్పుడూ నీరసంగా ఉంటున్నాడు. ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే భయం. ఆరోగ్యం బాగుండాలంటే పోషకాహారం తినాలని తెలియదు. ఇలాంటి ఎంతో మంది సరైన పోషకాహారం తీసుకోక అనారోగ్యం బారిన పడుతున్నారు. అలాంటి వారికి వైద్య విద్యార్థులు భరోసా కల్పిస్తున్నారు. భవిష్యత్తులో వైద్య రంగంలో రాణించాలని ఉవ్విళ్లూరుతున్న వారంతా 'కుటుంబ దత్తత' కార్యక్రమం (ఎఫ్‌ఏపీ)లో భాగంగా పేదల ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తున్నారు.

**3 నుంచి 5 కుటుంబాలు..:** దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం జాతీయ వైద్య కమిషన్ నాలుగేళ్లుగా కుటుంబ దత్తత కార్యక్రమం (ఎఫ్‌ఏపీ) అమలు చేస్తోంది. ఎంబీబీఎస్‌లో చేరిన ప్రతి విద్యార్థి కొన్ని కుటుంబాలను దత్తత తీసుకోవాలి. 2021 నుంచి గీతం వైద్య కళాశాలలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ప్రతి విద్యార్థి 3 నుంచి 5 కుటుంబాలను దత్తత తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు దాదాపు 1300 కుటుంబాలను దత్తత తీసుకుని వారి ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.

**సమస్య తెలుసుకుని..**

సలహాలిచ్చి..: వైద్య విద్యార్థులు తరచూ దత్తత కుటుంబాలతో మాట్లాడి వారి ఆరోగ్య వివరాలను తెలుసుకుంటారు. ఆయా ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. రక్తపోటు, మధుమేహ బాధితులకు ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తారు. పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి సలహాలిస్తారు.

వైద్య విద్యార్థులందరూ ఆయా కుటుంబాల్లోని వ్యక్తుల ఆరోగ్యాన్ని మూడేళ్లపాటు పర్యవేక్షిస్తారు.

నాలుగో ఏడాది ఆ వివరాలన్నింటినీ ఒకచోట చేర్చి, ఐదో ఏడాది నివేదిక అందజేస్తారు. కమ్యూనిటీ మెడిసన్ విభాగం నుంచి ఒక ప్రొఫెసర్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.

**పరిశోధనకు అవకాశం..**

దత్తత కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు వైద్య పరీక్షలు చేయగా.. వారిలో చాలా మందికి రక్తహీనత ఉన్నట్లు బయటపడింది. వృద్ధుల్లోనూ రక్తహీనత సమస్య ఉందని, దీనిపై పరిశోధన చేయొచ్చని వైద్య విద్యార్థుల్లో అవగాహన పెరిగినట్లు ప్రొఫెసర్లు చెబుతున్నారు. దీనిపై ఓ విద్యార్థి చేసిన పరిశోధన ఐసీఎంఆర్ షార్ట్‌టర్మ్ స్టూడెంట్ ప్రాజెక్టుకు ఎంపికైంది. ఆ విద్యార్థికి రెండేళ్లపాటు రూ.60 వేల స్టయిఫండ్ అందనుంది.

**విద్యార్థులకూ ప్రయోజనాలు..:**

వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు గీతం డీమ్డ్ వర్సిటీలో చదువుతున్నారు. ఈ కార్యక్రమం ద్వారా స్థానిక సంస్కృతి, ప్రజల ఆహారపు అలవాట్లు, ఆరోగ్య పరిస్థితులు తదితరాలు తెలుసుకుంటున్నారు. భవిష్యత్తులో వారు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఈ అంశాలు సహకరిస్తాయి. ప్రొఫెసర్ శ్రీవిద్య, కమ్యూనిటీ మెడిసన్ విభాగం, గీతం వైద్య కళాశాల

# పారకాలువలో.. ఆక్రమణల పరంపర

తిరుపతి: స్థలం.. పొలం.. ఇలా ఏది కనిపిస్తే అది ఆక్రమిస్తున్నా పట్టించుకోకపోవడంతో చివరికి శ్మశానాలూ కబ్జా చేశారు. రామచంద్రాపురం మండలం కమ్మపాళెం పంచాయతీ పారకాలువ గ్రామంలోని సర్వే నంబర్ 134లో రావిళ్లవారిపల్లి లెక్క దాఖలాలోని 4.06 ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన వైకాపా నేత ఆక్రమించారు. ఇది కశిం కాలువ పోరంబోకు కాగా గ్రామస్థులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండేది. ఈ నేపథ్యంలో 50 అడుగుల మేర బాగు చేసుకుని శ్మశాన స్థలంగా వాడుకొనేవారమని, వైకాపా నేత ఆక్రమించడంతో ఆఖరి మజిలీకి సైతం అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**హెచ్చరిక బోర్డు..** ఈ ఏడాది సంక్రాంతి రోజున రెవెన్యూ అధికారులు పరిశీలించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయబోతుండగా సదరు వైకాపా నేతలు అడ్డుకొని వారిపైనా దౌర్జన్యం చేశారు.. గతంలో ఓ వ్యక్తి చనిపోతే.. దహనక్రియలు చేసేందుకు స్థలంలోకి తీసుకెళ్తుండగా...



అక్రమార్కులు అడ్డుకున్నారు. ఆక్రమణలపై తహసీల్దారు మధుసూదనరావు వివరణ కోరగా తాను కొత్తగా వచ్చానని, విచారణ అనంతరం ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

**ఏళ్లుగా పోరాడుతున్నాం..**

కసిం కాలువలోని శ్మశాన స్థలాన్ని ఆక్రమించారు. ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. కలెక్టరేట్లో అర్జీ ఇచ్చినా పరిష్కారం కరవైంది. ఏళ్లుగా పోరాటం చేస్తున్నాం. ముఖ్యమంత్రికి అర్జీ ఇచ్చాం. – పులిపాటి నాథముని నాయుడు, పారకాలువ

**న్యాయం చేయండి సారూ..!**

కాలువ అందరికీ సంబంధించింది.. కానీ ఓ వైకాపా నేత, ఆయన కుమారుడు. కబ్జా చేయడంతో అన్ని విధాలుగా ఇబ్బందులు పడుతున్నాం. ఇక్కడే పశువులు మేపుకొంటూ సంక్రాంతికి పొంగలి పెట్టుకుంటూ కాలువ నీళ్లు వాడుకునేవాళ్లం. ఆక్రమణతో ప్రస్తుతం శివాలయం వద్దకు వెళ్లాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలి. పి.చంద్రబాబు నాయుడు, పారకాలువ

## దయ చూపితే దాచుకుంటాం..!

పోలాకి : రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వ్యవసాయ ఉత్పత్తులు ప్రకృతి వైపరీత్యాల బారిన పడకుండా.. గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకోవడానికి వీలుగా వైకాపా ప్రభుత్వం గ్రామ స్థాయిలో బహుళార్థ సాధక గోదాంల నిర్మాణం చేపట్టింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో పనులు జరిగేలా నాబార్డు నుంచి నిధులు కేటాయించింది. జిల్లాలో కొన్నిచోట్ల భవనాలు నిర్మించినా వినియోగంలోకి రాక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

**ఇదీ పరిస్థితి** జిల్లాలో 37 పీఏసీఎస్‌ల పరిధిలో 25 గోదాంలు మంజూరు కాగా 18 నిర్మించారు. 5 వివిధ దశల్లో ఉండగా మిగిలినవి స్థల సమస్యతో పనులు ప్రారంభం కాలేదు. 500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో ఒక్కో నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేశారు. సారవకోట మండల కేంద్రానికి 20 కి.మి. దూరంలో నిర్మించడంతో అక్కడికెవరు వెళ్తారంటూ అన్నదాతలు ఆసక్తి చూప డం లేదు. ఇదే పరిస్థితి దాదాపు అన్నిచోట్లా ఉండటంతో ప్రారంభించినా ఎక్కడా వినియోగంలోకి వచ్చిన దాఖలాలు లేవు

**నిర్మాణం వరకే..:** గోదాంల నిర్మాణం చేపట్టడం వరకే మా బాధ్యత. పూర్తయిన వాటిని జిల్లా సహకార శాఖకు అప్పగిస్తాం. వాటి వినియోగంపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. రామారావు, డీఈఈ, మార్కెటింగ్ శాఖ శ్రీకాకుళం

**వినియోగంలోకి తీసుకొస్తాం..:** నిర్మాణం పూర్తయిన గోదాంలను వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నాం. వేర్ హౌసింగ్ డెవలప్‌మెంట్ రెగ్యులేటరీ అథారిటీతో ఎంవోయూ చేసుకుంటున్నాం. ఈ ప్రక్రియ పూర్తయితే నిల్వ చేసుకున్న పంటలకు బీమా సౌకర్యం లభిస్తుంది. త్వరలోనే అందుబాటులోకి వచ్చేలా చూస్తాం. ఎ.మురళీకృష్ణ, జిల్లా సహకార శాఖ అధికారి, శ్రీకాకుళం

## మదుం మెరుగైంది.. రైతు కష్టం తీరింది!

సోంపేట : మహేంద్రతనయ నదిపై అనంతపురం వద్ద మదుం, ఇతర నిర్మాణాలు దెబ్బతినడంతో దశాబ్ద కాలంగా ఆయకట్టు రైతులు సాగునీటికి అష్టకష్టాలు పడ్డారు. ఏటా ఖరీఫ్‌లో రూ.2 లక్షలకు పైగా సమకూర్చుకుని శ్రమదానంతో ఇసుక బస్తాలు అడ్డంగా పెట్టి కొంతమేర నీరు పొలాలకు మళ్లించుకునేవారు. నదికి భారీగా వరద చేరితే ఇసుక బస్తాలు కొట్టుకుపోయి పంటలకు నష్టం వాటిల్లేది.

**వైకాపా పాలనలో నిర్లక్ష్యం**

బారువ, మరో 5 పంచాయతీల పరిధిలో గ్రామాలకు సంబంధించి 3 వేల ఎకరాల మేర బారువ గ్రోయిన్ ద్వారా సాగునీరందేది. ఏడేళ్ల కిందట మదుం నిర్మాణానికి నిధులు మంజూరు కాగా వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు సాగలేదు.

అప్పట్లో మంజూరైన రూ.25 లక్షలతో పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. గ్రోయిన్ పరిధిలో పనికిరాని మొక్కలు పేరుకుపోవడం.. సామగ్రి ధరలు పెరిగిపోవడంతో పాత ధరల ప్రకారం పనులు చేయడానికి గుత్తేదారులు ముందుకు రాలేదు. ఈ అంశంపై వరుస కథనాలు ప్రచురితం కాగా ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ స్పందించారు. కలెక్టర్, జలవనరుల శాఖ అధికారులతో మాట్లాడారు.

**శరవేగంగా నాట్లు**

ఖరీఫ్ సాగుకు నీరందించేలా అధికారులు చొరవ చూపి గుత్తేదారులను సంప్రదించడంతో మదుం పనులు పూర్తయ్యాయి. ఏటిబట్టి కాలువ మెరుగుపడటంతో ఆయకట్టు భూములకు సాగునీటి కష్టాలు గట్టెక్కాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నదికి వచ్చిన వరద నిలిచేందుకు అవకాశం ఏర్పడింది. ప్రధాన కాలువ నుంచి నాలుగు పిల్ల కాలువలకు నీరు చేరడంతో నాట్లు వేయడానికి ఇబ్బందులు తప్పాయని జలవనరుల శాఖ ఏఈ సూర్యప్రకాశ్ తెలిపారు.

చురకలు



# మొదటి ర్యాంకు.. రాదెందుకు?

విశాఖపట్నం : స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డులు ప్రకటించిన తొలిసారి మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరం 25వ స్థానంలో ఉంది. ఆ తర్వాత ఏడాది నుంచి వరుసగా ఎనిమిదేళ్లు ప్రథమ స్థానంలో నిలిచింది. ఇదంతా ఎలా సాధ్యమైంది? పక్కా ప్రణాళిక, స్వచ్ఛతపై ప్రజలందరికీ అవగాహన, జన భాగస్వామ్యం, మురుగునీటి శుద్ధి, ఘనవ్యర్థాల నిర్వహణ వంటివి అమలు చేయడమే కారణం. మహా విశాఖ నగరపాలక సంస్థ(జీవీఎంసీ) ఆ దిశగా సాగుతున్నా తడబడుతోంది. పూర్తిస్థాయిలో కసరత్తు లోపించింది.

**ఎక్కువ ఇళ్లు..తక్కువ సిబ్బంది, వాహనాలు:** స్వచ్ఛ మిషన్, ఆపరేషన్ క్లీన్ ఛాలెంజ్ పేరుతో ఇండోర్‌లో ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ప్రతి ఇంటి నుంచి తడి–పొడి చెత్తసేకరణ, రోడ్ల పక్కన ప్రతి 500 మీటర్ల దూరానికి ఒక డస్ట్‌బిన్ ఉండేలా నగరంలో 3 వేలు ఏర్పాటు చేశారు. ప్రజా మరుగుదొడ్ల సంఖ్య అత్యధికంగా పెంచారు. రోడ్లపై ఉమ్మితే జరిమానాలు విధించారు. తడిచెత్తను కంపోస్టుగా, పొడిచెత్తను ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో రీసైక్లింగ్ చేస్తున్నారు. బయో మిథనైజేషన్ ప్లాంటు ఏర్పాటు చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసి చెత్త తరలింపు, ట్రీట్‌మెంట్‌పై సీసీ కెమెరాల నిఘా ఉంచారు. జీవీఎంసీలో ఇండోర్ కంటే ఎక్కువ ఇళ్ల నుంచి చెత్తసేకరణ చేయాల్సి ఉన్నా తక్కువ వాహనాలు, తక్కువ సిబ్బంది ఉన్నారు.

నగరంలో బహిరంగంగా ఏర్పాటు చేసిన చెత్త డబ్బాల నిర్వహణ అధ్వానంగా మారింది. కొండవాలు ప్రాంతాల్లో చెత్త సేకరణ సరిగా జరగడం లేదు. పలు చోట్ల అపార్ట్‌మెంట్‌ల వద్దా ఇదే పరిస్థితి.

స్వచ్ఛ ర్యాంకు సాధనలో ఎన్నో అంశాలు విశాఖకు ప్రతిబంధకాలుగా



మారాయి. రోజువారీ సేకరిస్తున్న చెత్తలో కాపులుప్పాడలోని విద్యుత్ ప్లాంటు, బయోగ్యాస్ ప్లాంట్‌కు, కంపోస్టు తయారీకి వెయ్యి టన్నులకు పైగా వినియోగిస్తున్నారు. అయితే పారిశుద్ధ నిర్వహణ, తరలింపు, ఘనవ్యర్థాల నిర్వణలపై ప్రత్యేక నిఘాలేదు. రెండేళ్లు వర్మీ కంపోస్టు తయారు చేసినా, కొనుగోలుకు ఎవరూ రాకపోవడంతో ఆయా కేంద్రాలు నిలిపివేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సైతం వేరు చేయడం లేదన్న విమర్శలున్నాయి.

**అంతా సముద్రంలోకి:** ఇండోర్‌లో మురుగు నీటిని శుద్ధి చేసిన తర్వాతే నదుల్లోకి వదులుతారు.అలాగే.. శుద్ధి చేసిన మురుగు నీటిని పలు కూడళ్లలో ఫౌంటైన్లలో, గార్డెన్స్ నిర్వహణకు ఉపయోగిస్తున్నారు. విశాఖలో రోజూ 263 ఎంఎల్‌డీ మురుగు ఉత్పన్నమవుతుంది. భూగర్భ డ్రైనేజీ కాల్వల ద్వారా వచ్చే మురుగును శుద్ధి చేయడానికి 19 ఎస్‌టీపీలు (శుద్ధికేంద్రాలు) ఏర్పాటు చేశారు. వీటిలో కొన్ని మరమ్మతులకు గురైన నేపథ్యంలో శుద్ధి చేయకుండానే మురుగును నేరుగా సముద్రంలోకి వదిలేస్తున్నారు.

**జరిమానాల్లేవు:** ఇండోర్ జనాభా దాదాపు 35 లక్షలు. ఇక్కడ ప్రజా మరుగుదొడ్లు 1500పైగా ఏర్పాటు చేశారు. 24 లక్షల జనాభా ఉన్న విశాఖలో 328 ప్రజామరుగు దొడ్లు ఉన్నాయి. వీధి దీపాల నిర్వహణకు ఏటా రూ.7 కోట్లకు పైగా ఖర్చు పెడుతున్నా కొన్ని ప్రాంతాల్లో అంధకారం తప్పడం లేదు. వెలగని దీపాలను 24 గంటల్లో మరమ్మతు చేయకపోతే జరిమానా విధించాల్సి ఉన్నా ఆ ఊసే కరవైంది. మరోవైపు నిషేధిత ప్లాస్టిక్ ఇబ్బడిముబ్బడిగా విక్రయిస్తున్నారు. ఈ పరిస్థితులు మారితేనే విశాఖ స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో ముందుకు దూసుకువెళ్లే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.

# నీటి సరఫరాలో మాయాజాలం

విశాఖ : మహా విశాఖ నగరపాలక సంస్థ మంచినీటి సరఫరా ఇంజినీరింగ్ విభాగంలో ఇంటి దొంగలు భారీగా దండుకుంటున్నారు. జోన్–8 పరిధిలోని కొందరు అధికారులు ఓ కంపెనీకి చేసే నీటి సరఫరాలో అక్రమాలకు పాల్పడుతూ రెండు చేతులా సంపాదించుకుంటున్నారనే ఆరోపణలొస్తున్నాయి. ఏళ్ల తరబడి నీటి సరఫరా నిర్వహణ, ప్రాజెక్టుల్లో ఇంజినీర్లుగా కొనసాగుతూ, నీటి విక్రయాల్లోనూ, లెక్కల్లోనూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. మంచినీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ రెండూ పనులు కొందరికే అప్పగించిన నేపథ్యంలో పూర్తిస్థాయిలో విచారణ చేస్తే జరుగుతున్న మాయ బయటపడుతుంది.

నరవ వద్ద 108 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ పర్ డే) మురుగునీటి శుద్ధి కేంద్రం ఉంది. ప్రస్తుతం 54 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మురుగును శుద్ధి చేస్తుంది. దాని నుంచి ఉత్పత్తయ్యే నీటిని కిలోలీటరు రూ.45ల చొప్పున ఓ కంపెనీకి విక్రయించాలి. రోజుకు 2 ఎంజీడీ (మిలియన్ గ్యాలన్ పర్ డే) నీటిని సరఫరా చేయాల్సి ఉంది. అందుకు తగ్గ మురుగు నీటిని శుద్ధి చేయాల్సిన బాధ్యత ఓ నిర్వహణ సంస్థది. అయితే వారు సక్రమంగా నీటిని అందించలేకపోతున్నారు. ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేకంగా నరవలోని మంచినీటి ట్యాంకుల నుంచి భారీ పైపులైను సదరు కంపెనీకి ఏర్పాటు చేశారు. నగర అవసరాలకు వినియోగించాల్సిన నీటిలో 2 ఎంజీడీల నీటిని గుట్టుగా ఈ మార్గంలో అందిస్తున్నారు. ఒప్పందం మేరకు కిలో లీటరుకు రూ.45 చెల్లిస్తున్నారు. అయితే... వారికి పంపిస్తున్నది శుద్ధి చేయని మంచినీరు. ఇది కిలో లీటరు రూ.90. అలా చూస్తే కిలో లీటరుకు రూ.45ల తక్కువ. ఇలా మిగులుతున్న సొమ్ములో వాటాలు కొందరు అధికారులకు అందుతున్నాయన్న ఆరోపణలున్నాయి.



నిత్యం 2 ఎంజీడీల నీటి సరఫరాలో భారీగా అక్రమాలకు పాల్పడుతున్నా, ఉన్నతాధికారులు పట్టనట్లు వ్యవహరించడంపై అనుమానాలు రేగుతున్నాయి. 2 ఎంజీడీల నీటికి నెలకు రూ.2.16 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ. 1.08 కోట్లే చెల్లిస్తున్నారు. ఏడాదికి రూ.25.92 కోట్లు రావాల్సి ఉన్నా రూ.12.96 కోట్లే ఖజానాకు వస్తున్నాయి.

మరో వైపు...పర్యావరణానికి ఇబ్బంది లేకుండా విదేశీ టెక్నాలజీ ఉపయోగించి, మురుగునీటిని మూడు దశల్లో శుద్ధి చేసి మంచినీరుగా మార్చి ఇవ్వాల్సిన ప్రాజెక్టు ఆదిలోనే పక్కదారి పట్టడంపైనా అధికారులు దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది.

జీవీఎంసీ విక్రయించే నీటిని లెక్కకట్టడానికి ప్రత్యేకంగా మీటర్లను ఏర్పాటు చేసింది. బల్క్ కనెక్షన్‌ల విషయంలో మరింత పకడ్బందీగా వ్యవహరిస్తుంది. దీంతో సదరు కంపెనీకి నీటిని అందించే విషయంలో అధికారులు జాగ్రత్తపడ్డారు. నరవ ఎస్టీపీ వద్ద నీటిని విడిచిపెట్టే ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన మీటరును.. కంపెనీలో మంచినీరు, ఎస్టీపీ నుంచి చేరే నీరు కలిసే సమీప ప్రాంతంలో ఏర్పాటు చేశారు. దీని వల్ల ఎస్టీపీ నుంచి వచ్చే శుద్ధి చేసిన నీరే వినియోగిస్తున్నారన్న భ్రమ కల్పిస్తున్నారు.

# తూకమేసి మోసం






కర్నూలు : చిరు ఉద్యోగి రాముడు ఇటీవల 25 కిలోల సోనామసూరి బియ్యం కొనుగోలు చేశారు. ఇందుకు రూ.1,100 చెల్లించారు.. ఆ సంచి తూకం వేయగా 24 కిలోలే ఉంది.. ఆయన రూ.44 అధికంగా చెల్లించారు.ఒక్క రాముడే కాదు.. జిల్లాలో బియ్యం కొనుగోలు చేస్తున్న ప్రతి వినియోగదారుడు ఇలానే మోసపోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకు 2.32 లక్షల క్వింటాళ్ల బియ్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఒక బియ్యం సంచిపై రూ.50 చొప్పున ఏటా రూ.55.80 కోట్ల మేర వ్యాపారులు దోచుకుంటున్నారు.

**పాతవంటూ బురిడీ**

ఖరీఫ్ సీజన్‌లో నంద్యాల జిల్లాలో 65–80 వేల హెక్టార్లు, కర్నూలులో 12–13 వేల హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. ఇందులో 96 శాతం సోనామసూరి రకాలే ఉంటాయి. సాధారణంగా ఎకరాకు 30–40 సంచుల ధాన్యం దిగుబడి వస్తుంది. ఏడాది కిందట పండిన ధాన్యం అయితే 75 కిలోల సంచి ధాన్యాన్ని రూ.3,000 కొనుగోలు చేస్తున్నారు. అదే కొత్తవి (గత ఖరీఫ్, రబీ కాలం) అయితే రూ.2,000 చెల్లిస్తున్నారు. వ్యాపారులు మిల్లుల్లో మిల్లింగ్ చేసి సంచుల్లో ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. వరి గింజ నాణ్యతగా ఉంటే 75 కిలోల వరి ధాన్యం మిల్లింగ్ చేయించగా 50 కిలోల బియ్యం వస్తుంది. ః రైతుల వద్ద కొత్త బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి మరాడించి పాతవంటూ అంటగడుతున్నారు.

**ధరల నియంత్రణ ఊసేలేదు**

ఉమ్మడి జిల్లాలో 9.30 లక్షల కుటుంబాలు (70 శాతానికిపైగా) సోనామసూరి బియ్యాన్నే వినియోగిస్తున్నాయి. నలుగురైదుగురు సభ్యులున్న ఒక కుటుంబం సరాసరిన నెలకు 25 కిలోల చొప్పున ఏడాదిలో 3 క్వింటాళ్ల బియ్యం వినియోగిస్తుంది. 2019 నుంచి ఇప్పటి వరకు పరిశీలిస్తే కిలో బియ్యంపై రూ.25 మేర ధర పెరిగింది. వ్యాపారులు ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నారు. అదుపు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు.

జేసీ అధ్యక్షతన పౌరసరఫరాల అధికారులతోపాటు అనుబంధ శాఖలు సమన్వయంతో సమావేశాలు నిర్వహించి ధరలు నియంత్రించాల్సి ఉంది. కమిటీ సమావేశం ఏడాదికి ఒకసారి.. అదీ మొక్కుబడిగా సాగుతోంది. మరోవైపు పౌరసరఫరాల శాఖ అధికారులు తమకెలాంటి సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు.

**తనిఖీలు తకరారు** ఉమ్మడి కర్నూలు జిల్లాలో 220 వరకు బియ్యం మిల్లులు ఉన్నాయి. ఇక్కడి నుంచి గంపగుత్తగా సంచులు తీసుకొచ్చి చిరు వ్యాపారులు విక్రయిస్తుంటారు. పౌరసరఫరాల శాఖ అధికారులు గతంలో బియ్యం మిల్లుల్లో విస్తృతంగా తనిఖీలు చేసేవారు. తూకాల్లో తేడాలకు సంబంధించి పెద్దఎత్తున కేసులు నమోదయ్యేవి. గత కొన్నేళ్లుగా ఏ ఒక్క శాఖ అధికారి అటువైపు వెళ్లడం లేదు. ఇదే అవకాశంగా వ్యాపారులు వినియోగదారులను నిలువునా ముంచుతున్నారు. సంచిపై 25 కిలోలు అని ముద్రించి 24 కిలోలు నింపి ప్యాకింగ్ చేస్తున్నారు. కిలోకు రూ.2 నుంచి రూ.5, రూ.10 వరకు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వం ఏటా విధించే లక్ష్యాలను పూర్తి చేసేందుకు తూనికలు, కొలతల శాఖ అధికారులు చిన్నచిన్న దుకాణాలపై దాడులు చేస్తున్నారు. కానీ బియ్యం సంచుల్లో కిలో నుంచి రెండు కిలోల వరకు తక్కువగా ఉంటున్నా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు.

# గుర్తింపులేని కష్టం.. కార్మికులకు నష్టం



కర్నూలు : భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు గుర్తింపు కార్డుల్లేక ఆర్థిక ప్రయోజనాలకు దూరమవుతున్నారు. పని ప్రదేశంలో భద్రత లేక ప్రమాదాల బారినపడుతున్నారు. వారికి ఎలాంటి ఆర్థిక సాయం అందక కుటుంబాలు వీధినపడాల్సిన పరిస్థితి నెలకొంది. బీమా పథకాల ప్రయోజనాలకు దూరం అవుతున్నారు. మరోవైపు పని ప్రదేశంలో సౌకర్యాలు, భద్రత కరవయ్యాయి. వాటి గురించి ప్రశ్నిస్తే మళ్లీ పనికి పిలవరన్న భయంతో ప్రమాదాల మధ్యనే కష్టపడుతున్నారు.

**భద్రత కరవు**

ఎత్తయిన ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు నిబంధనల ప్రకారం సేఫ్టీ బెల్టు ధరించాలి. అదుపుతప్పితే జారి కింద పడిపోకుండా మరో గోడకు రక్షణ వలయం ఏర్పాటు చేసుకోవాలి. పని ప్రదేశాల్లో శిరస్త్రాణం ధరించాలి. నేలపై నిల్చుని పనిచేసే వారు, విద్యుత్తు కార్మికులు కాళ్లకు బూట్లు, చేతులకు గ్లౌజులు ధరించాలి. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ఇవి అమలు కావడం లేదు. పని ప్రదేశాల్లో ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరిగి కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు.

**కార్డు ఎలా పొందాలి..?**

భవన, ఇతర నిర్మాణ కార్మికులు కార్మిక శాఖ నుంచి గుర్తింపు కార్డులు పొందాలంటే 18– 59 మధ్య వయసు వారై ఉండాలి. నమోదు చేసుకునే ఏడాదిలో 90 రోజుల పాటు నిర్మాణ రంగంలో పనిచేసి ఉండాలి. కార్మికశాఖ అధికారులకు రూ.110 చెల్లించి గుర్తింపు కార్డు పొందవచ్చు. ఐదేళ్ల తర్వాత రూ.60 చెల్లించి కార్డును రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ–శ్రమ్ కార్డును ఉచితంగా అందిస్తున్నాయి. దీనికి నమోదు చేసుకుంటే మేలు.

**ఇవీ ప్రయోజనాలు**

భవన నిర్మాణ కార్మికులు పనిచేసే ప్రదేశంలో మృతి చెందితే రూ.5 లక్షల బీమా పరిహారం అందజేస్తారు. తక్షణ సాయంగా రూ.20 వేలు మంజూరు చేస్తారు. అంగవైకల్యానికి రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు అందజేస్తారు. కార్మికులు సాధారణ మరణం పొందితే కుటుంబ సభ్యులకు రూ.60 వేల సాయం అందుతుంది. మహిళా కార్మికులకు రెండు కాన్పుల నిమిత్తం రూ.20 చొప్పున అందజేస్తారు.

**సాయానికి ఎదురుచూపులు**

కర్నూలు జిల్లా గూడూరులో భవన నిర్మాణం కోసం గుంతలు తీస్తుండగా పక్కనే ఉన్న ప్రహరీ కూలడంతో ఇద్దరు కార్మికుల మృతి చెందారు.

ఇటీవల కర్నూలు నగరంలోని బుధవారపేటలో మూడంతస్తుల భవనం నిర్మాణ పనులకు వెళ్లిన ఓ కార్మికుడు సిమెంటు బస్తాను పైకి తీసుకెళ్తూ అదుపుతప్పి కిందపడి మృతి చెందారు.

ఇలా పలువురు మృతి చెందారు. ఎందరో దివ్యాంగులుగా మారారు. వీరిలో చాలామంది గుర్తింపు పత్రాల్లేక నష్టపోయారు. మరోవైపు గుర్తింపు పత్రాలు కలిగిన కార్మికులు మృతి చెందినా వారి కుటుంబాలకు బీమా సొమ్ము సకాలంలో అందడం లేదు. ఉమ్మడి జిల్లాలో వేలాది కుటుంబాలు ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు : 1,67,860

ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్న కుటుంబాలు : 5,318

**రెండురోజుల్లో కార్డు ఇస్తాం**

– కె.వెంకటేశ్వర్లు, కార్మికశాఖ ఉప కమిషనరు, కర్నూలు జిల్లా

భవన, ఇతర నిర్మాణ కార్మికులు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలి. కార్మికశాఖ తరపున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లో మంజూరు చేస్తున్నాం. ప్రమాదవశాత్తు కార్మికులు మృతి చెందిన సందర్భంలో వారి కుంటుంబం పోలీసు కేసు నమోదు చేయిస్తే పరిహారం ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

# సమయం దాటాక విత్తనమా!

కదిరి : ఖరీఫ్‌లో అదునుకు పెట్టే పంటలే చేతికందటం లేదు. అలాంటిది సీజన్ ముగుస్తున్న సమయంలో వర్షాధార సాగుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. నూతన వంగడం.. నాలుగైదు రోజుల్లో ముగుస్తున్న ఖరీఫ్ సాగు సమయం. ఈ తరుణంలో వర్షాకాలం సాగంటూ విత్తనాలు ఇవ్వడమేంటని రైతులు చర్చించుకుంటున్నారు. నూతన వంగడమైన టీసీజీఎస్ 1694 (విశిష్ట) వేరుసెనగను రైతు పొలాల్లో సాగుకు చర్యలు చేపట్టారు. ఈ విత్తనాన్ని ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేసేషన్‌చే సాగు చేయించాలి. ఎంపిక ప్రక్రియ మార్చిలోనే పూర్తవ్వాలి. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్న సమయంలో ఎన్జీవోల ప్రమేయంతో పంపిణీకి అధికారులు విత్తనం సరఫరా చేస్తున్నారు. వేరుసెనగ కాయలను పంపిణీ చేసేదెప్పుడు, విత్తనం సిద్ధం చేసుకుని ఎప్పుడు సాగు చేస్తారోనన్న అయోమయం నెలకొంది. దీంతో ఉచిత విత్తన సాగు లక్ష్యం నీరుగారేలా ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**డివిజన్‌లో 500 హెక్టార్లు**

కదిరి వ్యవసాయ డివిజన్‌లో 500 హెక్టార్లలో సాగుకు వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కదిరి–6 రకం సాగులోకి వచ్చి 23 ఏళ్లు పూర్తయ్యింది. దీని స్థానంలో తెగుళ్లకు తట్టుకుని ఎక్కువ దిగుబడి వచ్చేలా కొత్తరకం వేరుసెనగ సాగును పెంచేలా చర్యలు చేపట్టారు. ఇందుకు టీసీజీఎస్ 1694 వంగడాన్ని పూర్తి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఒక్కో రైతుకు హెక్టారుకు 5 బస్తాల చొప్పున విత్తనం అందజేస్తారు. ఇప్పటికే నల్లమాడలో పంపిణీ చేశారు. మిగిలిన మండలాలకు సరఫరా చేస్తున్నారు.

**కొత్తరకంతో సాగు విస్తీర్ణం పెంచటమే లక్ష్యం**



సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

కదిరి–6 రకం స్థానంలో వాతావరణ మార్పులు, చీడపీడలు, దిగుబడి పెంచేలా విశిష్ట రకం విత్తనాన్ని ఉచితంగా ఇస్తున్నాం. ఎఫ్‌పీఓలతో రైతుల గుర్తింపు, సాగు చేయిస్తాం. వ్యవసాయశాఖ పర్యవేక్షణలో పండించే పంటను తిరిగి వెనక్కు తీసుకునేలా రైతులతో ఒప్పందం చేయిస్తున్నాం. ఎక్కడా సమస్యలేదు. కొత్తరకం విత్తనంతో సాగు విస్తీర్ణం పెంచేలా చూస్తున్నాం.

జిల్లా: శ్రీసత్యసాయి

వేరుసెనగ రకం: టీసీజీఎస్ 1694

సాగు విస్తీర్ణం: 1,250 ఎకరాలు

రైతులు: 500

# విశాఖ కేంద్రంగా అద్దె గర్భం అక్రమాలు

విశాఖపట్నం : ఎంతోమంది చిన్నారులను తల్లి ఒడికి దూరం చేశారు. సరోగసీ ఎరవేసి ఎందరో దంపతులను మనోవేదనకు గురి చేశారు. కాసుల కక్కుర్తితో అడ్డదారి తొక్కారు. తల్లీపిల్లల్ని వేరు చేస్తున్నామనే మానవత్వం మరిచారు. తప్పొప్పుల విచక్షణ గాలికొదిలేసి సంతానలేమిని సొమ్ము చేసుకునేందుకు ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారు. ఇవీ సికింద్రాబాద్‌లోని సృష్టి యూనివర్సల్ ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకులు సాగించిన దారుణాలు. పోలీసుల దర్యాప్తులో వెలుగు చూస్తున్న కొత్త విషయాలు కలవరపాటుకు గురిచేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో బాధితులు ఒక్కొక్కరుగా ఫిర్యాదు చేసేందుకు ముందుకొ స్తున్నట్టు సమాచారం. రాజస్థాన్‌కు చెందిన దంపతులు సరోగసీ కోసం సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లోని డాక్టర్ నమ్రతను ఆశ్రయించారు. వారి వద్ద రూ.35లక్షలు వసూలు చేసి సరోగసీ విధానంలో బిడ్డ పుట్టాడంటూ అసోంలో కొనుగోలు చేసిన పిల్లాడిని విక్రయించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో గోపాలపురం పోలీసులు 8 మందిని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రత సహా 8 మందిని 7 రోజుల పోలీసు కస్టడీకి కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తే 30 ఏళ్లుగా సాగించిన అక్రమాల బాగోతం బయటపడుతుందని పోలీసులు భావిస్తున్నారు. డాక్టర్ నమ్రతతో సహా 8 మంది నిందితులు నాంపల్లి న్యాయస్థానంలో బెయిల్ పిటీషన్ దాఖలు చేశారు.



విశాఖ కేంద్రంగా దందా: సంతానం లేని దంపతులకు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, కోల్‌కతా, ఒడిశాలో సృష్టి ఫెర్టిలిటీ కేంద్రాల్లో వైద్యచికిత్స అందిస్తున్నారు. సికింద్రాబాద్‌లోని ఫెర్టిలిటీ సెంటర్‌కు నాలుగేళ్ల క్రితమే అనుమతి రద్దు చేశారు. అయినా.. దాన్ని నివాస భవనంగా చూపుతూ దందా సాగిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు, వెబ్‌సైట్లలో వివరాలు సేకరిస్తూ అద్దెగర్భంతో సంతానం పొందే వీలుందని ఎంతోమంది దంపతుల్లో నమ్మకం కలిగించి రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన దంపతులకు వివాహమై 18 ఏళ్లు దాటినా పిల్లలు పుట్టకపోవటంతో 2019లో కేపీహెచ్‌బీ కాలనీలోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతను ఆశ్రయించారు. వారి వద్ద రూ.13లక్షలు తీసుకొని సరోగసీతో బిడ్డను అందిస్తామంటూ భరోసా ఇచ్చారు. సరోగసీ చికిత్స అందిస్తున్న మహిళ కొవిడ్‌తో మృతి చెందినట్టు బురిడీ కొట్టించారు. ఫెర్టిలిటీ కేంద్రం సాగిస్తున్న మోసాల గురించి తెలిసిన బాధితులు కేపీహెచ్‌బీ ఠాణాలో ఫిర్యాదు చేశారు. అమెరికాలో ఉంటున్న ప్రవాస దంపతుల నుంచి రూ.12లక్షలు తీసుకొని సరోగసీ బిడ్డ పేరుతో విశాఖపట్నంలో కొనుగోలు చేసిన చిన్నారిని చేతికిచ్చారు. డీఎన్‌ఏ పరీక్షలో అసలు విషయం బయటకు రావటంతో బాధితులు 2015లో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హైదరాబాద్‌లోని కేంద్రాలకు వచ్చిన భార్యాభర్తలకు వైద్యపరీక్షలు నిర్వహించి సరోగసీ కోసం విశాఖపట్నం పంపిస్తున్నారు. అప్పటికే అక్కడికి వచ్చిన నిరుపేద మహిళలు, యువతులను సరోగసీకి సిద్ధంగా ఉన్నట్టు చూపుతారు. దంపతుల నుంచి వీర్యకణాలు, అండాలను సేకరిస్తారు. వాటిని ఏ మహిళ గర్భంలో ప్రవేశపెట్టబోతున్నామనేది వివరిస్తారు. ఏ మాత్రం అనుమానం రాకుండా గర్భంలో ఊపిరిపోసుకుంటున్న బిడ్డకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు కాబోయే తల్లిదండ్రులకు తెలియజేస్తుంటారు. డెలివరీ సమయం ముందుగానే చెప్పి విశాఖపట్నంలో బిడ్డను అప్పగిస్తారు. పిల్లల రూపురేఖలపై అనుమానం వచ్చిన బాధితులు డీఎన్‌ఏ పరీక్ష చేయించినప్పుడు అక్రమాలు బయటపడుతున్నాయి. తమ బిడ్డలు కాదని తెలిసినా, విషయం బయటకు పొక్కితే శిశువులను కొనుగోలు చేసినందుకు తమపై కేసు నమోదవుతుందనే ఉద్దేశంతో చాలామంది మౌనం వహిస్తున్నట్టు పోలీసు అధికారి తెలిపారు.

# అచ్యుతాపురం

# రోడ్డుకు అక్రమ గ్రావెల్!

అచ్యుతాపురం : అచ్యుతాపురం–అనకాపల్లి రోడ్డు విస్తరణ పనులకు అధికారులు అధికారికంగా ఎక్కడా క్వారీని గుర్తించకపోయినా గ్రావెల్ సరఫరా మాత్రం కొనసాగుతోంది. కొండకర్ల వద్ద 500 మీటర్ల పరిధిలో నమూనా రోడ్డును అభివృద్ధి చేస్తున్న తరుణంలో దీనికి అవసరమైన గ్రావెల్‌ను అక్రమంగా తీసుకొస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా కొండకర్ల వద్ద రోడ్డుకు రెండు వైపులా రక్షణగోడ నిర్మిస్తున్నారు. దీని నిర్మాణానికి కొంత తవ్విన ఎర్రమట్టిని వినియోగిస్తుండగా మరికొంత అక్రమ పద్ధతిలో గ్రావెల్‌ను తీసుకొచ్చి పూడ్పిస్తున్నారని తెలిసింది. ఈ రోడ్డును 100 అడుగుల మేర విస్తరిం



చడానికి అవసరమైన గ్రావెల్‌ను కొండకర్ల కొండ నుంచి తవ్వడానికి అనుమతులు కోసం చేసిన దరఖాస్తు పెండింగ్‌లో ఉందని ఆర్‌అండ్‌బీ ఏఈ పద్మని తెలిపారు. అనధికారంగా ఎక్కడ నుంచి గ్రావెల్ తీసుకురావడంలేదని రక్షణగోడ కోసం తీస్తున్న గోతుల ద్వారా వచ్చిన మట్టినే వినియోగిస్తున్నామని వివరణ ఇచ్చారు.

చురకలు



# అప్రమత్తతే ప్రాణాలకు రక్ష

అనంతపురం : ముదిగుబ్బ మండలం వట్టికుంటతండాకు చెందిన రమేశ్‌నాయక్ పామిడిలోని ఏడీసీసీ బ్యాంకులో స్టాఫ్ అసిస్టెంట్‌గా పని చేసేవారు. ఈ నెల 19న అనంతపురానికి వచ్చిన ఆయన సాయినగర్ 7వ క్రాస్‌లో ఉన్న ఓ సెలూన్‌కు వెళ్లి కటింగ్, షేవింగ్ చేయించుకున్నారు. ఆ సమయంలో వర్షం కురిసి నీరు పెద్దఎత్తున నిలిచింది. సెలూన్ నుంచి బయటకు వచ్చిన ఆయన నీటిలో రోడ్డు దాటుతూ ఓ ఇనుప పైపును పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందారు. రాయదుర్గం పట్టణంలోని కోట ఏరియాలో ఈ నెల 18న తాపీ మేస్త్రీ ఒకరు కూలీలతో భవన నిర్మాణ పనులు చేయిస్తుండగా ఫోన్ వచ్చింది. ఫోన్‌లో మాట్లాడే క్రమంలో ఆయన విద్యుత్తు తీగలను గమనించకుండా తగలటంతో షాక్‌కు గురై మిద్దెపై నుంచి కిందపడ్డాడు. ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వరుస విద్యుత్తు ప్రమాదాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. చిన్నపాటి నిర్లక్ష్యం.. అవగాహన లేకపోవడంతో పలువురు విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోతుండగా.. మరికొందరు గాయపడుతున్నారు. వర్షాకాలంలో కరెంటు పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యుత్తు అధికారులు సూచిస్తున్నారు.

**ఇవి పాటించాలి..!**

ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తున్నప్పుడు విద్యుత్తు ఉపకరణాలు వాడకూడదు.

ఎలాంటి విద్యుత్తు సర్వీసులైనా ఎర్తింగ్ చేయించుకోవాలి. ప్రతి గదికి ఎంసీబీలు ఏర్పాటు చేసుకోవాలి.

ఐఎస్ఐ, స్టార్‌రేటింగ్ విద్యుత్తు ఉపకరణాలను మాత్రమే వాడాలి.

గృహ సముదాయాల్లో విద్యుత్తు మీటర్లను గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఏర్పాటు చేసుకుంటారు. వీటి భద్రత దృష్ట్యా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.

తెగిపడిన తీగలను, తడిసిన స్తంభాలను, తడి చేతులతో ఉపకరణాలను



ఎట్టి పరిస్థితుల్లోనూ తాకకూడదు.

చిన్నపిల్లలకు స్విచ్‌బోర్డులు అందుబాటులో లేకుండా చూడాలి.

ఉతికిన దుస్తులను ఇనుప తీగలపై ఆరేయొద్దు.

హీటర్ వాడే వారు స్విచ్ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తరువాతే నీళ్ల పెట్టిన వస్తువును ముట్టుకోవాలి.

విద్యుత్తు లైన్ల కింద ఫోన్‌లో మాట్లాడకూడదు. ఛార్జింగ్ పెట్టి సెల్‌ఫోన్‌లో మాట్లాడొద్దు.

రైతులు, ప్రజలు సొంతంగా విద్యుత్తు పనులు చేయకూడదు. ఉద్యోగులు, టెక్నీషియన్లతో మాత్రమే పనులు చేయించుకోవాలి.

**నివారణకు చర్యలు**

శేషాద్రిశేఖర్, సంపత్‌కుమార్, ఎస్ఈలు, విద్యుత్తుశాఖ, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు విద్యుత్తు సమస్యలు తలెత్తితే 1912 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ప్రమాదాలు జరిగే తీరు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లఘు చిత్రాలు తీయించాం. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కరపత్రాలు అందించి ప్రజలు, రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. శాఖ ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగి ఎవరైనా ప్రాణాలు కోల్పోతే రూ.5 లక్షలు పరిహారం చెల్లిస్తున్నాం.

# శుభ్రత.. బాధ్యత!

నర్సీపటం : పల్లెల స్వచ్ఛతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రస్తుత వర్షాకాలం కావడంతో గ్రామాల్లో అపరిశుభ్రతతో వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ పరిస్థితి ఎక్కడ ఎదురైనా సంబంధిత అధికారులనే బాధ్యులను చేసే చర్యలు తీసుకునేలా ప్రత్యేక కార్యాచరణ అమలవుతోంది. ఏటా వర్షాకాలంలో అతిసారం, మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వీటిని నివారించడంపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ దృష్టి సారించింది. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలితే సంబంధిత పంచాయతీ కార్యదర్శి, ఉప ఎంపీడీఓలను బాధ్యులను చేస్తామంటూ ఆ శాఖ కమిషనర్ ఇటీవల హెచ్చరించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని గ్రామ పంచాయతీ ఉన్నతాధికారులు వీటి అమలుపై రోజూ సమీక్షిస్తున్నారు. జిల్లాలోని 24 మండలాల్లో 646 గ్రామాలు ఉన్నాయి. వీటన్నింటిలో పారిశుద్ధ్యం, రక్షిత నీటి పథకాల నిర్వహణ పనులను పక్కాగా చేపట్టాలని పంచాయతీలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఉప ఎంపీడీఓలు మండల పరిధిలో డీఎల్‌పీఓలు డివిజన్ పరిధిలో ఊర్లన్నీ సందర్శించి పర్యవేక్షించాలని వీటిలో సూచించారు. రోగాలు ఎక్కువయ్యే చోట సంబంధిత అధికారులు బాధ్యులవుతారని, ఆదేశాలు పాటించని వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఫలితంగా జిల్లాలోని అన్ని గ్రామాల్లో క్రమంగా పరిశుభ్రతకు బాటలు పడుతున్నాయి. చెత్త కుప్పలతోపాటు వ్యరాలు, కలుషిత నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**తెల్లవారుజాము నుంచే రోడ్లపైకి**

పారిశుద్ధ్యం మెరుగుకు ఉదయం ఆరు గంటలకే పంచాయతీ కార్యదర్శులు, ఉప ఎంపీడీఓ తమ గ్రామాల్లో పారిశుద్ధ్య సిబ్బందిని పరుగులెట్టిస్తున్నారు. డీపీఓ, డీఎల్‌పీఓ కార్యాలయాల్లోని సిబ్బందికి సైతం ఉన్నతాధికారులు ప్రత్యేక పనులు అప్పగించారు. ఒక్కొక్కరికి ఇరవై మంది పంచాయతీ కార్యదర్శులను కేటాయించారు. వీరు రోజూ ఉదయం చేయించే పనులను వీడియో కాల్ ద్వారా పరిశీలించి నివేదికలు పంపేలా ఏర్పాట్లు చేశారు.

**చాలా మార్పు కనిపిస్తోంది**

జిల్లా కలెక్టర్, డీపీఓ సూచనలు పాటిస్తూ తీసుకుంటున్న చర్యలు ఫలితంగా పారిశుద్ధ్యంలో ఇప్పుడు చాలా మార్పు వచ్చింది. రోడ్డు పక్కన చెత్తకుప్పలను 80 శాతం వరకు తొలగించాం. ఇంటింటి చెత్త సేకరణ పనులు యాభై శాతానికి పైగా మెరుగుపడ్డాయి. సచివాలయంలోని ఇంజినీరింగ్ కార్యదర్శులను బాధ్యులను చేస్తూ శుద్ధమైన తాగునీరు సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం. పల్లెలో దోమల వృద్ధిని కట్టడి చేసే పనులు ముమ్మరమయ్యాయి. మూర్తి, డీఎల్‌పీఓ, నర్సీపట్నం

# గోకివాడ టూ ఢిల్లీ



పిఠాపురం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో ముందంజలో ఉన్న పిఠాపురం మండలం గోకివాడ సర్పంచి కీర్తి హరినాథబాబు ఈ ఏడాది ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగే ఈ సంబరాలకు మన రాష్ట్రం నుంచి 10 జిల్లాలకు చెందిన సర్పంచులకు అవకాశం కల్పించగా, కాకినాడ జిల్లా నుంచి హరినాథ బాబు ఎంపికైయ్యారు. ఆయన జీవిత భాగస్వామితో కలిసి ఈ నెల 13న ఈ వేడుకలకు హాజరుకావాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ ఉత్తర్వులు పంపారు. జిల్లా పంచాయతీరాజ్ శాఖ నిధులు నుంచి ఈయన రాకపోకలకు ఖర్చు చేయనున్నారు.

**అవకాశం ఇలా..**

ప్రభుత్వ పథకాలు అమలులో ముందంజలో ఉన్న గ్రామాల సర్పంచులను ఇందుకు ఎంపిక చేస్తారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గం నుంచి గోకివాడ సర్పంచికి ఈ అవకాశం దక్కింది. జలజీవన్ మిషన్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ప్రధాన మంత్రి జన్‌ఆరోగ్య యోజన, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన, పీఎం విశ్వ కర్మ యోజన, అంగన్‌వాడీ పోషన్ 2.0, కిసాన్ క్రెడిట్ కార్డు, పీఎం సూర్య ఘర్, మిషన్ ఇంద్ర ధనస్సు తదితర పథకాల అమలులో ముందంజలో ఉన్నట్లు గుర్తించి గ్రామాభివృద్ధికి పాటుపడుతున్న సర్పంచిని ఎంపిక చేశారు.

**ఉప ముఖ్యమంత్రి చొరవతోనే..**

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిఠాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి మా గ్రామం అభివృద్ధి పథంలో నడుస్తోంది. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రోడ్లు, డ్రెయినేజీలు, శ్మశాన వాటిక అభివృద్ధి, సచివాలయం, పాఠశాలల నిర్మాణం పూర్తయ్యింది. పారిశుద్ధ్య సమస్య మెరుగుపడుతోంది. గ్రామాభివృద్ధికి మరింత కృషి చేస్తాను.

కీర్తి హరినాథ బాబు, సర్పంచి, గోకివాడ

# పడవలే ఆధారం..



పి.గన్నవరం : గోదావరి వరద భద్రాచలం వద్ద నెమ్మదించినప్పటికీ కోనసీమ ప్రాంతంలోని నదీపాయల్లో ఇంకా పోటెత్తి ప్రవహిస్తోంది. ధవళేశ్వరం బ్యారేజి నుంచి 6,01,844 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజికి సంబంధించి 175 ఫ్లడ్‌గేట్లను 1.0 నుంచి 1.80 మీటర్లు ఎత్తి ధవళేశ్వరం ఆర్మ్ నుంచి 2,59,704 క్యూసెక్కులు, ర్యాలి ఆర్మ్ నుంచి 1,55,242, మద్దూరు ఆర్మ్ నుంచి 81,636, విజ్జేశ్వరం ఆర్మ్ నుంచి 1,05,262 క్యూసెక్కులు చొప్పున విడిచిపెట్టడంతో దిగువన ఉన్న వశిష్ఠ, వైనతేయ, గౌతమి, వృద్ధగౌతమి గోదావరి నదీపాయాల్లో వరద ఉరవడి పెరిగింది. సాయంత్రం ఆరు గంటలకు బ్యారేజి వద్ద 10.90 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఖరీఫ్ సాగుకోసం తూర్పుడెల్టాకు 2,200, మధ్యడెల్టాకు 2,050, పశ్చిమడెల్టాకు 5,000 వెరశి 9,250 క్యూసెక్కుల నీటిని పంపిణీ చేస్తున్నారు. కోనసీమలో బూరుగులంక, అరిగెలవారిపేట, జి.పెదపూడిలంక, ఊడుమూడిలంక, పెదమల్లంక, ఆనగార్లంక, మర్రిమూల, అయోధ్యలంక గ్రామాల ప్రజలు మరపడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. లోతట్టు లంకభూముల్లోకి వరద నెమ్మదిగా చేరుతోంది. కనకాయలంకకాజ్‌వే వద్ద వరదపెరిగింది. సోమవారం ఉదయానికి ఈ కాజ్‌వే ముంపు బారినపడే అవకాశం ఉంది. పైనుంచి వరద ప్రవాహం తగ్గుతుండటంతో ఇక్కడ నెమ్మదిగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.

**సాగుకు ఇబ్బందులు**

మామిడికుదురు: వైనతేయ నదిలో వరద నీరు పెరగడంతో లంక భూముల్లో వ్యవసాయం చేసుకునే రైతులు ఇబ్బంది పడుతున్నారు. కూరగాయలు, పశుగ్రాసాలు తెచ్చుకునేందుకు పడవలపై వెళ్లి అవస్థలు ఎదుర్కొంటున్నారు. పెదపట్నం, అప్పనపల్లి, పాశర్లపూడి మీదుగా ఆదుర్రు వరకు వరద నీరు పోటెత్తడంతో మత్స్యకారులు పడవలను ఒడ్డునే నిలిపివేశారు. తీరాన్ని ఆనుకుని ఉన్న పాటు రేవుల్లోకి వరద నీరు చేరుతోంది. గోదావరి వరద బొబ్బర్లంక వద్ద ఇళ్లకు చేరువవుతుండటంతో గ్రామస్థులు ఆందోళన చెందతున్నారు. మరింత పెరిగితే లంకలో పంటలు మునిగి దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. వరద తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వరద పర్యవేక్షణ అధికారులు అంటున్నారు.

# పైసలందక.. పనులు సాగక..



ఎమ్మిగనూరు : నెలలు గడుస్తున్నా పైసలు చేతికి రాకపోవడంతో పనులపై గుత్తేదారుల ఆసక్తి సన్నగిల్లుతోంది. ఉమ్మడి జిల్లాలోని పురపాలికల్లో ఆర్థిక సంఘం, సాధారణ నిధులతో చేపడుతున్న పనుల పరిస్థితి అధ్వానంగా మారింది. కొన్నింటికి టెండర్లు పూర్తి చేయగా.. సగం పనులు చేసి వదిలేశారు. కొన్నింటికి టెండర్లు పిలిచినా గుత్తేదారుల నుంచి స్పందన కరవవుతోంది. చాలా చోట్ల ప్రారంభించిన పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా, కాల్వల పనులు జరగక పురాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల పరిధిలో బిల్లుల బకాయిలు, అసంపూర్తిగా వదిలేసిన పనులపై అందిస్తున్న పరిశీలన కథనం.

**యాప్‌తో చిక్కులు...**

ఎమ్మిగనూరు, నంద్యాల, ఆదోని, డోన్, ఆత్మకూరు, నందికొట్కూర్ మున్సిపాలిటీల పరిధిలో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. పనులు చేపట్టి ఏడాది కావస్తున్నా.. బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు గగ్గోలు పెడుతున్నారు. ప్రధానంగా నిధి యాప్ ద్వారా పూర్తిగా బిల్లులు రాక అవస్థలు పడుతున్నారు. ఎమ్మిగనూరులో 26 పనులకు రూ.4.50కోట్లు, ఆదోనిలో 35 పనులు పూర్తి చేయగా రూ.5.5 కోట్ల మేరకు చెల్లించాలి.. నంద్యాల, ఇతర మున్సిపాలిటీల పరిధిలో దాదాపు 120 పనులకు రూ.10కోట్లకు పైనే బకాయిలు ఉన్నాయి. మూణ్నెల్లుగా అధికారులు యాప్‌లో అప్‌లోడ్ చేసినా బిల్లులు రాక.. గుత్తేదారులు పనులు వదిలేశారు.

**అసంపూర్తిగా ఉన్న పనులు**

ఎమ్మిగనూరు పట్టణంలో రూ.18లక్షలతో సీసీ రోడ్డు నిర్మించేందుకు టెండర్లు వేశారు. 2023 జనవరిలో పనులకు భూమి పూజ నిర్వహించారు. 300 మీటర్లకు పైగానే సీసీ రోడ్డు వేసేందుకు మట్టి పనులు చేపట్టి కంకర పరిచారు. రెండేళ్లు కావస్తున్నా పనులు చేయకుండా గుత్తేదారు వదిలేశారు. నిర్లక్ష్యం చేస్తున్న గుత్తేదారులపై అధికారులు పట్టించుకోవడం లేదు.

గంజహళ్లి దారి గుంతలు పడటంతో రూ.90లక్షలతో పనులు మంజూరు చేసి గుత్తేదారుడికి అప్పజెప్పారు. కానీ వైకాపా హయంలో చేసిన పనులకు రూ.2కోట్ల మేరకు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. ఏడాది కావస్తున్నా తారు రోడ్డు పనులు చేపట్టలేదు. పాత బిల్లులు వస్తే... కొత్త పనులు చేస్తామని మొండికేశారు. మునెప్పనగర్‌లో రూ.16లక్షలు, మిలటరీ కాలనీ మారెమ్మ దేవాలయం వద్ద రూ.40లక్షలు, సెంట్రల్ లైటింగ్ ఐదు పనులకు దాదాపు రూ.కోటి, రెండో వార్డులో రూ.20లక్షలు, చంద్రయ్యకొట్టాల, వెంకటాపురంలో రూ.30లక్షలు, ఎద్దుల మార్కెట్ సమీపంలో చేసిన పనులకు రూ.30లక్షలు, పట్టణంలో మిగిలిన కాలనీల్లో చేపట్టిన రోడ్లు, ఇతర పనులకు బిల్లులు రాక పట్టణాభివృద్ధి నిలిచిపోయింది.

ఆదోని, నంద్యాల ప్రాంతంలో టెండర్లు పిలిచినా సీసీ రోడ్ల పనులు చేపట్టకుండా వదిలేశారు.

సగంలో వదిలేశారుఎమ్మిగనూరు పట్టణంలో శ్రీనివాస సర్కిల్ నుంచి మెయిన్ రహదారి ఇది. వైకాపా హయాంలో రహదారి అధ్వానంగా ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.కోటితో టెండర్లు పిలిచి సుమారు 750 మీటర్ల తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. మిగిలిన 200 మీటర్ల పనులు వదిలేశారు. ఏడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు పనులు వదిలేశారు.

# చినుకమ్మా ఎటు పోతివే!

అనకాపల్లి : జులై నెల ముగింపు దశకొచ్చింది. ఆకాశంలో మబ్బులు కమ్మి.. జోరువానలతో పుడమి పులకించాల్సిన రోజులివి. కానీ ఈ ఏడాది పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. వానలు కురవాల్సిన సమయంలో ఎండలు మండిపోతున్నాయి. వేసవిని తలపించే ఉష్ణోగ్రతలతో జిల్లావాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గతేడాది ఇదే రోజుల్లో వరుణుడు కుంభవృష్టి కురిపిస్తే ఈసారి చిరుజల్లులు పడటమే అరుదైపోయింది. నారు పోసిన రైతన్నలు నీరు కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. కర్షకులను వరుణుడు కరుణించడం లేదు. ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడం తప్ప చినుకు జాడ కనిపించడం లేదు. ఫలితంగా జిల్లాలో ఖరీఫ్ సీజన్ ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. జిల్లాలో అన్ని పంటలు కంటే వరి సాగు అధికం. గతంలో ఎప్పుడూ లేని విధంగా కేవలం ఒక్క శాతమే ఇంత వరకు



నాట్లు వేశారు. జిల్లాలో వరి తర్వాత అధికంగా సాగు చేసేది చెరకు. ఇంతవరకు 37 శాతం విస్తీర్ణంలో సాగు చేశారు. మొక్కజొన్న, నువ్వు, కందులు పరిస్థితీ అదే విధంగా ఉంది. నాట్లు వేసిన పంటలు సైతం నీటి ఎద్దడికి గురవుతున్నాయి. వరి సాగుకు సమయం ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మే నెల సాధారణ వర్షపాతం 103.7 మి.మీ. కాగా.. 152.2 మి.మీ. పడింది. జూన్‌లో సాధారణ వర్షపాతం 131.1 మి.మీ. కాగా దాదాపు అంతమేర వర్షం పడింది. జులై నెల వచ్చేసరికి పరిస్థితి మొత్తం తారుమారైంది. గతేడాది ఈ సమయానికి వర్షాలు మురిపిస్తే ఈ ఏడాది ఎదురుచూపులతోనే గడిపేయాల్సి వచ్చింది.

**ఎండా కాలంలా ఉంది**

వరి విత్తనాలు సకాలంలో లభించడంతో నారు పోశాం. నారు వేసిన తర్వాత వర్షం సరిగా పడలేదు. నీరు లేక నారు ఎండిపోతుంది. ఏమి చేయాలో తెలియడం లేదు. వర్షాకాలం అయినా ఎండాకాలంలా ఉంది. ఇల్ల అప్పారావు, రైతు, కాకరాపల్లి

జులై నెల సాధారణ వర్షపాతం : 146.9 మి.మీ.
గతేడాది ఇదేనెలలో కురిసింది : 251.2 మి.మీ.
ఈ నెలలో కురిసింది : 62.4 మి.మీ.

# తక్షణ రక్షణకు 'వంద'నం

అనకాపల్లి : శాంతిభద్రతల పరిరక్షణకు.. ఆపద వేళ మేమున్నామని ప్రజలకు భరోసా కల్పించేందుకు పోలీస్‌శాఖ ప్రవేశపెట్టిన డయల్ 100/112తో చాలామంది లబ్ధి పొందుతున్నారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా తక్షణ సాయం అందించడానికి వీలుగా పోలీస్ సిబ్బంది 24 గంటలూ పనిచేస్తున్నారు. 100/112 నంబర్లలో వేటికి ఫోన్ చేసినా వెంటనే సిబ్బంది సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని సాయం అందిస్తున్నారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు సంబంధించి అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో కంట్రోలు రూం ఏర్పాటుచేశారు. అనకాపల్లి ఎస్పీ తుహిన్‌సిన్హా ఆధ్వర్యంలో ఈ కంట్రోల్ రూంను ఆధునిక హంగులతో తీర్చిదిద్దారు. డయల్ 100/112కి వచ్చే సమస్యలను పరిష్కరించే సమయంలో గతంలో కాలయాపన జరిగేది. దీనిని తగ్గించేలా ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. సిబ్బందికి ట్యాబ్‌లు అందించి బాధితులున్న ప్రదేశంతోపాటు సిబ్బంది వెళ్తున్న ప్రాంతం, ప్రయాణిస్తున్న వేగం, సమయంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు.

జిల్లాలో 34 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఒక్కో స్టేషన్‌లో ముగ్గురు చొప్పున సిబ్బందికి తక్షణ సహాయక చర్యలపై శిక్షణ ఇచ్చారు. వీరు మిగిలిన సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు. దూరాన్ని బట్టి ఫోన్ చేసిన ఐదు నుంచి 15 నిమిషాల్లోనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తున్నారు

ఈ ఏడాది జనవరి నుంచి ఇంతవరకు కంట్రోల్ రూంకు 9,025 ఫోన్ కాల్స్ వచ్చాయి. వీటిలో అధికంగా జూదం ఆడటం, వాహనాలు వేగంగా నడపడం, ఈవ్ టీజింగ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, దుర్భాషలాడుతూ తగాదాలకు దిగడం వంటి వాటిపై 4,845 కాల్స్ వచ్చాయి.

ఇంట్లోనుంచి వెళ్లి అదృశ్యం కావడంపై 97, ఆకతాయిల వేధింపులు, అల్లరిమూకల సంచారం, గృహ హింస, భార్యను కొట్టడం వంటివి 1,282 ఫిర్యాదులు వచ్చాయి. కొట్లాటకు సంబంధించి 1,383 ఫోన్‌కాల్స్, చోరీలు, ఆస్తి తగాదాలకు సంబంధించి 488 ఫోన్లు వచ్చాయి. ఇలా వచ్చిన ఫోన్ కాల్స్‌పై సిబ్బంది సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించడంతోపాటు అవసరమైతే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసుల సేవలు

రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను ఆదుకునేందుకూ పోలీసులు చొరవ చూపుతున్నారు. 16న నంబరు జాతీయ రహదారి వెంబడి 9 పెట్రోలింగ్ వాహనాలు ఉన్నాయి. డయల్ 112కి ఎక్కువగా రోడ్డు ప్రమాదాల సమాచారంపై ఫోన్లు వస్తున్నాయి. దీంతో పెట్రోలింగ్ సిబ్బందికి ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించి వీరికి వైద్యులతో శిక్షణ ఇప్పించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆ ప్రదేశానికి చేరుకుని అవసరమైన వారికి ప్రథమ చికిత్స అందించడంతోపాటు వేగంగా ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకుంటున్నారు.

పరవాడలోని ఓ ఇంట్లో దొంగ చోరీ చేయడానికి ఇంట్లోకి ప్రవేశించాడు. ఇంటి యజమాని సీసీ టీవీ ద్వారా చూసి విషయం 112కి ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని ఆ దొంగను పట్టుకున్నారు. ఇలా ప్రజల్లో చైతన్యం రావడంతోపాటు పోలీసులు ఇస్తున్న భరోసాతో శాంతి భద్రతల పరిరక్షణకు 112 నంబరు ఎంతో ఉపయోగపడుతుంది.

**వేగంగా సేవలు అందించేలా..**

ప్రజలకు పోలీస్ సేవలు వేగంగా అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఫోన్ వచ్చిన వెంటనే సంబంధిత స్టేషన్ల సిబ్బందికి అప్రమత్తం చేయడంతోపాటు వారు అక్కడికి వెళ్లే సమయాన్ని సైతం పర్యవేక్షిస్తున్నాం. గతంలో కంటే ఇప్పుడు వేగంగా సంఘటనా స్థలానికి చేరుకునేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి చర్యలు తీసుకుంటున్నాం. దీనివల్ల చాలావరకు శాంతిభద్రతల సమస్యలకు పరిష్కారం లభించింది.

రమేశ్, పోలీస్ కంట్రోల్ రూం సీఐ, అనకాపల్లి

## క్యూట్ బ్యూటీ డిఫరెంట్ ఔట్ ఫిట్ షో

సుధీర్ బాబు హీరోగా నటించిన ఎస్ఎంఎస్(శివ మనసులో శృతి) సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ రెజీనా కాసాండ్రా. మొదటి సినిమా కమర్షియల్ బ్రేక్ ఇవ్వనప్పటికీ తెలుగులో మరిన్ని ఆఫర్లను సొంతం చేసుకుంది. తన అందంతో పాటు, నటన ప్రతిభ కారణంగా తెలుగులో అదే ఏడాదిలో రొటీన్ లవ్ స్టోరీ ఆ తర్వాత కొత్త జంట, రారా కృష్ణయ్య, పవర్, పిల్లా నువ్వు లేని జీవితం, సుబ్రమణ్యం ఫర్ సేల్, సౌఖ్యం, శౌర్యం ఇలా చాలా సినిమాల్లో నటించింది. మీడియం రేంజ్ సినిమాలకు ఒకానొక సమయంలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా చేసింది. అయితే ఇండస్ట్రీలో పది కాలాల పాటు నిలిచి పోవాలి అంటే స్టార్ హీరోల సినిమాల్లో నటించాల్సి ఉంటుంది. రెజీనాకు అలాంటి ఆఫర్లు దక్కక పోవడంతో ఎప్పుడూ ఆఫర్ల కోసం వెయిట్ చేయాల్సి వచ్చింది, దాంతో రెజీనా స్టార్ హీరోయిన్స్ జాబితాలో చోటు దక్కించుకోలేక పోయింది.

**మెగా హీరోలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్...** హీరోయిన్‌గా రెజీనా చేసిన సినిమాలు తక్కువేం కాదని చెప్పాలి. ఒకానొక సమయంలో మెగా హీరోల్లో టైర్ 2 హీరోలకు ఈమె మోస్ట్ వాంటెడ్‌గా నిలిచింది. రకరకాలుగా ఆసమయంలో పుకార్లు సైతం వచ్చిన విషయం తెల్సిందే.




ఇప్పుడు రెజీనా పూర్తిగా తమిళ్, హిందీ సినిమాలకు పరిమితం అయింది. తెలుగులో ఈమె చివరగా ఉత్సవం అనే సినిమాలో కనిపించింది. ఆ సినిమా పెద్దాగా ఆడక పోవడంతో కమర్షియల్ బ్రేక్ కోసం ఎదురు చూస్తుంది. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో మూడు నాలుగు సినిమాలు ఉన్నాయి. అవి మీడియం రేంజ్ చిత్రాలే అయినప్పటికీ ఖచ్చితంగా తమిళ్, హిందీ భాషల్లో ఆ సినిమాల వల్ల రెజీనా ముందు ముందు మినిమం సినిమాలను దక్కించుకుంటుంది అనే విశ్వాసంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు.

**ఇన్‌స్టాగ్రామ్‌లో రెజీనా జోరు...** రెజీనా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. దాదాపుగా 25 లక్షల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న రెజీనా రెగ్యులర్‌గా అందాల ఆర బోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా తన ఫాలోవర్స్‌కి వినోదాన్ని పంచుతూ ఉంటుంది. తాజాగా మరోసారి తన అందమైన ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేయడం ద్వారా రెజీనా వార్తల్లో నిలిచింది. ఇప్పుడు ఈ డిఫరెంట్ ఔట్ ఫిట్‌ను ట్రై చేసి ఫోటోలకు ఫోజ్‌లు ఇవ్వడం ద్వారా అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ రెజీనా సొంతం అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆమె రెగ్యులర్‌గా వర్కౌట్స్ చేస్తూ ఇలా అందం ఏమాత్రం తగ్గకుండా కాపాడుకుంటూ ఉంది. అందుకే ఎలాంటి ఔట్ ఫిట్ లో అయినా రెజీనా చూపు తిప్పనివ్వడం లేదు అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

## రాజుగారికే ఓటేసిన రాజమౌళి!

ఎన్ని ఓటీటీలు వచ్చినా? ఎంత కాంపిటీషన్ ఉన్నా? థియేటర్ ఎక్స్ పీరియన్స్ ఇంకే మాధ్యమం అందిం చలేదన్నది నిర్మాత దిల్ రాజు ఎప్పుడు స్ట్రాంగ్ గా చెప్పే మాట. ఈ విషయంలో రాజుగారు ఒంటెద్దు పోకడే హైలైట్ అవుతుంది. సురేష్ బాబు లాంటి వారు వెర్షన్ వేరుగా ఉన్నా? రాజుగారు మాత్రం ఈ విష యంలో ఎన్నడు యూ టర్న్ తీసుకోలేదు. ప్రేక్షకుడికి సినిమా చూసిన ఫీలింగ్ రావాలంటే? అది కేవలం థియేటర్లో మాత్రమే సాధ్యమవుతుందని ఏ వేదికపైనైనా గట్టిగా చెబుతారు. అదే జరగని రోజు హీరోలు ఉండరు.

**రాజుగారు లెక్క అలా:** వాళ్ల ఇమేజ్ ఉండదన్నది రాజుగారి మాటల్లో క్లియర్ గా బయట పడింది. హీరోల ఇమేజ్ ని పెంచేది కేవలం థియేటర్ ఎంటర్ టైనర్ మాత్రమేనన్నది రాజుగారి బలమైన వాదన. తాజాగా ఆయన మాటలతో దర్శక శిఖరం రాజమౌళి కూడా ఏకీభవించినట్లే కనిపిస్తుంది. ఓటీటీ-థియేటర్ సినిమా మధ్య వ్యత్యాసం గురించి ఏనాడు జక్కన్న స్పందించలేదు. తొలిసారి ఓ వేదికలో రాజమౌళి ఆ విషయంపై స్పందించడం విశేషం. రజనీకాంత్ లేదా



సల్మాన్ ఖాన్ ఓ పెనింగ్ సీన్ లో కనిపించినప్పుడు థియేటర్లో జనాలు ఎలా స్పందిస్తారో? అందరికీ తెలుసు.

**రాజమౌళి వ్యత్యాసమిది:** విజిల్స్ వేస్తారు. కాగితాలు ఎగరేస్తారు. అభిమానులంతా సీటులో నుంచి పైకి లేచి డాన్సులు చేస్తారు. గ్రూపులు కడతారు. కానీ అదే సినిమా ఓటీటీ రిలీజ్ అయితే ఇదేది కనిపించదు. ఎవరి ఇంట్లో వారే ఎవరికి వారు తలుపులు మూసుకుని ఈలలు వేసుకోవాలి. అందులో ఏమైనా కిక్ ఉంటుందా? సినిమా చూసిన అనుభూతి కలుగుతుందా? ఇదే థియేటర్...ఓటీటీ రిలీజ్ మధ్య ప్రధాన వ్యత్యాసం. థియేటర్లో మాత్రమే సినిమా చూసిన గొప్ప అనుభూతికి లోనవుతాం అన్నారు. దీంతో థియేటర్ రిలీజ్ విషయంలో రాజమౌళి ఎంత ఆసక్తిగా ఉన్నారు? అన్నది అర్ధమవుతుంది.

**అది సాధ్యమేనా?...** ఇప్పటికే థియేటర్ వ్యవస్థ కుప్పకూలిపోతున్న పరిస్థితులు కనిపిస్తన్నాయి. నష్టాలు రావడంతో థియే టర్లు మూసేయడం లేదా ఫంక్షన్ హాల్స్ గా మార్చడం జరుగుతుంది. ఓటీటీ ప్రభావం కూడా థియేటర్లపై పడింది. ఇందులో మార్పు రావాలని ప్రేక్షకులు సహా చిత్ర పరిశ్రమలు కోరుకుంటున్నాయి. కానీ అందుకు ఇండస్ట్రీ తీసుకోవాల్సిన చర్యలు మాత్రవే కనిపించలేదు. రిలీజ్ ల విషయంలో ఓటీటీ ప్రాధాన్యత తగ్గించగ గలిగితే థియేటర్ కు ఊపిరి పోసినట్లేనన్నది విశ్లేషకుల మాట. మరి అది సాధ్యవమతుందా? లేదా? అన్నది ఆ పెరుమాళ్లకే ఎరుక.




## పొంగల్ రేసులో కాలు దువ్వుతున్న తమిళ్ సినిమా.. బాగానే ధైర్యం చేస్తున్నారుగా



ఈసారి సంక్రాంతి పోటీ మామూలుగా లేదు. ఇప్పటికే పెద్ద పెద్ద సినిమాలు పొంగల్ టార్గెట్ గా రూపుదిద్దుకుంటున్నాయి. లిస్ట్ లో చిరంజీవి చిరంజీవి మన వర ప్రసాద్ గారు, పాన్‌ఇండియా స్టార్ ప్రభాస్ ది రాజా సాబ్, మాస్ మహారాజ రవితేజ 77, నవీన్ పోలిశెట్టి అనగనగా ఒక రాజు పోటీలో ఉన్నాయి. దీంతో థియేటర్ల అడ్వస్ట్ మెంట్ కష్టంగా మారుతుంది. ఈ తెలుగు సినిమాలతోపాటు డబ్బింగ్ సినిమా విజయ్ దళపకి జననాయగన్ కూడా సంక్రాంతి పోటీలో ఉంది. ఇందులో ఏ సినిమా కూడా వెనక్కి తగ్గే సంకేతాలు కనిపించడం లేదు. ఈ పోటీ డిస్ట్రిబ్యూటర్ల కు టెన్షన్ రేపుతుంది. ఇదిలా ఉండగా, ఇప్పుడు మరో సినిమా రేస్ లోకి వచ్చింది. ఈ టఫ్ కాంపిటీషన్ లో కోలీవుడ్ స్టార్ శివ కార్తికేయన్ హీరోగా తెరకెక్కిన పరాశక్తిని రేస్ లో నిలపాలనుకోవడం సాహసమనే చెప్పాలి. సుధా కొంగర ఈ సినిమాను పీరియాడికల్ డ్రామాగా తెరకెక్కించారు. అయితే కంటెంట్ పై నమ్మకంతో ఆమె కూడా సంక్రాంతి అడ్వాంటేజ్ మిస్ అవ్వకూడదని అనుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే సినిమాను పొంగల్ కు తీసుకొచ్చేందుకు నిర్మాతను ఒప్పించారట. ఈ సినిమాతో శ్రీలీల హీరోయిన్ గా కోలీవుడ్ కు పరిచయమవుతోంది. అథర్వా, రవి మోహన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కొన్ని దశాబ్దాల కిందట జరిగిన హిందీ వ్యతిరేక ఉద్యమం రోజుల నాటి పరిణామాల నేపథ్యంలో ఇది తెరకెక్కింది. అందుకే ఇది వివాదం అవుతుందనే ఉద్దేశంతో హీరో సూర్య ఈ ప్రాజెక్ట్ వదులుకున్నారు. అందుకే పరాశక్తి సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇన్ని సినిమాలు సంక్రాంతిపైనే కన్నేయడం వల్ల చాలా రిస్కులున్నాయి. మరీ ముఖ్యంగా రాజాసాబ్ సినిమాకు తమిళనాడులో కావాల్సినన్ని థియేటర్లు లభించడం కష్టమవుతుంది. మరోవైపు జననాయగన్ కు, పరాశక్తికి సినిమాకు ఏపీ తెలంగాణలో స్క్రీన్లు దక్కించుకోవడం కూడా అంత ఈజీగా ఉండదు. మిగిలినవి పాన్‌ఇండియా సినిమాలు కాదు. అందుకే ఇబ్బందేం లేదు. అయితే ఇలా ఇన్ని సినిమాలు క్లాష్ అవ్వడం వల్ల ఓపెనింగ్స్ పై ఎఫెక్ట్ అయ్యే ఛాన్స్ ఉంది. ఎక్కువలో ఎక్కువ మూడు సినిమాలకే మంచి వసూళ్లు సాధించేందుకు స్కోప్ ఉంటుంది. కానీ. ఇలా నాలుగు స్ట్రైట్ తెలుగు, రెండు డబ్బింగ్ సినిమాలు సంక్రాంతి రావడం వల్ల థియేటర్లు అడ్జెస్ట్ కష్టంగా మారుతుంది.

## ఫుడ్ బిజినెస్ లో టాలీవుడ్ నయా స్టార్లు!



పారితోషికం రూపంలోనే కాదు..వ్యాపార రంగంలోనూ సంపాదిస్తోన్న సెలబ్రిటీలు ఎంతో మంది. ప్రత్యేకించి ఫుడ్ బిజినెస్ అంటే? చాలా మంది స్టార్స్ లైక్ చేసే వ్యాపారం కూడా. ఎన్ని రంగాల్లో పెట్టుబడి పెట్టినా? ఫుడ్ బిజినెస్ లో పెట్టుబడి అధిక లాభాలు తెచ్చి పెడుతుందంటారు. ఇప్పటికే చాలా మంది టాలీవుడ్ స్టార్లు రెస్టారెంట్ బిజినెస్ లో దిగ్విజయంగా రాణిస్తున్నారు. వాళ్ల బ్రాండ్ ఇమేజ్ కూడా ఈ వ్యాపారానికి అంతే కలసొస్తుంది. తెలిసిన సెలబ్రిటీలంతా ఆ స్టార్ రెస్టారెంట్ కే పని గట్టుకుని మరీ వెళ్తున్నారు. హైదరబాద్ ఫేమస్ ప్రాంతాల్లో ఆయా స్టార్స్ రెస్టారెంట్లు ఉండటం విశేషం. మరి రెస్టారెంట్ బిజినెస్ లోరాణిస్తోన్న ఆ స్టార్లు ఎవరంటే?.. ఆ ట్రెండ్ కి ఏఎన్నార్ బీజం వేయగా అదే ఫ్యాషన్ మళ్లీ నాగార్జున, నాగచైతన్యలో కనిపిస్తుంది. ఏఎన్నార్ స్థాపించిన 'ఎన్ గ్రిల్', 'ఎన్ ఏషియన్' రెస్టారెంట్లు ఇప్పటికే కొన్ని సంవత్సరాలుగా నగర వాసుల ఆకలి తీరుస్తున్నాయి. ప్రత్యేకించి నాగచైతన్య క్లౌడ్ కిచెన్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇదులో చైతన్య గ్రాండ్ సక్సస్ అయ్యాడు. విదేశీ వంటకాలు తన క్లౌడ్ కిచెన్ లో ప్రత్యేకంగా చెప్పుకొచ్చారు. షోయు', 'స్కుజి' బ్రాండ్లతో పాన్-ఏషియన్, యూరోపియన్ వంటకాలను అందిస్తున్నారు. సూపర్ స్టార్ మహేష్ సైతం 'ఏఎన్ రెస్టారెంట్స్' పేరుతో ఓ రెస్టారెంట్ రన్ చేస్తున్నారు. అలాగే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ బఫెలో వైల్డ్ వింగ్స్ అనే స్పోర్ట్స్ బార్ నిర్వహిస్తున్నారు. అలాగే మరో యంగ్ హీరో సందీప్ కిషన్ వివాహ భోజనంబు పేరుతో ఓ హోటల్ రన్ చేస్తున్నారు. నగర వ్యాప్తంగా చాలా చోట్ల దీని బ్రాంచ్లున్నా యి. హైదరాబాద్ సహా వైజాగ్ లో కూడా నిర్వహిస్తున్నారు. సంప్రదాయ తెలుగు రుచులను అందించడం ఈ హోటల్ ప్రత్యేకత. ఇంకా రానా దగ్గుబాటి కూడా బ్రాడ్‌వే లైఫ్‌స్టైల్ హబ్‌తో పాటు, తన పాత ఇంటినే సాంక్చువరీ పేరుతో రెస్టారెంట్‌గా మార్చారు. దేవరకొండ బ్రదర్స్ 'గుడ్ వైబ్స్ ఓన్లీ క్యాఫే'తో యువతను ఆకట్టుకుంటున్నారు. ఇంకా శర్వానంద్ 'బీన్జ్' పేరుతో స్నాక్స్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. అలాగే నటుడు శశాంక్ మాయా బజార్ పేరుతో ఓ రెస్టా రెంట్ ను దిగ్విజయంగా రన్ చేస్తున్నారు. తమ బ్రాండ్ నే తామే ప్రమోట్ చేసుకుని మార్కెట్ చేసుకుంటారు. సిటీలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, హైటెక్ సిటీ, మాదాపూర్, అమీర్ పేట్ వంటి ప్రైమ్ ఏరియాలు టార్గెట్గా ఈ బిజినెస్ లు రన్ అవుతున్నాయి. వీటి సక్సెస్ చూసి కొంత మంది టీవీ ఆర్టిస్టులు కూడా రెస్టారెంట్ వ్యాపారంలోకి దిగుతున్నారు.

## ఒక్క లైక్.. ఆమె జీవితాన్ని మార్చేసింది

కొంత మంది జీవితంలో అదృష్టం అనుకోని అతిథిగా వస్తుంది. సినిమా ఇండస్ట్రీలో ఎంతో మంది తారలు బ్రేక్ కోసం ఎదురు చూస్తూ ఉంటే, ఆ బ్రేక్ అతి కొద్ది మందికి మాత్రమే వస్తుంది. కొందరు చాలా కాలం కష్టపడితే బ్రేక్ లభిస్తుంది, కొందరికి ఒక్క హిట్‌తో లభిస్తుంది. అతి కొద్ది మంది సోషల్ మీడియాలో వచ్చే పాపులారిటీ కారణంగా బ్రేక్ దక్కించుకుంటారు. అయితే అందరిలోకి అవనీత్ కౌర్ కి దక్కిన బ్రేక్ చాలా అరుదు అని చెప్పాలి. అందరిలాగే అవనీత్ కౌర్ సైతం ఇండస్ట్రీలో నిలదొక్కుకునేందుకు చాలా కష్టపడుతుంది. తాను చేసిన సినిమాలను ప్రమోట్ చేసుకుంటూ, సినిమా ఆఫర్ల కోసం వెతుక్కునే స్థాయి నుంచి ఒక్కసారిగా ఓవర్ నైట్ స్టార్ అయింది. ఇప్పుడు ఆమె కోసం చాలా మంది నిర్మాతలు క్యూ కడుతున్నారు, ఫిల్మ్ మేకర్స్ క్యూ లో నిల్చుని మరీ సినిమా ఆఫర్లు ఇస్తున్నారట.

**కోహ్లీ లైక్‌తో పాపులర్...** ఇంతకు ముందు ఆమె చేసిన సినిమాలను ఆమె తెగ ప్రమోట్ చేసుకునేది, కానీ ఇప్పుడు ఆమె పదుల కొద్దీ బ్రాండ్స్ కి లక్షల రూపాయలు డబ్బు తీసుకుని మరీ ప్రమోట్ చేస్తుంది. ఆమె జీవితాన్ని మార్చేసింది ఏంటో ఇప్పటికే అందరికీ తెలిసిందే. విరాట్ కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్‌లో పొరపాటున అవనీత్ కౌర్ ఫోటోకు లైక్ కొట్టాడు. ఆ లైక్ పొరపాటున కొట్టినదని అప్పటికీ చెప్పాడు.



అయినా కూడా ఆమెకు దక్కాల్సిన ప్రయోజనం దక్కింది. పొందాల్సిన లాభం పొందింది. తక్కువ సమయంలోనే అవనీత్ కౌర్ ఏకంగా రెండు మిలియన్‌ల లైక్స్ ను దక్కించుకోవడం మాత్రమే కాకుండా సినిమాల్లో బిజీ అయింది, యాడ్స్ తో ఫుల్ బిజీగా మారింది. దేశంలోనే పాపులర్ సోషల్ మీడియా సెలబ్రిటీల జాబితాలో చేరి పోయింది.

**అవనీత్ కౌర్ సోషల్ మీడియా సెన్సేషన్...** ఇన్‌స్టాగ్రామ్‌లో అవనీత్ కౌత్ ఫోటోకి పొరపాటను విరాట్ కోహ్లీ లైక్ కొట్టడంతో మొత్తం మారి పోయింది. ఆ ఒక్క లైక్ అవనీత్ కౌర్ జీవితాన్ని మార్చేసింది. కెరీర్ టర్న్ తీసుకునేలా చేస్తే, ఆమె కి మరో జన్మ అన్నట్లుగా చేసింది. ఒక్క లైక్‌కి ఇంత పవర్ ఉంటుందా అని చాలా మందికి ఆశ్చర్యం కలిగేలా అవనీత్ కౌర్ ఈ కొన్ని నెలల్లో అమాంతం ఎక్కడికో వెళ్లి పోయింది. ఓ రేంజ్ లో ఆమె స్థాయి పై పై పెరిగి పోయింది. ఆమె సినిమాలు మాత్రమే కాకుండా వెబ్ సిరీస్ లు చేసేందుకు రెడీ అవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం ఈమె బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ కి సమాంతరంగా సోషల్ మీడియా ద్వారా బ్రాండ్ ప్రమోషన్ చేస్తుందట. అంతే కాకుండా ఆమెకు పలు కంపెనీల నుంచి ఫ్యాన్సీ ఆఫర్లు వస్తున్నాయని సమాచారం అందుతోంది.

**లవ్ ఇన్ వియత్నాం సినిమాతో రెడీ...** జీ టీవీలో ప్రసారమైన డాన్స్ ఇండియా డాన్స్ లిల్ మాస్టర్స్ డాన్స్ షో తో కెరీర్‌ను ప్రారంభించింది. సెమీ ఫైనల్స్ కి ముందే ఎలిమినేట్ అయినా కూడా మంచి గుర్తింపు దక్కించుకుంది. 2012లో లైఫ్ ఓకేస్ మేరి మాతో ఎంట్రీ ఇచ్చింది. అంతే కాకుండా రియాల్టీ షో ఝలక్ దిఖ్లా జా లోనూ పాల్గొనడం ద్వారా మరింత మంది బుల్లి తెర ప్రేక్షకులకు చేరువ అయింది. చిన్న వయసులోనే పెద్ద వారితో పోటీకి నిలవడం ద్వారా ఆ సమయంలో చాలా చర్చనీయాంశం అయింది. ఏక్ ప్రేమ్ కహానీ లో రాజకుమారి దమయంతి పాత్రలోనూ అలరించింది. ప్రస్తుతం ఈమె నటించిన లవ్ ఇన్ వియత్నాం సినిమా విడుదలకు రెడీ అవుతోంది. ఆ సినిమా ప్రమోషన్‌లో అవనీత్ కౌర్ మాట్లాడుతూ తన ఫోటోకు కోహ్లీ లైక్ కొట్టడం, ఆ తర్వాత తన కెరీర్ మారిపోవడంపై స్పందిస్తూ చాలా సంతోషాన్ని వ్యక్తం చేసింది.

## నాగినీకి పోటీగా నాగమ్మ..ఇదేం ట్విస్ట్!

టాలీవుడ్ కి ఇప్పటికే ఓ నాగమ్మ( మౌనీరాయ్) ఎంట్రీ ఇస్తుంది. నాగినీగా తెలుగు ఆడియన్స్ లో ఎంతోఫేమస్. హిందీ డబ్బింగ్ సీరియళ్లతో నాగినిగా ఈ గుర్తింపు సాధ్యమైంది. విశ్వంభర చిత్రంతో అమ్మడు ఐటం భామగానూ అలరించడానికి సిద్ధమవుతోన్నసంగతి తెలిసిందే. ఎంతో మంది బాలీవుడ్ హీరోయిన్లు కాదని మౌనీరాయ్ కి ఆ పాటలో నటించే అవకాశం వచ్చింది. ఇందులో మెగాస్టార్ చిరంజీవి తో కలిసి స్టెప్ అందుకోబోతుంది. సినిమా అంతా ఒక ఎత్తైతే..ఈ పాట మరో ఎత్తు. పాటలో చిరు సహా నాగినీ డాన్స్ తో అలరిస్తారు? అనే ప్రచారం కూడా ఇప్పటికే జరుగుతోంది. ఈ నేపథ్యంలో మౌనీ రాయ్ క్రేజ్ అంతకంతకు పెరిగిపోతుంది. ఈ నేపథ్యంలో నాగినికి పోటీగా నాగమ్మ రంగంలోకి దిగుతుంది. ఈవిడ కూడా అచ్చం తాచుపాము రూపాన్నే కలిగి ఉంటుంది. ఆ గాజు కళ్లు.. ముక్కు..రూప లావణ్యం నాగినీనే తలపిస్తారు. ఎవరా బ్యూటీ ? అన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆమె మోనాలిసా భోంస్లే. ఈ పేరు సోషల్ మీడియాకి పరిచయం అవసరం లేదు. ప్రయాగ్ రాజ్ లో పూసలు అమ్మడంతోనే సోషల్ మీడియాలోపెద్దస్టార్ అయింది. అక్కడ నుంచి బాలీవుడ్ సినిమా



అవకాశాలు ఆశ చూపింది. టాలీవుడ్ కూడా ఛాన్సులిస్తున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగు తోంది. ఇవేవి ఇంత వరకూ జరగలేదు గానీ, తాజాగా మాలీవుడ్ లో అమ్మడు లాంచ్ అవుతుంది. మోనాలిసా ప్రధాన పాత్రలో %-%నాగమ్మ%-% అనే చిత్రం కొచ్చిలో ప్రారంభమైంది. సెప్టెంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది. పి. బిను వర్గీస్ ఈచిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. ఇదీ ఓ పాము కాన్సెప్ట్ ను ఆధారంగా తీసుకుని తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కథను జస్ట్ ఫై చేస్తూ నాగమ్మ అనే టైటిల్ పెట్టినట్లు కనిపిస్తుంది. ఈ తరహా సినిమాలొచ్చి చాలా కాల మవుతుంది. సినిమా ట్రెండ్ మారిన నేపథ్యంలో కథలు కూడా మారాయి. దీంతో సోషియో ఫాంటసీ కథలకు డిమాండ్ తగ్గింది. తాజాగా %-%నాగమ్మ%-%తో మళ్లీ మాలీవుడ్ కంబ్యాక్ అవ్వడం విశేషం. ఈ చిత్రాన్ని తెలుగులో కూడా అనువదించే అవకాశం ఉందంటున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536